ఆదివారం
15-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 264
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

బనకచర్లపై మాటల మంటలు

గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటలతూటాలు పేలాయి. బనకచర్ల నిర్మాణంతో తెలంగాణకు తీవ్ర నష్టమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొనగా... దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనిని అడ్డుకొని తీరతామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

కళ్లు తెరవండి: హరీశ్‌రావు

విశాలాంధ్ర–హైదరాబాద్: కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో... గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలా ఉపయోగపడుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. "బనకచర్ల ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంటే.. మన ప్రభుత్వానికి నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం ఈ నెలాఖరుకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడానికి రావట్లేదు. కేటీఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ప్రభుత్వానికి ధ్యాస తప్ప... రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదన్నారు. గోదావరి–బనకచర్లకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోందన్నారు. రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే తమకు ముఖ్యమన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి నష్టం జరగక ముందే ప్రాజెక్టును అడ్డుకోవాలన్నారు.

ఆరోపణలు నిరాధారం: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర– హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఖండించారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నామన్నారు. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాసినట్టు చెప్పారు. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వారి దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ మౌనం వహించలేదన్నారు. చట్టపరంగా ముందుకెళ్తున్నట్టు చెప్పారు. హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయన్నారు. నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్సే అని మంత్రి ఆరోపించారు.'కృష్ణానది వాటాను కేవలం 299 టీఎంసీలకే పరిమితం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదు. ఏపీ... రోజూ మూడు టీఎంసీలు మళ్లిస్తుంటే కేసీఆర్ చోద్యం చూశారు. జగన్, కేసీఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టారు' అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు.

నిజాలు త్వరలో వెల్లడిస్తాం

- బాధితుల బాధ అర్థం చేసుకోగలను
- బ్లాక్‌బాక్స్‌ను పరిశీలిస్తున్నాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన దుర్ఘటనను పౌర విమానయాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమాన ప్రమాదంపై త్వరలోనే వాస్తవాలు వెల్లడిస్తామని చెప్పారు. విమానయాన భద్రతపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష

- మిగతా 2 లో

20, 21న డీఎస్సీ పరీక్షల తేదీలు మార్పు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షల తేదీలను మార్పు చేస్తున్నట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా డే సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని వారి రాకపోకలకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో ఈ పరీక్షల తేదీలు మార్చినట్లు ఆయన వివరించారు. జూలై

- మిగతా 2 లో

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: ఆధార్ కార్డు వినియోగదారులకు... ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు ఇచ్చిన గడువును భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) మరోసారి పొడిగించింది. ఉచిత సేవలకు శనివారంతో గడువు ముగియాల్సి ఉండగా, దానిని మరో ఏడాది పాటు అంటే 2026, జూన్ 14వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు యూఐడీఏఐ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. ఆధార్‌ను అప్‌డేట్‌గా ఉంచేందుకు డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని మరోసారి కల్పిస్తున్నామని, దీనివల్ల లక్షలాది

- మిగతా 2 లో

ఇరాన్ ప్రతిఘటన

క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడులు

- తెహ్రాన్ తగలబెట్టేస్తాం: కట్జ్
- కఠినంగా శిక్షిస్తాం: ఖామేనీ

పశ్చిమాసియా రగలిపోతోంది. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య భీకర పోరు సాగుతోంది. ఇజ్రాయిల్ దూకుడును ఇరాన్ ప్రతిఘటిస్తోంది. పరస్పరం క్షిపణి దాడులతో ఆయా ప్రాంతాల్లో బాంబుల మోత మోగుతోంది. తాజా దాడుల్లో ఇరాన్‌కు చెందిన నటాజ్ అణు కేంద్రం దెబ్బతిన్నది. మెహ్రాబాద్ విమాశ్రయంపై రెండు క్షిపణులు పడటంతో కొంత మేరకు నష్టం జరిగింది. రాజధాని తెహ్రాన్ వరుస బాంబు దాడులతో దద్దరిల్లింది.

2లో

ఘనంగా గద్దర్ పురస్కారాల ప్రదానోత్సవం

అవార్డు అందుకున్న వెంకీ అట్లూరి, చంద్రబోస్

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం–2024 హైటెక్స్‌లో శనివారం ఘనంగా జరిగింది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత దిల్‌రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ జ్యోతి వెలిగించి వేడుకను ప్రారంభించారు. సినీ ప్రముఖులు బాలకృష్ణ, సుకుమార్, మణితర్నం, సుహాసిని తదితరులు వేదికలో ఆశీనులయ్యారు. విజేతలకు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి అవార్డులు అందజేశారు. మెమొంటోతోపాటు రూ.ఐదు లక్షలు, ప్రశంసా పత్రం అందించారు. ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), ఉత్తమ సినిమాటోగ్రాఫర్‌గా విశ్వనాథ్ రెడ్డి (గామి), ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్‌గా అధ్నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ),

ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా నల్ల శ్రీను (రజాకార్), ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా అర్చనా రావు, అజయ్‌కుమార్ (కల్కి 2898 ఏడీ), ఉత్తమ ఎడిటర్‌గా నవీన్ నూలి (లక్కీ భాస్కర్), ఉత్తమ గేయ రచయితగా చంద్రబోస్ (రాజు యాదవ్), ఉత్తమ కథా రచయితగా శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి) ఆయా విభాగాల్లో అవార్డులు అందుకున్నారు. కాగా,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవానికి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.



నేడు విదేశీ పర్యటనకు మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం మూడు దేశాల పర్యటనకు వెళుతున్నారు. ఈనెల 15–16 తేదీల్లో సైప్రస్‌లో పర్యటిస్తారు. 16–17 తేదీల్లో కెనడాలోని జీ–7 సదస్సులో పాల్గొంటారు. 18న క్రొయేషియాలో పర్యటిస్తారు. కేంద్ర విదేశాంగ శాఖ శనివారం ఈ వివరాలు వెల్లడించింది. ఎంఈఏ వివరాల ప్రకారం సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు మోదీ ఈనెల 15–16 తేదీల్లో ఆ దేశంలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కాళేశ్వరం ప్రాజెక్టు రద్దు చేయండి

- పేదల రహిత దేశంగా చూపాలని కేంద్రం కుట్ర
- వాస్తవాలు మరుగునపడేసేందుకు తప్పుడు ప్రచారం
- కమ్యూనిస్టులను తుదముట్టించేందుకే ఆపరేషన్ కగార్: కూనంనేని

విశాలాంధ్ర – హనుమకొండ: కాళేశ్వరం ప్రాజెక్టుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, ప్రజలపై భారం మోపే కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలని అన్నారు. దాని నిర్వహణ కోసం ఏటా వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఖర్చు చేయొద్దని సూచించారు. స్థానిక హరిత కాకతీయ హోటల్‌లో శనివారం సీపీఐ జిల్లా సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ... కేసీఆర్ అంటే కాళేశ్వరం... కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు నేడు నోరు మూసుకున్నారని, తన మెదడును కరిగించి డిజైన్ చేశానని, కాళేశ్వరంనకు అన్నీ నేనే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదంటున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ బాధ్యత ఇంజినీర్లదే అని తప్పించుకుంటున్నారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును మహారాష్ట్ర అనుమతి ఇవ్వలేదని, అందుకే కాళేశ్వరంనకు మార్చామని హరీశ్‌రావు అంటున్నారని, అలా అని జనాలను ముంచే ప్రాజెక్టు కడతారా అని ప్రశ్నించారు. 140 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాలని తాము డిమాండ్ చేశామని, అక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే అన్ని జిల్లాలకు సాగునీరు అందేదని చెప్పారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఇవ్వలేదని, నేడు పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని చెప్పారు. భారతదేశం ఆర్థికంగా జపాన్‌ను దాటి నాల్గవ

- మిగతా 2 లో

'నీట్' టాపర్లు మహేశ్, ఉత్కర్ష్

100లోపు ర్యాంకుల్లో తెలుగు తేజాలు

మహేశ్ కుమార్ ఉత్కర్ష్ అవదియా

న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్- యూజీ) ఫలితాలు విడుదలయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శనివారం ఈ ఫలితాలను విడుదల చేసింది. అంతకుముందు ఫైనల్ కీని విడుదల చేసింది.

ఆ తర్వాత కొన్ని గంటలకే తుది ఫలితాలను ఎన్టీఏ ప్రకటించింది. అభ్యర్థులకు మెయిల్స్ ద్వారా స్కోర్ కార్డులు అందుతున్నట్లు తెలుస్తోంది. నీట్ యూజీ 2025 పరీక్ష రాసిన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ https://neet.nta.nic.in ద్వారా ఫలితాలు పరిశీలించుకోవచ్చని ఎన్టీఏ వెల్లడించింది. ఈ ఫలితాల్లో రాజస్థాన్‌కు చెందిన మహేశ్ కుమార్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్ అవదియా రెండో ర్యాంకు, మహారాష్ట్రకు చెందిన క్రిషాంగ్ జోషి మూడో ర్యాంక్, ఢిల్లీ–ఎన్సీటీకి చెందిన మృణాల్ కిషోర్ ఝా నాలుగో ర్యాంక్, అవికా అగర్వాల్ ఐదో ర్యాంక్ సాధించారు. ఇక ఈ ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు టాప్ 100లో వివిధ ర్యాంకులు సాధించారు. జీవన్ సాయికుమార్ 18వ ర్యాంక్... షణ్ముఖ నిషికాంత్ అక్షింతల 37, ఎం.వరుణ్ 46, వై. షణ్ముఖ్ 48, విదిశా మరీఖ 95వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్తీక్ రామ్ కిరీటి 19వ ర్యాంకు, కొడవటి మోహిత్ శ్రీరామ్ 56, దేశిన సూర్య చరణ్ 59, పి.అవినాశ్ 64, వై.సమీర్ కుమార్ 70, టి.శివమణి 92వ ర్యాంక్

- మిగతా 2 లో

మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్

నలుగురు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర–చింతూరు: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం ఎన్‌కౌంటర్ జరిగింది. పంచామా దాదర్ రేంజ్ ఆడవుల్లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకర పోరు సాగింది. ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మరణించారు. ఈ మేరకు బాలాఘాట్ ఎస్పీ నాగేంద్ర కుమార్ సింగ్ వెల్లడించారు. మావోయి స్టుల ఏరివేతకు చేపట్టిన ఆపరేషన్లలో భాగంగా స్థానిక పోలీసులు, హాక్ దళం సం యుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మరణించినట్లు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారన్నారు. మావోయిస్టుల నుంచి ఐఎన్ఎస్ఏఎస్ తుపాకీ, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్), పాయింట్ 303 తుపాకీతో పాటు మరికొన్ని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ముగ్గురు మావోయిస్టులపై రూ.62 లక్షల రివార్డు ఉందన్నారు. ఈ ఆపరేషన్ మరింత

- మిగతా 2 లో

అల్లం గోపాలరావు కన్నుమూత

విశాలాంధ్ర–హైదరాబాద్: రంగస్థల, సినీ, టీవీ కళాకారుడు, గాయకుడు, హేతువాది అల్లం గోపాలరావు (75) కన్నుమూశారు. కొంతకాలంగా ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన

- మిగతా 2 లో

ఇరాన్ ప్రతిఘటన

టెల్‌అవీవ్/తెహ్రాన్: పశ్చిమాసియా రగలిపోతోంది. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య భీకర పోరు సాగుతోంది. ఇజ్రాయిల్ దూకుడును ఇరాన్ ప్రతిఘటిస్తోంది. పరస్పరం క్షిపణి దాడులతో ఆయా ప్రాంతాల్లో బాంబుల మోత మోగుతోంది. తాజా దాడుల్లో ఇరాన్‌కు చెందిన నటాజ్ అణు కేంద్రం దెబ్బతిన్నది. మెహ్రాబాద్ విమానాశ్రయంపై రెండు క్షిపణులు పడటంతో కొంత మేరకు నష్టం జరిగింది. రాజధాని తెహ్రాన్ వరుస బాంబు దాడులతో దద్దరిల్లింది. వెనక్కు తగ్గకుంటే తెహ్రాన్‌ను శిథిలం చేస్తామని ఇజ్రాయిల్ హెచ్చరించింది. మాపై దాడిని ఉపేక్షించబోం.. కఠినంగా శిక్షిస్తామని ఇరాన్ తేల్చిచెప్పింది. శనివారం ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు ఇరాన్‌లో బీభత్సం సృష్టించాయి. ఇజ్రాయిల్ విరుచుకుపడుతుంటే ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేసింది. టెల్ అవీవ్ లక్ష్యంగా ఇరాన్ దీర్ఘశ్రేణి క్షిపణులతో ఇజ్రాయిల్‌లోని అణు కేంద్రాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేసింది. సైన్యాధికారులు, శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకుంది. దీంతో టెల్ అవీవ్‌తో పాటు జెరూసలేంలో సైరన్లు మోగాయి. ఇజ్రాయిల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌పై హౌతీలు క్షిపణి దాడి చేయగా, ముగ్గురు పిల్లలు సహా ఐదుగురు పలస్తీనియన్లు మరణించారు. ఇజ్రాయిల్ దాడుల్లో తెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్రయం దెబ్బతిన్నది. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో గురువారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 78 మంది చనిపోగా, 320 మందికిపైగా గాయపడ్డారని ఇరాన్ వర్గాల సమాచారం. అటు ఖమేనీ ఇంటికి దగ్గరలో ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. తెహ్రాన్‌లోని మోనిరియాలో ఖమేనీ నివాసంతో పాటు అధ్యక్ష కార్యాలయం ఉన్నాయి. వీటి సమీపంతో ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు బాంబు దాడులు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఇప్పటికే తెహ్రాన్, టెల్ అవీవ్‌లో ఎమర్జెన్సీ ప్రకటించారు.

మరో ఇద్దరు సైన్యాధికారులు, ముగ్గురు శాస్త్రవేత్తల మృతి

ఆపరేషన్ రైజింగ్ లయన్‌లో ఇరాన్‌కు చెందిన మరో ఇద్దరు కీలకాధికారులు, ముగ్గురు అణు శాస్త్రవేత్తలు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం దాడుల్లో రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) చీఫ్ మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ, సైనిక దళాల పర్యవేక్షకుడు జనరల్ మహమ్మద్ బాఘేరి, దేశ క్షిపణి కార్యక్రమ అధిపతి జనరల్ అమీర్ అలీ సహా ఆరుగురు అణు శాస్త్రవేత్తలు మృతి చెందారు. తాజా దాడుల్లో సాయుధ దళాల జనరల్ స్టాఫ్ నిఘా డిప్యూటీ జనరల్ ఘోలామ్రేజా మెహ్రాబీ, ఆపరేషన్ డిప్యూటీ జనరల్ మెహదీ రబ్బానీతో పాటు అణు శాస్త్రవేత్తలు అలీ బకాయ్ కరీమీ, మన్సూర్ అస్గారీ, సయీద్ బోర్జి తస్నీన్ మృతి చెందినట్లు స్థానిక మీడియా పేర్కొంది. రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు చెందిన ముగ్గురిని హతమార్చినట్లు ఇజ్రాయిల్ పేర్కొంది. కాగా, ఇరాన్‌లోని పశ్చిమ ప్రావిన్స్ హందాన్‌లో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇద్దరు చనిపోగా, ఐదుగురు గాయపడ్డారు.

ఇరాన్‌కు కొత్త సైన్యాధిపతి

అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ అండ దండలతో ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని, ఇందుకు భారీ మూల్యం తప్పబోదని ఇరాన్ అధినేత ఆయాతుల్లా అలీ ఖమేమీ హెచ్చరించారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ సైన్యాధికారి మహమ్మద్ బాఘేరి మరణించడంతో ఆయన స్థానంలో అమీర్ హతామి నియమించినట్లు పేర్కొన్నారు. అమీర్ హతామి 2013 నుంచి 2023 వరకు ఇరాన్ రక్షణ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

అణ్వస్త్ర కార్యక్రమమే లక్ష్యం: నెతన్యాహు

ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉండేందుకు వీల్లేదని ఇజ్రాయిల్ చెబుతోంది. అందుకు అమెరికా వంత పాడుతుండటంతో ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరింతగా రెచ్చిపోతున్నారు. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమమే తమ లక్ష్యమని, ఈ ఆపరేషన్ తొలి దశ దాడులు విజయవంతమయ్యాయని చెప్పారు. పూర్తిగా ముప్పు తొలిగేంత వరకు దాడులు కొనసాగుతాయని, ఇది ఆరంభం మాత్రమేనని వెల్లడించారు. ఇరాన్ అధిక మొత్తంలో శుద్ధిచేసిన యురేనియాన్ని ఉత్పత్తి చేసింది. దాంతో తొమ్మిది అణు బాంబులు తయారు చేసేందుకు వీలు ఉంది' అని నెతన్యాహు వెల్లడించారు. కొన్ని నెలలుగా ఇరాన్ దూకుడుగా చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇరాన్‌ను ఇప్పుడు ఆపకపోతే అణ్వాయుధాలను తయారు చేస్తుంది. ఇజ్రాయిల్‌కు తీవ్ర ముప్పు పొంచి ఉంది కాబట్టే ఇరాన్‌ను కట్టడి చేయడం కోసం దాడులు చేస్తున్నాం' అని తెలిపారు. కాగా, ఇజ్రాయిల్ క్షిపణి రక్షణ వ్యవస్థను దాటుకొని వెళ్లి ఆ దేశానికి కొంత మేర నష్టాన్ని ఇరాన్ క్షిపణులు చేకూర్చినట్లు నివేదికలు తెలిపాయి. ఇరాన్ క్షిపణుల్లో కొన్నింటిని గాల్లోనే ధ్వంసం చేసినట్లు ఇజ్రాయిల్ వెల్లడించింది. తెహ్రాన్‌ను తగలబెట్టేస్తామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ హెచ్చరించారు. పౌరులపై ఫైరింగ్ రెడ్‌లైన్‌ను దాటినందుకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పబోదన్నారు. ఖమేమీ వెనక్కు తగ్గకపోతే తెహ్రాన్‌ను బూడిద చేస్తామని కట్జ్ హెచ్చరించారు.

గుణపాఠం నేర్పాల్సిందే-అణు చర్చలు అర్థరహితం: ఇరాన్

అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ మద్దతుతో ఇజ్రాయిల్ తమపై దాడులకు పాల్పడుతోందని ఇరాన్ మండిపడింది. తమ దేశ ప్రతిష్ఠ పునరుద్ధరణకు, ప్రజల న్యాయమైన హక్కుల పరిరక్షణకు ఇజ్రాయిల్‌కు గుణపాఠం నేర్పడం అనివార్యమైందని ఇరాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫాతిమా మొహాజరనీ అన్నారు. ఈ ఉగ్రరాజ్యంపై కఠిన చర్యలు తప్పవన్నారు. అదే సమయంలో అణు ఒప్పందానికి అవకాశం లేదని కూడా ఇరాన్ తేల్చిచెప్పింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఇక అర్థం లేదని పేర్కొంది. ఇప్పటికైనా అణు ఒప్పందంపై చర్చలకు రాకపోతే తీవ్ర పరిణామాలను ఇరాన్ ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ఇంత దూరం వచ్చాక అణు కార్యక్రమంపై చర్చలు జరపడం అర్థరహితమని, తమ దేశంపై దాడి చేసేందుకు ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతిస్తోందని ఇరాన్ మండిపడింది. ఒకవైపు దాడులు.. మరోవైపు చర్చలకు ఆహ్వానించడం తగదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ పేర్కొన్నారు. అమెరికా అనుమతి లేకుండా ఇజ్రాయిల్ దాడి చేస్తోందా అని నిలదీశారు. ఇదిలావుంటే ట్రంప్ మాత్రం ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులను సమర్థించారు. ఇరాన్‌కు ఇచ్చిన 60 రోజుల గడువు ముగిసింది కాబట్టి ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. అణు ఒప్పందం చేసుకోవాలని ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చారు.

సంయమనం పాటించండి: పోప్

సంయమనం పాటించాలని ఇజ్రాయిల్, ఇరాన్ దేశాధినేతలకు పోప్ లియో పిలుపునిచ్చారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. 'ఇది సున్నితమైన పరిస్థితి. బాధ్యతగా వ్యవహరించాలి. రక్తపాతం ద్వారా సమస్యలు పరిష్కారం కావు. సంయమనం పాటించి దౌత్యపద్ధతుల్లో పరిష్కారానికి కృషి చేయడం శ్రేయస్కరం' అని పోప్ హితవు పలికారు.

67 అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం

దుబాయ్: దుబాయ్‌లోని ఓ బహుళ అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో వేలాదిమంది నివాసితులను సురక్షితంగా తరలించిన అధికారులు... గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దుబాయ్ మీడియా కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం... 'టైగర్ టవర్'గా పేరు పొందిన ఇక్కడి 67 అంతస్తుల 'మెరీనా పినాకిల్' భవనంలో శుక్రవారం అర్ధరాత్రి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. దాదాపు 6 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు స్థానిక మీడియా తెలిపింది.

నిజాలు త్వరలో వెల్లడిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టినట్లు తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం, పౌరవిమానయాన శాఖ సంయుక్తంగా స్పందించినట్లు పేర్కొన్నారు. 'ఘటన జరిగిన వెంటనే మంటలార్పి... మృతదేహాలను అక్కడి నుంచి తరలించాం. దుర్ఘటనపై విచారణకు తక్షణమే ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే మరికొంత మంది సభ్యులనూ బృందంలో చేరుస్తాం. శుక్రవారం సాయంత్రం ఘటనాస్థలిలో బ్లాక్స్‌బాక్స్ దొరికింది. దానిని విశ్లేషించిన తర్వాత ఏం జరిగిందనేది పూర్తిగా తెలుస్తుంది. అందులో ఏముందో తెలుసుకునేందుకు మేమూ ఆతృతగా ఎదురుచూస్తున్నాం. దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాల బాధను అర్థం చేసుకోగలను. నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. ఆ బాధ నాకు కూడా తెలుసు. హోంశాఖ కార్యదర్శి అధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశాం. ప్రత్యేక అధికారులతో, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశాం. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ సభ్యులు దోహదపడతారు. నిపుణుల విచారణ పూర్తయ్యాక తగిన సమయంలో మీడియాకు సమాచారమిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని భావిస్తున్నాం. బోయింగ్ 787 సిరీస్‌ను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించాం' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న 242 మందిలో 241 మంది ప్రాణాలు కోల్పోగా... ఒక్కరు మాత్రం మృత్యుంజయుడిగా నిలిచాడన్నారు. విమానం మెడికల్ కాలేజ్ హాస్టల్‌లోకి దూసుకెళ్లడంతో 33 మంది మెడికోలు కూడా ప్రాణాలు కోల్పోయారన్నారు. విమాన ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. గడిచిన రెండు రోజులు భారంగా గడిచిందని చెప్పారు. విమాన ప్రమాదం జరిగిన వెంటనే నేను ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాం. ప్రమాద స్థలాన్ని పరిశీలించాను' అని వివరించారు. మృతులకు డీఎన్ఏ టెస్టులు కూడా జరుగుతున్నాయన్నారు. 24 గంటల్లోనే ప్రధాని మోదీ ప్రమాద స్థలాన్ని పరిశీలించారన్నారు. అత్యున్నతస్థాయి కమిటీతో సోమవారం భేటీ కానున్నట్లు తెలిపారు. గడిచిన 48 గంటల నుంచి ప్రజలకు అన్ని విషయాలు తెలియజేస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. పౌరవిమానయాన శాఖ కార్యదర్శి మాట్లాడుతూ విమానాశ్రయం నుంచి 2 కి.మీ దూరం వెళ్లిన తర్వాత... 650 అడుగుల ఎత్తులో ఉన్నప్పుడే విమానం కూలిపోయినట్లు తెలిపారు. 'అహ్మదాబాద్ ఏటీసీకి పైలట్ మేడే కాల్ ఇచ్చారు. విమాన సిబ్బందిని ఏటీసీ సంప్రదించినా స్పందన రాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయబృందాలు ఘటనాస్థలికి చేరాయి. రెండు గంటల్లో ఉన్నతాధికారుల బృందమంతా ఘటనాస్థలికి చేరుకుంది. గుజరాత్ ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించింది. సాయంత్రం 6 గంటలయ్యేసరికి అగ్నిమాపక శాఖ మంటలార్పేసింది. ఎస్‌వోపీ ప్రకారం తక్షణమే విచారణకు ఆదేశాలు ఇచ్చాం' అని ఆయన వివరించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు రద్దు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

స్థానం ఆక్రమించిందని కేంద్ర సర్కార్ అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతుందని, కృత్రిమంగా పేదలు లేని దేశంగా చూపాలని ప్రయత్నిస్తున్నదని కూనంనేని విమర్శించారు. రోజుకు రూ.280 నుంచి రూ.320 సంపాదిస్తే పేదలు ధనవంతులుగా ఎలా మారుతారని ప్రశ్నించారు. నెలకు రూ.ఎనిమిది వేలకు కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారన్నారు. నెలకు రూ.20 వేల ఆదాయం ఉన్నా పేదవారుగానే పరిగణించాలని అన్నారు. ప్రపంచ దేశాల్లో ఆకలితో అలమటిస్తున్నవారిలో దేశం 101 స్థానంలో నిలిచిందని, కొనుగోలుశక్తిలో 124 స్థానంలో నిలిచినట్లు సూచికలు తెలుపుతున్నాయన్నారు. కేంద్రం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, వాస్తవాలను మరుగునపడేసేందుకు తప్పుడు ప్రచారం చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని, ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కలలు కంటున్నదని విమర్శించారు. మావోయిస్టులు తప్పు చేస్తే చట్టప్రకారం కేసులు పెట్టాలని, 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని చెప్పడం ఒక ఫ్యూడల్, గూండా, ఫాసిస్ట్ పాలనకు నిదర్శనం అని మండిపడ్డారు. మావోయిస్టులు లొంగిపోతామన్నా, చర్చలకు సిద్ధం అని ప్రకటించినా హతమార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, కానీ ఒక్క నంబాల కేశవరావును చంపితే దేశంలో కోట్లాది మంది స్పందించారని, అదీ కమ్యూనిస్టులకు ఉన్న మానవతావాదానికి నిదర్శనం అని అన్నారు.

పేదల గుడిసెలకు ఇళ్ల పట్టాలివ్వండి

పేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కూనంనేని డిమాండ్ చేశారు. హనుమకొండ మండలం గుండ్ల సింగారంలో పేదల గుడిసెలను రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి సందర్శించారు. జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన గుడిసెవాసులతో జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా బడుగు బలహీన వర్గాలు ఇల్లు లేక దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. పేదల కోసం పోరాటం చేసేది ఒక కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. ఇళ్ల స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు.

ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, ఎన్ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మోతె లింగారెడ్డి, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మంచాల రమాదేవి, మునిగాల బిక్షపతి, బి. సంతోష్, కొట్టేపాక రవి, మాలోత్ శంకర్, గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు గాదె రాజన్న, మాదాసి కళ్యాణ్, గాదె మొగిలి, కట్కూరి కృష్ణ, పోనుగోటి రాము, గోపాల్ చారి, పూజారి అమృతయ్య, తరాల సంపత్, కొడెపాక

బాబు, పూజారి నరేందర్, గడ్డం గోవర్ధన్, పొన్నాల హరికృష్ణ, రోంటాల దేవ, మమునూరు మాలోత్ మంగ, బైసా మౌనిక, నలువాల సంధ్య, రాధిక, గుంటి రజిత, ఇమామ్, సురేష్ పాల్గొన్నారు.

'కూనంనేని'కి సీఎం జన్మదిన శుభాకాంక్షలు

కూనంనేని సాంబశివరావుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు తెలంగాణ సీఎంఓ అధికార ట్విట్టర్ (ఎక్స్)లో పోస్ట్ చేశారు. ప్రతిగా ముఖ్యమంత్రికి కూనంనేని ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఏఐజీ ఆసుపత్రిలో కేసీఆర్‌కు వైద్యపరీక్షలు

విశాలాంధ్ర-హైదరాబాద్: స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ... శనివారం మరోసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గత కొన్ని రోజులుగా ఆయన జలుబుతో బాధపడుతున్నారు. కాళేశ్వరం విచారణ సమయంలో కూడా అనారోగ్యంతోనే విచారణకు హాజరయ్యారు. వైద్యుడు నాగేశ్వర్‌రావు దగ్గరుండి కేసీఆర్‌కు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆయన బంజారాహిల్స్ నందీనగర్‌లోని నివాసానికి వెళ్లారు. ఐదు రోజుల పాటు అక్కడే ఉండనున్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. గతంలో యశోదా ఆస్పత్రికి తరచుగా వెళుతుండేవారు. అధికారం కోల్పోయిన నాటి నుంచి ఎర్రవల్లి ఫాంహౌస్‌లోనే ఉంటున్నారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రి హరీశ్ రావు ఉన్నారు.

20, 21న డీఎస్సీ పరీక్షల తేదీలు మార్పు

(మొదటిపేజీ తరువాయి)

ఒకటి, రెండు తేదీల్లో పరీక్ష నిర్వహిస్తామని, పరీక్ష తేదీలను మార్చిన హాల్ టికెట్లు ఏపీ మెగా డీఎస్సీ -2025 వెబ్‌సైట్‌లో ఈ నెల 25న అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోని వాటి ప్రకారం పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

మందికి ప్రయోజనం చేకూరుతుందని యూఐడీఏఐ వెల్లడించింది. ఆధార్ కార్డులోని వివరాలను ఎప్పటికప్పుడు తాజాగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. గతంలో ఆధార్ కేంద్రాలకు వెళ్లి వివరాలను మార్చుకోవాలంటే రూ. 50 రుసుము చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో ఎటువంటి ఖర్చు లేకుండానే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.

అల్లం గోపాలరావు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. గోపాలరావు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా హేతువాద ఉద్యమంలో, కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా, ఫిలిం నగర్ కల్చరల్ క్లబ్ కార్యవర్గ సభ్యుడిగా వ్యవహరించారు. అల్లం గోపాలరావు గుండుగొలను గ్రామంలో మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించారు. స్వగ్రామంలోనే హైస్కూలు విద్య పూర్తిచేశారు. భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో బీఎస్సీ చదివారు. సుప్రసిద్ధ సినీనటుడు బ్రహ్మానందం, సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అప్పట్లో గోపాలరావు సహాధ్యాయులు. ఆ తర్వాత ఆంగ్ల సాహిత్యంలో ఎంఏ పట్టా పొందిన గోపాలరావు... విద్యార్థి దశ నుంచి హేతువాద ఉద్యమంతో సంబంధం ఉండేది. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘంలో కఠారి ప్రభాకర రావుతో కలిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. అల్లం గోపాలరావు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సభ్యుడిగా కొంత కాలం ఉన్నారు. ఏలూరులో చైతన్య వేదిక కార్యక్రమాల్లో గోపాలరావు చురుగ్గా పాల్గొన్నారు. కులాంతర, సంస్కరణ వివాహాలను ప్రోత్సహించారు. వివిధ గ్రామాల్లో హేతువాద ఉద్యమ శిక్షణా తరగతుల నిర్వహణలో పాలుపంచు కున్నారు. ఫిలిం నగర్ కల్చరల్ క్లబ్‌లో క్రియాశీల పాత్ర పోషించారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని, హేతువాదాన్ని వివరిస్తూ కొన్ని వీడియోలు కూడా చేశారు. అల్లం గోపాలరావు మృతికి అనేకమంది సంతాపం ప్రకటించారు. ఆయనకు భార్య విమల, కుమారులు అనిల్, సునీల్ ఉన్నారు. పెద్ద కుమారుడు అనిల్ కూడా సినీ, టీవీ రంగాల్లో నటుడిగా రాణిస్తున్నారు.

రామకృష్ణ సంతాపం

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు, సినీ, టీవీ కళాకారులు అల్లం గోపాలరావు మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. సాంస్కృతిక రంగానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గోపాలరావు కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు.

నేడు విదేశీ పర్యటనకు మోదీ

(మొదటిపేజీ తరువాయి)

అధికారిక పర్యటన జరుపుతారు. రెండు దశాబ్దాలలో ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో చర్చల అనంతరం లిమాసోల్‌లో వ్యాపార దిగ్గజాలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు మోదీ పర్యటన దోహదం కానుంది. అనంతరం కెనడాకు మోదీ బయలుదేరి వెళ్తారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఆహ్వానం మేరకు జూన్ 16-17 తేదీల్లో జరిగే జీ-7 సదస్సులో మోదీ పాల్గొంటారు. జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం వరుసగా ఇది ఆరోసారి.

సదస్సు సందర్భంగా పలు ద్వైపాక్షిక సమావేశాల్లోనూ ప్రధాని పాల్గొంటారు. ప్రధాని తన పర్యటన చివరిలో క్రొయేషియా వెళతారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ ఆహ్వానం మేరకు జూన్ 18న ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. క్రొయేషియాలో భారతదేశ ప్రధానమంత్రి పర్యటించనుండటం ఇదే మొదటిసారి. ప్రధాని ప్లెంకోవిక్, అధ్యక్షుడు జోరన్ మిలనోవిక్‌తో మోదీ సమావేశమవుతారు. యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో మరింత పటిష్ట బంధాల గురించి చర్చిస్తారు.

'నీట్' టాపర్లు మహేశ్, ఉత్కర్ష్

(మొదటిపేజీ తరువాయి)

సాధించారు. తెలంగాణలో 33 ప్రభుత్వ మెడికల్, రెండు డీమ్డ్, 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీలున్నాయి. వీటిలో మొత్తంగా 8,515 ఎంబీబీఎస్ సీట్లున్నట్లు సమాచారం. మే నాల్గో తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ పరీక్షకు 20.8 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. 5,400కు పైగా కేంద్రాల్లో పటిష్ఠ భద్రత మధ్య పరీక్ష నిర్వహించారు. విదేశాల్లో 14 కేంద్రాల్లోనూ నీట్ యూజీ పరీక్ష జరిగింది. ఈ సారి నీట్ యూజీ పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య తగ్గింది.

గత ఏడాది జాతీయంగా 23 లక్షలకుపైగా అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కాగా, ఈ సారి 20 లక్షల మంది మాత్రమే రాశారు. తెలంగాణ నుంచి 72,507 మంది అభ్యర్థులు నీట్ యూజీ పరీక్ష రాశారు.

ఆపరేషన్ బుడమేరుపై నిరంతర పోరు

విశాలాంధ్ర-విజయవాడ: బుడమేరుకు శాశ్వత పరిష్కారం చూపేవరకు సీపీఐ పోరాడుతూనే ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చ రించారు. నగరంతో పాటు దిగువ ప్రాంతాలకు పెను విషాదానికి కారణమైన బుడమేరుపై యుద్ధ ప్రాతిపదిక పనులు చేపట్టాలని, భవిష్యత్తులో ఎటువంటి నష్టం రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చేపట్టిన నిరసన దీక్ష దద్దరిల్లింది. స్థానిక ధర్నాచౌక్ వద్ద శనివారం సీపీఐ ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల అధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన బుడమేరు ప్రక్షాళన చేయాలని, ఆక్రమణ తొలగించాలని భారీ నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల మాట్లాడుతూ గత సంవత్సరం బుడమేరు కట్ట తెగడంతో విజయవాడ, దిగువ ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ముంపు సమయంలో సీఎం చంద్రబాబు బుల్డోజరుపై ప్రయాణించి ప్రజలకు వివిధ హామీలు ఇచ్చినట్టు గుర్తు చేశారు. భవిష్యత్తులో బుడమేరుతో ఇలాంటి విపత్తులు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని సమస్యకు శాశ్వత పరిష్కారాం చూపుతానని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నేడు తాత్కాలికంగా కేవలం గండ్లు పూడిక పనులు జరగడంతో సమస్య పరిష్కారం కాదని హితవు పలికారు. విజయవాడ నుంచి కొల్లేరు... అక్కడి నుంచి సముద్రంలో కలిసేవరకు దాదాపుగా 160 కిలోమీటర్ల సుదీర్ఘమైన బుడమేరును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. వరదలు వచ్చినా నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు నష్టపోకుండా రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేవలం రూ.50 కోట్లతో సమస్య పరిష్కారం కాదని, ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి వస్తోందన్నారు. ఇప్పటివరకు దిగున ఒక్క గండి పుడ్చటానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ దీర్ఘ కాలంగా ఉన్న బుడమేరు సమస్య వల్ల ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు తీవ్ర నష్టం వాటిల్లింతోందన్నారు. ఈ సమస్య 1988లోనే పార్టీ నాయకులు కొల్లి నాగేశ్వరరావు నాయకత్వంలో పెద్దఎత్తున ఆందోళన పోరాటాలు చేశామని గుర్తు చేశారు. ఈ సమస్యను అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు దృష్టికి తీసుకెళ్లడంతో శాశ్వత పరిష్కారం చూపుతామని నాడు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు బుడమేరుకు శాశ్వత పరిష్కార మార్గం కనుగొనకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ సమస్యలపై పెద్దఎత్తున వామపక్ష పార్టీలు ఉద్యమిస్తాయని ప్రకటించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంచి చేస్తుందని భావించాం కానీ చిన్న సమస్యను పరిష్కరించడానికి ముందుకు రాకపోవడం సరికాదన్నారు. సమస్య పరిష్కారానికి ప్రతిఒక్కరు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దోనేపూడి మాట్లాడుతూ 50 లక్షల క్యూసెక్కుల నీటితో ప్రవహించే బుడమేరు మూడు జిల్లాలను అతలాకుతలం చేసే పరిస్థితి ఉందన్నారు. కృష్ణా నదిలో 12 లక్షల క్యూసెక్కుల నీరు బుడమేరు డైవర్షన్ ఛానల్ ఎగదన్ని, వెలగలేరు రెగ్యులేటర్ పై ఆరు అడుగులు కొవులూరు , రాయన్నపాడు, గుంటుపల్లి, విజయవాడను ముంచెత్తి ఏలూరు అండర్ కెనాల్ ద్వారా కృష్ణా జిల్లాలోని అనేక గ్రామాలను ముంచుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోడం దారుణమని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఎంపీ సంతోకుమార్‌తో కలిసి తామంతా సీఎం చంద్రబాబును కలిసినప్పుడు ఆపరేషన్ బుడమేరు చేపడతామని, ఆక్రమణలు తొలగిస్తామని, పూడికతీత చేస్తామని చెప్పారనీ, కానీ ఇప్పటికి ప్రణాళిక లేకుండా ఒక్క పనికూడా చేపట్టకపోవడం బాధకరమన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ గాడిన పడేనా?



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను పాలనాపరంగా దారికి తీసుకురావడం తేలికగా కనిపించడం లేదు. ఎందుకంటే... చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి అయినా ఇంతవరకూ సచివాలయాల హేతుబద్ధీకరణ పూర్తి కాలేదు. ఇది పూర్తికాకముందే సిబ్బంది బదిలీల గోల ప్రారంభమైంది. వాస్తవానికి కొద్దిరోజుల క్రితం ఆ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయులు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీ ప్రక్రియ లేదని, హేతుబద్ధీకరణ పూర్తి అయిన తర్వాత బదిలీలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే మంత్రి ప్రకటన చేసిన వారం రోజుల వ్యవధిలోనే బదిలీలకు సంబంధించి సమ్మతి, ఆప్షన్ లెటర్లను జిల్లా పంచాయతీ కార్యాలయాల్లో అందజేయాలని సిబ్బందికి సూచనలు అందాయి. ఇటీవలే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి జీవో కూడా విడుదలైంది. మంత్రి చెప్పిన తర్వాత దానికి భిన్నంగా ఉన్నతాధికారులు బదిలీ ప్రక్రియకు ఉత్తర్వులు జారీ కావడం విశేషం. గ్రామ సచివాలయ వ్యవస్థలోని వీఆర్‌ఓల బదిలీలపై రెవెన్యూ శాఖలోని వీఆర్‌ఓ సంఘ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఏ శాఖలో లేని పరిస్థితి గ్రామ సచివాలయ వ్యవస్థలో ఉంది. పంచాయతీ రాజ్ వ్యవస్థలోనే గ్రామ సచివాలయ వ్యవస్థ అంతర్భాగం అయినప్పటికీ ఇందులో పనిచేసే ఉద్యోగులు గ్రామ, వార్డు సచివాలయ శాఖ పరిధిలో ఉండటంతో పాటు సిబ్బంది వివిధ శాఖల అధీనంలో పనిచేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రతరం కాబోతోందని, గాలింపులు ముమ్మరం చేస్తామని ఎస్పీ నాగేంద్ర కుమార్ వెల్లడించారు.

ఐఈడీ పేలి సీఆర్పీఎఫ్ అధికారి మృతి

ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో ఐఈడీ పేలి సీఆర్పీఎఫ్ అధికారి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు వెంటనే ఆ పరిసర ప్రాంతాలను అప్రమత్తం చేశారు. మృతిచెందిన అధికారిని ఏఎస్ఐ సత్యబాన్ కుమార్ సింగ్(34)గా గుర్తించారు. తీవ్ర గాయాలైన కుమార్ సింగ్‌ను రూర్కెలాను ఆస్పత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కుమార్ సింగ్ స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఖుషినగర్ జిల్లా. కాగా, రూర్కెలాలోని కే బాలంగ్ గ్రామ సమీపంలోని అడవుల్లో సీఆర్పీఎఫ్ జవాన్లు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా ఐఈడీ పేలింది.

పోగుల శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: విద్యార్థి దశ నుండే సైద్ధాంతిక నిబద్ధత గల మంచి నాయకున్ని కోల్పోవడం సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం రాజులు గ్రామంలో (మృతుడు) శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పని చేశాడని, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా పార్టీ కోసమే చివరిదాకా పనిచేశాడని అన్నారు. శ్రీను పోరాటాలను కార్యకర్తలు ముందుకు తీసుకుపోయినప్పుడే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, కట్టేబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి కరణం రాజన్న, నెల్లూరి నాగేశ్వర్‌రావు, బుర్ర సమ్మయ్య తురక రమేష్, కన్నె వెంకన్న కలగూర నాగరాజు బొళ్ళు వెంకన్న, రవి, లోకేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రామచందర్ నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం హర్షణీయం

విశాలాంధ్ర - తొర్రూరు: డిప్యూటీ స్పీకర్‌గా నియమితులైన డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచందర్ నాయక్‌ను గిరిజన నాయకులు మర్యాదపూర్వక శనివారం సూర్యాపేటలోని ఆయన నివాసంలో తొర్రూరు మండల వెలికట్ట శివారు టీక్యా తండాకు చెందిన జాటోత్ బ్రదర్స్, గిరిజన నాయకులు జాటోత్ స్వామి నాయక్, జాటోత్ సాయి కృష్ణలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొర్రూరు డివిజన్ పరిధిలోని పెద్దవంగర మండలం బొమ్మకల్ శివారు రెడ్డి కుంట తండా గ్రామ పరిధిలోని (సర్పంచ్ తండా) కు చెందిన డాక్టర్ రామచందర్ నాయక్ వైద్యునిగా ప్రజలకు సేవలు అందించి తదనంతరం రాజకీయ ప్రవేశం చేసి ప్రజాసేవ చేస్తున్నాడని వారు కొనియాడారు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తూ ప్రజాభిమానం చూరగొంటున్న రామచందర్ నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం హర్షణీయమని తెలిపారు. ఈ పదవి గిరిజనుల గౌరవాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. త్వరలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు.

సామ్రాజ్యవాద విప్లవ స్వప్నం చేగువేరా

విశాలాంధ్ర - ఖమ్మం : సామ్రాజ్యవాద, వ్యతిరేక సింహ స్వప్నం చేగువేరా అని అఖిల భారత సమాఖ్య కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ అన్నారు. ఖమ్మం శనివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గిరి ప్రసాద్ భవన్‌లో చేగువేరా 97వ జయంతి సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఆయా దేశాల్లో అణిచివేతపై గెరిల్లా పోరాటాలు నడిపి స్వాతంత్ర్య ఫలాలు అందించిన ప్రపంచ విప్లవ వీరుడు చేగువేర అన్నారు. అర్జెంటీనాలో జన్మించి, క్యూబా విప్లవ సాధనలో నిలిచి, బొలీవియా విప్లవ సాధనలో 39 ఏళ్ల వయసులో అమరుడైన చేగువేరా చిరస్మరణీయుడు, యువతకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. 1928 జూన్ 14న అర్జెంటీనా దేశంలోని రొసారియాలో జన్మించిన ఆయన 1955 మెక్సికోలో క్యూబా ప్రవాస విప్లవకారుడు ఫైడల్‌కాస్ట్రోతో పరిచయం ఏర్పడింది. క్యూబా స్వాతంత్ర్యం కోసం అస్తమా వ్యాధిని సైతం లెక్కచేయకుండా 1959లో ఆవిష్కృతమైన స్వాతంత్ర్య క్యూబాలో చేగువేరా పరిశ్రమల మంత్రిగా, జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా, ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా, రక్షణ కేంద్రాల అధిపతిగా, ఆర్థిక, మైత్రీ బృందాల సభ్యులుగా ఎన్నో బాధ్యతలు, నిర్వహించారన్నారు. ఇవన్నీ తన 39 ఏండ్ల ప్రాయంలోనే నిర్వహించారు. తను అత్యంత ఇష్టపడే స్నేహితుడు కాస్ట్రో, క్యూబా ప్రజలకూ 1965లో వీడ్కోలు పలికి ఎన్నో దేశాలు తిరిగాడని పేర్కొన్నారు. చేగువేరా జీవిత చరిత్ర వందభాషల్లోకి అనువాద మైంది. చేగువేరా జీవితం యువతకు ఆదర్శం కావాలన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ సైదా శంకర్రావు శంకర్ మహేష్ గోపి రాకేష్ ప్రతాప్ పవన్ సరేందర్ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : శనివారం పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్‌అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా జడ్జి ఎస్. శ్రీవాణితో కలిసి జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసులు సంవత్సరాలుగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రజలు మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని, లోక్‌అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకి వచ్చి త్వరితంగా న్యాయం పొందవచ్చని తెలిపారు. కోర్టు చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రశాంతంగా జీవించవచ్చన్నారు. ఇటీవల జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాలు, నైతిక విలువలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమాచార శాఖ కళాజాత బృందాల ద్వారా గ్రామాలలో విస్తృత ప్రచారం చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, పలు క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, ఆస్తి గొడవలు వంటి కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయవాదులు ప్రజలను లోక్ అదాలత్‌కు ప్రోత్సహించాలన్నారు. అనంతరం, లోక్ అదాలత్ ద్వారా తమ విడాకుల కేసును పరిష్కరించుకున్న భార్యాభర్తలను కలెక్టర్, న్యాయమూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, అడిషనల్ ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నరేందర్, కోర్టు అధికారులు, న్యాయవాదులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఈ నెల 16 న జరిగే రైతు నేస్తం నేపథ్యంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడుతారని ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. సోమవారం నిర్వహించి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 58 రైతువేదికలలో రైతు నేస్తం కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రైతు వేదికలల్లో పండుగ వాతావరణం కనిపించేలా మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించాలన్నారు. ఆ రోజు మధ్యాహ్నం రెండున్నర గంటలకే రైతులు చేరుకునేలా చూడాలన్నారు. ఆడియో, వీడియోల్లో ఎలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందుగా సిద్ధమవ్వాలని చెప్పారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున హాజరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించాలని కోరారు. రానున్న వర్షాకాలంలో ఎక్కడైతే వర్షం నీరు నిలుస్తుందో అక్కడ వెంటనే ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

బియ్యం పంపిణీలో అవకతవకలు అరికట్టాలి

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తిలో రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని వెంటనే అరికట్టాలని సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి జె. రమేష్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రేషన్ షాపులను సందర్శించారు. బండారు నగర్ రేషన్‌షాప్‌లో బియ్యం పంపిణీని పరిశీలించి, వినియోగదారులతో ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సక్రమంగా బియ్యం సరఫరా చేయక పలు దుకాణాలు మూతపడ్డాయన్నారు. రేషన్ కార్డులు పట్టుకొని ప్రజలు బియ్యం కోసం కాళ్ళ అరిగేలా తిరుగుతున్నారన్నారు. స్టాక్ ఉన్నచోట గంటలతరబడి క్యూలో నిలబడి చివరికి స్టాక్ లేకపోవడంతో బాధతో ఇంటికి వెళ్తున్నారన్నారు. రేషన్‌షాప్‌లో క్యూలో చివర ఉన్నవారికి ఈరోజు రేషన్ దొరకలేదన్నారు. స్టాక్ వస్తే మళ్లీ పంపిణీ చేస్తామని డీలరు చెప్పారన్నారు. జూన్ జులై ఆగస్టు మూడు నెలల స్టాకు ఒకేసారి పంపిణీతో ఒక్కొక్కరికి ఇచ్చేందుకు 15 నుంచి 20 నిమిషాలు పడుతోందన్నారు. తగినంత స్టాక్ రేషన్ షాప్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాక బియ్యం పంపిణీలో స్టాక్ పాయింట్ నుంచి డీలర్ వరకు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ అవకతవకలపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్య తీసుకోవాలన్నారు. ఈ నెల వరకు జారీ అయిన అన్ని కొత్త రేషన్ కార్డులకు కూడా బియ్యం ఇవ్వాలన్నారు. రేషన్ షాపుల్లో 18 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీలో అవకతవ కలు అరికట్టి, పంపిణీ ఇబ్బందులు తీర్చకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పట్టణ సహాయకార్యదర్శి ఎర్రకురుమన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ / తొర్రూరు : పాలకుర్తి నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. వెంకటాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు దడిగల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన శీలం మల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి తొర్రూరు పట్టణంలో సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శనివారం సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి ఆదుకుంటామన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి అందే సంక్షేమ పథకాలు సకాలంలో అందించే విధంగా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే వెంటా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు గంజి విజయ్‌పాల్ రెడ్డి, తూనం శ్రవణ్ కుమార్, పెద్ది ప్రవీణ్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగుళ్ళ లింగన్న గౌడ్, గ్రామ నాయకులు గుండాల వినయ్, దడిగల మురళి, మద్దెల సురేష్, కొయ్యేటి ప్రవీణ్, జెట్టి యాకెందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

విశాలాంధ్ర - తొర్రూరు : మండలంలోని వెలికట్ట గ్రామ పంచాయతీలో అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం అంగన్వాడీ ముద్దు.. ప్రైవేట్ స్కూల్ వద్దు అని నినాదాలతో ర్యాలీ నిర్వహించి, గ్రామాల్లోని తల్లిదండ్రులకు అవగాహనా కల్పించారు. 3 సంవత్సరాలు నుండి 5 సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని, అంగన్వాడీ సెంటర్ పిల్లలు మానసిక శారీరకంగా అభివృద్ధి జరగటానికి అట పాటలతో విద్య బోధిస్తారన్నారు. గ్రామంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి.రాజ్యలక్ష్మి, కె.శ్రీలత, ఎం.రాజ్యలక్ష్మి, ఎ.శైలజ, ఆయాలు ఎ.పద్మ, ఆర్.సరిత,డి పద్మ, పి.రజిత తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ గజ్జి కృష్ణకు బెస్ట్ మోటివేటర్ అవార్డ్

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా బెస్ట్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు రక్తదాతలను ప్రోత్సహించడం, ఆయన గతంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సిఫారసు మేరకు రాజ్ భవన్ వర్గాలు ఏసీపీ గజ్జి కృష్ణ సేవలను గుర్తించి, బెస్ట్ మోటివేటర్ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రజలకు విశేష సేవలు అందించిన పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ శనివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణకు పెద్దపల్లి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కావేటి రాజగోపాల్ పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పలువురు అభినందనలు, తెలియజేశారు.

రాజీమార్గమే రాజమార్గం

విశాలాంధ్ర - ఇల్లందు : లోకదాలతో రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్టేనని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఇల్లందు మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న పోలీస్ కేసులు రాజిపడదగినవన్నారు. మనోవర్తి, గృహింస, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోటు కేసులలో ఇరువర్గాలు కోర్టుకు వచ్చి రాజీ కుదుర్చుకున్న ట్లైతే ఇరు వర్గాలకు ఎంతో విలువైన కాలాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. అంతేకాకుండా ఒకసారి లోక్ అదాలత్‌లో రాజీ పడినట్లయితే పై కోర్టుకు వెళ్లి అప్పీల్ చేసే అవకాశం ఉండదన్నారు. కోర్టుకు వచ్చి లోక్‌అదాలత్ ద్వారా రాజీ పడినట్లయితే చట్టబద్ధత ఉంటుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు పెద్దూరి వెంకట నరసయ్య, పప్పుల గోపీనాథ్ దంతాల ఆనంద్, ఎస్, వెంకటేశ్వర్లు జూనియర్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సహంగా సిపిఐ అశ్వరావుపేట మండల మహాసభ

విశాలాంధ్ర - కొత్తగూడెం : సిపిఐ అశ్వరావుపేట మండల సమితి ఆధ్వర్యంలో 16వ మండల మహాసభ శనివారం ఎంతో ఉత్సహంతో ఘనంగా నిర్వహించారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహాసభకు మండలంలోని అన్ని గ్రామాల సిపిఐ నాయకులు, కార్యకర్తలు, శాఖా కార్యదర్శులు, సిపిఐ పార్టీ జిల్లా నాయకులు, మండలంలోని వివిధ ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సిపిఐ పార్టీకి పూర్వ వైభవన్ని చాటి చెప్పారు. సీనియర్లు, యువకులతో కూడిన 49 మంది సభ్యులతో మండల కౌన్సిల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వీరిలో 12 మందిని మండల కార్య వర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత అశ్వరావుపేట సిపిఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణను మండల ఇన్చార్జిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాగ్గేల అర్జునరావును మండల కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. సహాయ కార్యదర్శులుగా చిన్నయ్య, కోర్స తిరుపతిరావు, ముక్కంటిలను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా పాల్గొని సిపిఐ జెండాను ఆవిష్కరించారు. సిపిఐ సీనియర్ నాయకులు, దివంగత మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ రజబలి పేరుతో నిర్మించిన సిపిఐ నియోజకవర్గ కార్యాలయాన్ని లంచానంగా సాబీర్ పాషా ప్రారంభించారు.

సింగరేణి పేరు ప్రఖ్యాతలను కాపాడాలి : జియం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి కంపెనీ పేరు ప్రఖ్యాతులను స్థిరంగా కాపాడాల్సిన బాధ్యత సెక్యూరిటీ విభాగంపై ఉందని ఆ శాఖ జనరల్ మేనేజర్ సి హెచ్. లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన తోపాటు కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సైన్ ఆధ్వర్యములో శనివారం కార్పొరేట్ పరిధిలోని సెక్యూరిటీ సిబ్బంధితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిజాయితీగా బాధ్యతగా ఉంటూ ఏమైన సమాచారం తెలిసిన వెంటనే పై అధికారితోపాటు ఇంటిలిజెన్స్ విభాగానికి చెప్పాలన్నారు. యస్ అండ్ పిసి సెక్యూరిటీ, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది తారతమ్యత లేకుండా అందరూ ఐక్యతగా వుండాలని కోరారు. వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. హెడ్ ఆఫీస్, మెయిన్ గేటు, బంగ్లోస్ చెక్‌పోస్ట్, మెయిన్ హాస్పిటల్, ఎస్టేట్స్ పరిధుల్లో విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బంది చాలా అలెర్ట్‌గా ఉండాలన్నారు.

వ్యానొచ్చిందోచ్... బడికెళ్దామోచ్

విశాలాంధ్ర - గూడూరు : మండలంలోని రాజన్ పల్లి ఎంపీ యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. విద్యార్థుల కోసం 75 వేల రూపాయలను సొంతంగా వెచ్చించి విద్యార్థుల కోసం ఓ వ్యాన్ కొనుగోలు చేశాడు. రాజన్‌పల్లి గ్రామంలో ముందు వరుసలో ఎంపీయూఎస్ పాఠశాల ఉన్నందున గ్రామంలో ఉన్న విద్యార్థులు పిల్లలు ఎక్కువ దూరం నడవలేక బడికి రాలేకపోతున్న తరుణంలో ఎంపీ యూపీ ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు ఎండి.యాకూబ్ విద్యార్థుల కోసం పాఠశాలకు రావడానికి తన మిత్రుల దగ్గర నుండి ఆ వ్యానును కొనుగోలు చేశాడని తెలిపాడు. విద్యార్థులు పిల్లలు తెలియని వారికి కూడా తెలియజేసి వ్యాన్ 'వచ్చిందోచ్... బడికెళ్దామొచ్చు' అంటూ సంతోషంగా బ్యాగులు సంకనేసుకుని వ్యాన్ ఎక్కి పాఠశాలకు వెళ్లి చక్కగా విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. రానివారు కూడా తోటి స్నేహితులు వ్యాన్‌లో పాఠశాలకు వెళుతుండడంతో పాఠశాలకు బయలుదేరారు. వివరాల్లోకి వెళితే యాకూబ్ తన స్వగ్రామంమైన నర్సంపేట మండలం రామవరం. గ్రామస్తుడు తాను పుట్టి పెరిగింది పల్లెటూరి వాతావరణంలో కాబట్టి పల్లెటూర్లో విద్యార్థులు అనుభవిస్తున్న కష్టాలు ఎదుర్కొంటున్న బాధలు తాను కూడా విద్యార్థి దశలోనే ఎన్నో బాధలను అనుభవించాడని, అలాంటి బాధలు నేను బోధించే పాఠశాలలో విద్యార్థులు అనుభవించరాదని తానే స్వయంగా ఈ వాహనాన్ని కొనుగోలు చేశాడని తెలిపారు. రాజన్ పల్లి తండాలో విద్యార్థులు రావడానికి పాఠశాల దూరం వల్ల జంకుతున్నారని నేడు తాను ఏర్పాటు చేసిన వ్యాన్ చూసి విద్యార్థులు ఎగబడి ఎగబడి ఎక్కుతున్నారని తెలిపారు. చదువు చెప్పడమే కాకుండా విద్యార్థులపై తాను పెంచుకున్న ప్రేమ, అనురాగం ఆప్యాయత అలా ముందుండి నడిపిందని ఉపాధ్యాయుడు యాకూబ్ తెలిపారు.

సింగరేణి డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ (పా) గా గౌతమ్ పొట్రు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ (పా) గా గౌతమ్ పొట్రు బాధ్యతల స్వీకరించారు. డైరెక్టర్ పా గా నియమితులైన గౌతమ్ శనివారం సింగరేణి భవన్‌లో సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరామ్ సమక్షంలో బాధ్యతలను లాంఛనంగా స్వీకరించారు. ఇప్పటివరకు పా బాధ్యతలను డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు అదనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌కు సీఎండీ బలరామ్ శుభా కాంక్షలు తెలిపారు. అలాగే సంస్థ డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం. సుభాని, జీఎం మార్కెటింగ్ రాజశేఖర్‌రావులు కూడా గౌతమ్‌ను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : సెలవుల రోజుల్లో విద్యార్థులను సమయం వృధా చేసుకోకుండా, ప్రమాదాల బారిన పడకుండా చదువుతోపాటు క్రీడలవైపు ప్రోత్సహించాలని జిల్లా క్రీడాధికారి పరంధామరెడ్డి అన్నారు. డివైఎస్ ఓ సమ్మర్ క్యాంపు పూర్తయిన సందర్భంగా శనివారం సమ్మర్ క్యాంపుకు వచ్చిన పిల్లలకు కోచ్ మొహమ్మద్ రియాజ్ ఆధ్వర్యంలో టీషర్టుల పంపిణీ చేసారు. ఈ టీ షర్టులను రామవరంలోని నజీర్ క్లాత్ స్టోర్, జాకీర్ కిరాణం, సుభాష్ వితరణ చేసినట్లు రియాజ్ వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరంధామ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సమ్మర్ క్యాంప్ నిర్వహించిన రియాజ్‌ను ఆయన అభినందించారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల పిల్లలు కూడా సమర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఐ సుధాకర్‌రావు, ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ రజాక్, అథ్లెటిక్ స్పోర్ట్స్ అసోసియేషన్ మహీదర్, న్యూస్టార్స్ అథ్లెటిక్స్ క్లబ్ ప్రెసిడెంట్ బాబ్జి, మాటపర్తి రమేష్, జమలయ్య, వెంకటేశ్వర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై సమస్యలపై పోరాడాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కమ్యూనిస్టుగా కొనసాగడం ఒక పెద్ద బాధ్యత లాంటిదని ప్రజలతో మమేకమై వారి సమస్యల పట్ల పోరాటం చేసి సాధించినప్పుడే ప్రజల్లో తగిన గుర్తింపు ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. సిపిఐ పార్టీ అశ్వరావుపేట మండల సమితి ఆధ్వర్యంలో 16వ మహాసభ శనివారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాబీర్ మాట్లాడారు. అశ్వరావుపేట ఏర్పడ్డ నూతన మండల కౌన్సిల్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. మండల కార్యవర్గంలో ఎన్నికైన ప్రతి ఒక్క సభ్యుడు చురుకుగా పనిచేయాలన్నారు. పార్టీని ముందుకు నడిపించడానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వంద సంవత్సరాల చరిత్ర ఉన్న పార్టీ సిపిఐ పార్టీలో మనం కొనసాగటం గర్వకారణం అన్నారు. బూర్జువ పార్టీలకు వ్యతిరేకంగా ప్రజా శ్రేయస్సు కోసం ఎన్నో ఉద్యమాలను చేసిన ఘనత సిపిఐ పార్టీకు ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన చేస్తుందని త్వరలోనే గుణపాఠం చెబుతామన్నారు. నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ మండల కార్యవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రతి ఒక్క సభ్యుడు పార్టీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ సభకు మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గన్నిన రామకృష్ణ, మండల కార్యదర్శి వగ్గెల అర్జున్ రావు, టౌన్ సెక్రటరీ నూకవరపు విజయకాంత్, డివిజన్ కమిటీ సభ్యులు జోగిరాజు, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ జాకీర్, జక్కం బలరాం, ఏఐటీయూసీ నాయకులు పటాన్ జలాల్, అనిల్,వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తన చట్టం కఠినంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - ఖమ్మం : నకిలీ విత్తన కంపెనీల బారిన పడకుండా విత్తన చట్టం లోపాలను సరిచేసి నాణ్యమైన విత్తనాలు ప్రభుత్వం నుండి రైతులకు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా సమితి తరఫున ప్రభుత్వాలకు సూచించారు. ఖమ్మం కలెక్టర్ ఆఫీసులో శనివారం విత్తన బోర్డ్ సంస్థ చైర్మన్ అవినాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన విత్తన ముసాయిదా చట్టం ఏర్పాటు కోసం రైతుల అభిప్రాయాల సేకరణ సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. అనేక రకాల విత్తన కంపెనీలు పుట్టకొచ్చి గ్రామాల్లో ఆర్గనైజర్లు ఏర్పాటు చేసుకొని మొక్కజొన్న పత్తి అనేక రకాల విత్తనాల రైతులకు ఇచ్చి మోసం చేస్తున్న విత్తన కంపెనీ యజమానులపై దాన్ని ప్రోత్సహించే వారిపై పిడి కేసులు పెట్టి జైలుకు పంపించే విధంగా విత్తన చట్టరూప కల్పన జరగాలని వారు అభిప్రాయం తెలియజేశారు. జిల్లాలు మండల వారీగా విత్తన గోదాములు ఏర్పాటుచేసి విత్తన డీలర్లు ప్రభుత్వ అనుమతులతోని నాణ్యమైన విత్తనాలు ఇచ్చే విధంగా చట్టంలో రూపొందించాలని వారు సూచించారు. విత్తన చట్టం1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రత ఉత్తర్వులు చట్టం 1983, ఆంధ్రప్రదేశ్ పత్తి విత్తన చట్టం 2007, చట్టాలను పరిగణలో తీసుకొని విత్తన ముసాయిదా చట్టాన్ని రూపొందించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేత

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: సింగరేణి ఆర్జీ వన్ ఇచ్చిన వాల్వ్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణ పొంది ఉత్తీర్ణులైన 47 మంది నిరుద్యోగులకు శనివారం ఎస్ ఓ టు జియం గోపాల్ సింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. సామాజిక బాధ్యత స్వయం ఉపాధి కల్పన (సి.యస్.ఆర్) లో భాగంగా నిరుద్యోగ యువతకు ఓపెన్ కాస్టలలో నడుచు భారీ యంత్రాలు వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ అందించిన ఈ శిక్షణ ద్వారా ఉత్తీర్ణులైన వారు ఎక్కడైనా ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. పర్సనల్ మేనేజర్ యం రవీందర్ రెడ్డి, టి.టి.సి యస్.ఇ అశోక్ కుమార్, వోల్వో డంప్ ట్రక్ కంపెనీ ట్రైనింగ్ మేనేజర్ హరిబాబు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, రాంబాబు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

విమాన ప్రమాదమూ రాజకీయమే

గురువారం అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన విమానం బయలుదేరిన కొద్ది సెకన్లలోనే కూలిపోయిన తరవాత ఆ ప్రమాదానికి గల కారణాలను ఎవరికి తోచినట్టు వారు విశ్లేషిస్తున్నారు. అధికారిక దర్యాప్తు మొదలు కాకముందే ఊహాగానాలు జోరుగా సాగాయి. దర్యాప్తు పూర్తి అయితే కానీ అసలు విషయం బయట పడే అవకాశం ఉండదు. బోయింగ్ డ్రీం లైనర్ విమానం అత్యంత సురక్షితమైందంటారు. అయితే ఈ ప్రమాదాన్ని కేవలం దుర్ఘటన అని సరిపెట్టుకోవడానికి వీలు లేదు. ప్రమాదాలు జనాన్ని ఆందోళనకు గురి చేస్తాయి. దుర్ఘటనకు విమానాశ్రయంలో అవ్యవస్థ కారణం కావొచ్చు. భద్రతా ప్రమాణాలను సవ్యంగా పాటించకపోవడమూ ప్రమాదానికి దారితీయవచ్చు. పౌరవిమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) వ్యవస్థ సజావుగా పని చేసి ఉండకపోవచ్చు. వృత్తి నైపుణ్య ప్రమాణాలను నిర్లక్ష్యం చేసి ఉండొచ్చు. ఈ విమానంలో ఎయిర్ కండిషన్ కూడా సరిగ్గా పని చేయ లేదంటున్నారు. విమానం పైకప్పు మీంచి నీటి బొట్లు రాలుతూ ఉండొచ్చు. భోజనం సరిగ్గా ఉండకపోవచ్చు. విరిగిన కుర్చీలూ ఉండొచ్చు. ప్రయాణికుల సీట్ల ముందున్న టీవీలు పని చేయకపోవచ్చు. అయితే ఇవేవీ ప్రమాదానికి కారణం కాదు. వందల ప్రాణాలతో చెలగాటమాడే ఈ నిర్లక్ష్యం ఎందుకు జరుగుతుందన్నదే అడగవలసిన ప్రశ్న. విమానయానంతో సంబంధం ఉన్న వారెవరైనా వృత్తి ప్రమాణాలు పాటించలేదనిపించకపోతే జనం ఆ విషయం మాట్లాడుకోవడం సహజమే. విమాన ప్రయాణం ఖరీదైన వ్యవహారం కనక ఇలాంటి ప్రశ్నలు తలెత్తుతూనే ఉంటాయి. దుర్ఘటనకు సాంకేతిక లోపాలే కారణం అన్న మాట చాలా తరచుగా వినిపిస్తూ ఉంటుంది. నెపం సాంకేతిక లోపాల మీద వేసినప్పుడు ఇక మాట్లాడడానికి ఏమీ మిగలదు. కానీ ఈ లోపాలకు కూడా కారణం ఎక్కడో అక్కడ ఉంటుంది. ఎవరో కొందరు బాధ్యులై ఉంటారు. ఎయిరిండియా విమానాల మీద ఫిర్యాదులు ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రభుత్వ రంగంలో ఉన్నప్పుడూ ఈ ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వ రంగంపై విమర్శలు గుప్పించడం సర్వ సాధారణం. కానీ ప్రఫుల్ పటేల్ లాంటి పౌర విమానయాన మంత్రులు ఎయిరిండియాను టాటాలకు అప్పగించేదాకా పట్టు విడవని విక్రమార్కుల్లా పని చేశారు. కారు చౌకగా ఎయిరిండియాను టాటాలకు అప్పగించే దాకా నిద్ర పోలేదు. అనేక ప్రైవేటు రంగ సంస్థలకన్నా టాటా సంస్థలు బాగా పని చేస్తాయనడంలో సందేహం లేదు. కానీ ఎయిరిండియాను ఆ సంస్థ స్వాధీనం చేసుకున్న తరవాత పని తీరు మెరుగుపడ్డ దాఖలాలు లేవు. ప్రభుత్వ రంగంలో ఉన్న సంస్థలు మాత్రమే ఏ వ్యవస్థనైనా అస్తవ్యస్తంగా నిర్వహిస్తాయన్నది పాక్షిక సత్యం మాత్రమే. ఇలాంటి ఘోర ప్రమాదాల వల్ల జనం విమాన ప్రయాణాలు మానుకునే అవకాశం ఎటూ లేదు. కానీ ప్రతి ప్రమాదం దుర్ఘటనకు కారణమైన సంస్థకు మాత్రమే కాక ఇతర విమానయాన సంస్థలకు కూడా గుణపాఠం కానంత కాలం ఈ మహా విషాదాలకు అంతం ఉండదు. విమానాశ్రయాల్లో అందించే సేవల దగ్గర నుంచి ఆకాశంలో విమాన ప్రయాణాల దాకా లోపాలు ఇలాంటి ప్రమాదాలకు కారణం అవుతుంటాయి. ప్రమాదం జరిగిన విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్నది అదానీ సంస్థ. ఎయిరిండియా యజమాని టాటా సంస్థ. ఈ రెండూ ప్రైవేట్ రంగానివేగా! కనక ప్రభుత్వ రంగంపై దుమ్మెత్తిపోసినందువల్ల ప్రయోజనం ఉండదు. విమాన ప్రమాదాలకు ఒకే ఒక కారణం ఉండకపోవచ్చు. అనేక లోపాలు కలిసి ప్రమాదానికి దారి తీయనూ వచ్చు. ఈ విమాన ప్రమాదం గురించి అనేక మంది నిపుణులు అనేక రకాల అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా సమాధానాలు చెప్పవలసిన వారు ఒక్క టీవీ చర్చలోనూ తారస పడలేదు. నిపుణులు అన్న పేరుతో వ్యాఖ్యానాలు గుప్పించిన వారందరూ మాజీ పైలెట్లో లేదా విమానయానంతో సంబంధం ఉన్న మాజీ అధికారులో మాత్రమే. విమానయానంలో ఉన్న అనేక సౌలభ్యాలతో పాటు లోపాలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. కానీ ఒక చోట జరిగిన లోపాన్ని, నిర్లక్ష్యాన్ని మరో చోట నివారించే అవకాశమూ ఉంటుంది. అదే వైఫల్యం సర్వ వ్యాప్తం అయినప్పుడు దుర్ఘటన ప్రభావం భారీగానే ఉంటుంది. అనేక సార్లు వరస లోపాలు, నిర్లక్ష్యం ప్రాణాంతకంగా పరిణమించనూవచ్చు.

విమానం పతనం కావడానికి మొత్తం వ్యవస్థ వైఫల్యం కూడా కావొచ్చు. విమానయానంతో సంబంధం ఉన్న అన్ని విభాగాలు వృత్తి నైపుణ్యం ప్రదర్శించి, ప్రతి చిన్న అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి పని చేస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చు. ఆటో పైలెట్ సహాయంతో విమానం ఎగరనూ వచ్చు. దిగనూ వచ్చు. పైలెట్ల నైపుణ్యం చాలా కీలక భూమిక నిర్వహిస్తుంది. ఈ విమాన పైలెట్ చాలా అనుభవజ్ఞుడు. కో పైలెట్‌కు ఉన్న అనుభవమూ నామ మాత్రమైంది ఏమీ కాదు. విమాన భద్రతకు బాధ్యత వహించవలసిన వారు, వివిధ వ్యవస్థలు సవ్యంగా పని చేస్తున్నాయో లేదో అహర్నిశలు పరిశీలించి, లోపాలను సరిదిద్దాలసిందే. కానీ లోపం అక్కడే ఉంటే ఇంత భారీ ప్రమాదాలు అనివార్యం అవుతాయి. వ్యవస్థలో లోపాలు ప్రయాణికుల నమ్మకాన్ని పోగొడ్తాయి. నిరాశకు గురవుతారు. భయభ్రాంతులు అవుతారు. అయినా ప్రయాణాలు ఆగవు. మృతుల కుటుంబాల వారికి భారీ స్థాయిలో ప్రభుత్వాలు పరిహారం అందించవచ్చు. కానీ వారు కోరుకునేది పరిహారం మాత్రమే కాదు. ఇది సంవేదనలకు, తమ వారిని పోగొట్టుకున్న బాధకు సంబంధించింది. పరిహారం ఉపశమనం మాత్రమే. దుర్ఘటనలు నివారించడానికి నియమ నిబంధనలు ఉంటాయి. బాధ్యత వహించవలసిన సందర్భాలూ ఉంటాయి. లోపం కేవలం నిర్వహణా సంస్థలదే కాకపోవచ్చు. ప్రభుత్వ బాధ్యతారాహిత్యమూ భారీగానే ఉండొచ్చు. ఉదాహరణకు డీజీసీఏలో 53 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 32 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. పౌర విమానయాన భద్రతా విభాగంలో 35 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గత మార్చిలో అందజేసిన నివేదికలోనే ఈ లోపాలను ఎత్తి చూపింది. సిబ్బంది కొరత ఉంటే పని చేస్తున్న వారిమీద భారం పెరుగుతుంది. స్లిప్పర్లు వేసుకునే వారు కూడా విమాన ప్రయాణం చేయొచ్చునని మోదీ అంటూ ఉంటారు. మరి పెరిగే రద్దీని తట్టుకునేటన్ని విమానాలను ప్రభుత్వాలు అందుబాటులోకి ఎందుకు తేలేదు. గత ఏడాది నవంబర్ 21న పౌర విమానయాన శాఖ కార్యదర్శి వచ్చే అయిదేళ్లలో 500 అదనపు విమానాలు సమకూర్తాయన్నారు. 2030 నాటికి మన విమానాల సంఖ్య 2000 అవుతుందని మాజీ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా 2023 మార్చి 20న చెప్పారు. ప్రస్తుత మంత్రి రాంమోహన్ నాయుడు 800 నుంచి 1500 అదనపు విమానాలు వస్తాయన్నారు. డీజీసీఏ లెక్క అదనంగా 1400 విమానాలు. ఇవన్నీ కాకి లెక్కలేగా! అంటే విమానయాన విభాగంలో రాజకీయాల ప్రభావం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

కొలంబియాలో కార్మిక సంస్కరణలపై రెఫరెండం

సాత్యకి చక్రవర్తి

దక్షిణఅమెరికా దేశం కొలంబియాలో ఇటీవల రాజకీయ గందరగోళం ఏర్పడింది. వామపక్ష నాయకుడు గుస్తావ్ పెట్రో కార్మిక సంస్కరణలను నిర్వహించాలని తలపెట్టాడు. అయితే సెనేట్ సంస్కరణల నిర్వహణలను వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో గుస్తావ్ పెట్రో ప్రజల వద్దకు వెళ్లడం మినహా మరొక మార్గం లేదని భావించాడు. అందువల్లనే ప్రజల వద్దకు చేరడానికి వారి అభిప్రాయం (రెఫరెండం) తెల్సుకొని సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించారు. సెనేట్‌లో వామపక్ష పార్టీల కంటే ఇతర పార్టీల సభ్యులు ఎక్కువమంది ఉన్నారు. 2022లో పెట్రో అధ్యక్ష బాధ్యతలను తీసుకున్నప్పటి నుంచి సెనేట్ సభ్యులతో పోరాటం చేస్తూనే ఉన్నారు. వామపక్షవాది అయిన పెట్రో ఎంతో పోరాటం అనంతరం అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు తీసుకోగలిగారు. గతంలో కొలంబియాలో నిరంకుశ ప్రభుత్వాలు నడిచాయి. ఈ ప్రభుత్వాలతో విప్లవ గ్రూపులో పనిచేసిన పెట్రో తీవ్ర పోరాటం జరిపిన తర్వాత నిరంకుశ పాలనకు అంతం పలికారు. పెట్రో తలపెట్టిన సంస్కరణలకు అనుకూలంగా కొలంబియా రాజధాని బొగోటా నగరంతో సహా అనేక నగరాలలో అనుకూల ప్రదర్శనలు జరిపారు. కార్మిక సంస్కరణల ప్రతిపాదనలను ప్రదర్శనకారులు అంగీకరించారు. ఈ విషయంపై గత వారంలో దేశంలో అనేకచోట్ల హింసాకాండ జరిగింది. పూర్వపు చీకటి రోజులు మళ్లీ రావొచ్చునని ప్రజలు ఆందోళన చెందారు. అధ్యక్షుడికి మద్దతుగా పాలక సంకీర్ణ ప్రభుత్వంలో కలిసి పనిచేస్తున్న పార్టీలు అలాగే ట్రేడ్ యూనియన్‌లు పెట్రోకు మద్దతు తెలియజేస్తున్న ప్రజా సమూహాలు బుధవారం రెఫరెండానికి మద్దతును తెలియజేశారు. రెఫరెండంపై అధ్యక్షుడు పెట్రో డిక్రీని జారీ చేసిన తర్వాత ఆయనకు అనుకూల ప్రదర్శనలు వెల్లువెత్తాయి. సెనేట్ ప్రతిపక్ష సభ్యులు రెఫరెండాన్ని వ్యతిరేకిస్తుండగా, సెనేట్‌లో ప్రతిపక్ష అనుకూల ప్రజలు కూడా తక్కువ స్థాయిలో అక్కడక్కడ ర్యాలీలు జరిపారు. వామపక్ష ప్రభుత్వానికి మద్దతునిస్తున్న ప్రజానీకం భారీ స్థాయిలో ప్రదర్శనలు జరిపారు.

దేశంలోని ఆగ్నేయమూల ప్రాంతంలో పెద్దఎత్తున బాంబు దాడులను జరపడం వల్ల వామపక్షానికి చెందిన ఏడుగురు మరణించారు. ఒక సెనేటర్‌ను సైతం చంపేందుకు ప్రతిపక్ష అనుకూలురు ప్రయత్నించారు. బొగోటాలో అధ్యక్షుడికి అనుకూలంగా పెద్ద ప్రదర్శన జరిపారు. 2026లో అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం ఇప్పటికే పూర్తి స్థాయిలో రెండు పక్షాల అనుకూలురు ప్రచారం చేస్తున్నారు. కొలంబియాలో మూడవ అతిపెద్ద నగరం కాలీలో బుధవారం ఉదయం భద్రతా సమావేశాన్ని స్థానిక అధికారులతో సైన్యం మద్దతుతో పెట్రో నిర్వహించారు. అంతకుముందురోజు బాంబు దాడులు జరిగిన నేపథ్యంలో సైన్యాన్ని భద్రత కోసం పిలిపించారు. అధ్యక్షుడికి అనుకూలంగా ఉన్న మిగుయల్ ఉర్బీ టర్బేను కూడా చంపేందుకు ప్రతిపక్షం ప్రయత్నించింది. బాంబు దాడులు జరిపి ఉర్బీని చంపడానికి ప్రయత్నించిన వర్గాలను గుర్తించేందుకు ప్రభుత్వం దర్యాప్తు చేస్తోంది. 15 ఏళ్ల బాలుడు డబ్బు తీసుకొని ఉర్బీని చంపేందుకు ప్రయత్నించాడని పోలీసులు విశ్వసిస్తున్నారు. మంగళవారం ఆ బాలుడు దాడికి తనకు సంబంధం లేదని ప్రాసిక్యూటర్ కార్యాలయంలో తెలియజేసాడు. తీవ్రంగా గాయపడిన సెనేటర్ ఉర్బీ ఆరోగ్య పరిస్థితిని అధ్యక్షుడు పెట్రో పర్యవేక్షిస్తున్నాడు. కొలంబియాలో అనేక సాయుధ గ్యాంగులు పనిచేస్తున్నాయి. అయితే దాడికి పాల్పడిన గ్రూపును గుర్తించేందుకు ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. కార్మిక సంస్కరణలలో భాగంగా ప్రతిపాదించిన బిల్లులో ఆదివారాలు, ప్రభుత్వ సెలవులలో పనిచేసిన కార్మికులకు ఆదనంగా వేతనాలు చెల్లిస్తారు. వారంలో పనిచేయవల్సిన గంటలలో మార్పుచేశారు. అలాగే ఓవర్‌టైం పనిచేసినట్లైతే వారికి కూడా అదనంగా వేతనాలు చెల్లిస్తారు. ఈ మార్పులను సెనేట్‌లో ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతేకాదు కార్మిక సంస్కరణలకు ప్రత్యామ్నాయంగా బిల్లును ప్రతిపక్షాలు ప్రతిపాదిస్తున్నాయి. ప్రత్యామ్నాయ బిల్లును యాజమాన్యాలు అంగీకరిస్తుండగా ట్రేడ్ యూనియన్‌లు తిరస్కరించాయి. అధ్యక్షుడు ప్రవేశపెట్టిన ప్రతిపాదనకు రెఫరెండం అనుకూలంగా ఉంటుందా లేదా అనేది తెలియవల్సి ఉంది. రెఫరెండానికి అనుకూలంగా ఉన్న వారికి, వ్యతిరేకంగా ఉన్న వారికి మధ్య చాలాకాలంగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ సంవత్సరం మార్చిలో పెట్రో రెండుసార్లు కార్మిక సంస్కరణలను ప్రవేశపెట్టినప్పటికీ వాటిని ప్రతిపక్షం తిరస్కరించింది. పెట్రో సెనేట్ సభ్యులకు 12 ప్రశ్నలతో కూడిన రెఫరెండం ప్రతిపాదనను మే 1వ తేదీన పంపారు. సెనేట్‌లో ప్రతిపక్షానికి అనుకూలంగా 49 ఓట్లు రాగా పాలకపక్షానికి 47 ఓట్లు లభించాయి. దీంతో అధ్యక్షుడు రెఫరెండం కోసం నేరుగా ప్రజల వద్దకే వెళ్లడం అనివార్యమైంది. అదనపు గంటలు పనిచేసిన, సెలవురోజుల్లో పనిచేసిన కార్మికులకు రెట్టింపు వేతనాలు చెల్లించాలని సంస్కరణలలో అధ్యక్షుడు ప్రతిపాదించగా వాటిని ప్రతిపక్షం తిరస్కరిస్తోంది.

‘భారతమాత’పై అనవసర రాద్ధాంతం



వినయ్ విశ్వం
సీపీఐ జాతీయ కార్యదర్శి

ఏటా జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సంబంధించి ఇటీవల కేరళలో అకస్మాత్తుగా, అనవసర వివాదం తలెత్తింది. ఈ వివాదాన్ని సాక్షాత్తు రాజ్‌భవన్ రేకెత్తించడం అత్యంత విచారకరం. కేరళలో ఏటా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విస్తృతంగా నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భారీ ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని వేలాది మొక్కలను నాటుతుంటారు. ప్రజలు ఈ రోజును తమకు పర్యావరణంపై ఉన్న అవగాహనను, దాని పట్ల గల నిబద్ధతను సుసంపన్నం చేసుకునే రోజుగా జరుపుకుంటూ ఉంటారు.

ఈ ఏడాది రాజ్‌భవన్ ప్రాంగణంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. దీనిని ప్రారంభించేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అంగీకారం తెలిపారు. ముందు రోజు సాయంత్రం వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయానికి కార్యక్రమ వివరాలను పంపిస్తూ, ఒక చిత్రపటానికి పుష్పాంజలి ఘటించాల్సి ఉంటుందని రాజ్‌భవన్ కొత్త ప్రతిపాదన పెట్టింది. ప్రతిపాదన అందిన వెంటనే మంత్రి కార్యాలయం మరింత స్పష్టత ఇవ్వాలని కోరింది. ఇందుకు గవర్నర్ కార్యాలయం స్పందిస్తూ, ‘భరతమాత’ అని చెప్పే చిత్రపటాన్ని పంపించారు. ఆశ్చర్యకరంగా రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) తమ కార్యక్రమాలలో ఉపయోగించే రూపమే ఆ చిత్రపటంలో ఉంది. రాజ్‌భవన్ పంపిన చిత్రంలో భారతమాత సింహంపై కూర్చొని, ఆర్‌ఎస్‌ఎస్ జెండాను తలపించే కాషాయ జెండాను పట్టుకొని ఉంది. చిత్రపటం నేపథ్యంలో ఉన్న దేశ పటం కచ్చితంగా గణతంత్ర భారతదేశ పటం కాదు. కొన్ని సంప్రదింపుల తరువాత, ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమంలో ఆ చిత్రపటాన్ని ఉపయోగించడం, ఎక్కువ చేసి చూపడం అసమంజసమని గవర్నర్ కార్యాలయానికి మంత్రి సమాచారం అందించారు. కానీ, ఆ చిత్రపటం లేకుండా కార్యక్రమం నిర్వహించే అవకాశమే లేదని, తాను హాజరుకాబోనని గవర్నర్ నొక్కి చెప్పారు. అందుకు గల కారణాలేమిటో ఆయనకే తెలియాలి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో కార్యక్రమ వేదికను సచివాలయం ప్రాంగణానికి మార్చవలసి వచ్చింది. దానికి గవర్నర్ తప్ప అతిథులందరూ హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారతమాత పట్టుకున్న కాషాయజెండాను గవర్నర్ కీర్తించినట్లు వార్తలు వెలువడ్డాయి. అది భారతదేశ ప్రతీక అని ఆయన వాదించారు. కేరళ ప్రభుత్వాన్ని, భారతమాత అనే ఆయన ఆలోచనను సమర్థించేందుకు సిద్ధంగా లేనివారని విమర్శించారు కూడా. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వ హయాంలో గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు కేవలం కేరళకే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా చోటుచేసుకున్నాయి. కొన్ని సందర్భాలలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంది. ఇప్పుడు ఈ వివాదాలకు భారతమాతను గవర్నర్ ఆర్లేకర్ కేంద్రస్థానానికి తీసుకువచ్చారు.

చలనశీల భావన

భారతమాత భావన భారతదేశ ప్రజల సామూహిక స్మృతిలో వేళ్లూనుకుంది. వలసవాద వ్యతిరేక పోరాటంలో ఈ భావనను విభిన్న సామాజిక రాజకీయ దృక్పథాలు కలిగిన వేర్వేరు సమూహాలు, సాతంత్ర్యపోరాటంలో సమాజంలోని అన్ని వర్గాలకు స్ఫూర్తి కలిగించి, ఐక్యపరిచేందుకు ఉపయోగించేవి. ఒక ప్రత్యేక భావననే నిజమైన వ్యక్తీకరణగా, భారతమాత రూపుగా ఎవ్వరూ వాదించలేదు. అదొక విస్తృత భావన. జాతి, జాతీయత, ప్రపంచ దృక్పథాలపై తమ సొంత భావనలకు అనుగుణంగా అనేక మంది భారతమాతను అన్వయించుకున్నారు. చాలా కాలం తరువాత ఆర్‌ఎస్‌ఎస్ తన సొంత అవసరాల కోసం, భారతమాత గురించి తమ సొంత ఆలోచనతో ముందుకు వచ్చి ఉండొచ్చు.

ఆర్‌ఎస్‌ఎస్ సంబంధించిన భారతమాత మాత్రమే నిజమైన ప్రతిమ అనే భావనను వ్యక్తిగా విశ్వసించే హక్కు గవర్నర్ ఆర్లేకర్ ఉంటుంది. ఒక నిర్దిష్ట సిద్ధాంత ప్రభావంలో ఉండే వారికి భారతమాత కాషాయ జెండాను పట్టుకొని ఉంటుందనే ఆలోచన చేసే హక్కు ఉంటుంది. ఆమె సింహంపై కూర్చొని ఉండడాన్ని కూడా వారు స్తుతించవచ్చు. భారతమాత చిత్రపటంలో వెనుకాల ప్రత్యేకంగా గీసిన దేశపటం కూడా సరైనదేనని వారికి అనిపించవచ్చు. తన సైద్ధాంతిక, సంస్థాగత చట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ‘అఖండ భారత్’ అనే తమ స్వప్నానికి, సమరశీల పరాక్రమ జాతీయవాదానికి అనుగుణంగా భారతమాత రూపును ముందుకు తీసుకువచ్చింది. ఆర్‌ఎస్‌ఎస్ శాఖలలో ఇలాంటి భారతమాతను స్తుతించి ఉండొచ్చు. ఏదో ఒక వాదాన్ని మాత్రమే ఆమోదనీయమైన, అధీకృతమైనదిగా రుద్దడం వృథా ప్రయాస. అధికారిక కార్యక్రమాలలో ఆర్‌ఎస్‌ఎస్ తమ సైద్ధాంతిక, రాజకీయ భావజాలాన్ని జొప్పించేందుకు ప్రయత్నిస్తే విషయం మరింత సంక్లిష్టమవుతుంది. ప్రజాజీవితంలో గొప్ప అనుభవం కలిగిన గవర్నర్ ఆర్లేకర్‌కు ఇలాంటి కనీస సూత్రం తెలిసి ఉంటుందని ఆశిస్తాం. రాజ్యాంగ స్థానాలలో ఉండే వారు తమ రాజకీయ ఇష్టాయిష్టాలను ప్రదర్శించకూడదు. రాజకీయ నిబద్ధతకు, అధికారిక బాధ్యతకు మధ్య విభజన రేఖ వారి మదిలో మరింత ప్రస్ఫుటంగా ఉండాలి.

నెహ్రూ ఏమన్నారంటే...

గవర్నర్, ఆయన సైద్ధాంతిక అడుగుజాడలలో నడిచే ప్రజలకు అనేక కారణాల రీత్యా మాజీ ప్రధానమంత్రి జవహర్ నెహ్రూ అంటే ఇష్టం ఉండకపోవచ్చు. కానీ నెహ్రూను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన ఒక చోట ఇలా రాశారు “కొన్నిసార్లు నేను సమూహాన్ని చేరుకున్నప్పుడు, ఘన స్వాగత గర్జనలు నాకు అభివాదం చేస్తాయి: భారత్‌మాతాకీ జై (మాతృభారతికి జయము). అకస్మాత్తుగా వారిని నేను అడుగుతుంటాను... ఈ అరుపులకు అర్థమేమిటి, ఈ భారతమాత ఎవరు... భారతదేశం అంటే ఇదే అని వారు అనుకుంటారు. కానీ, అది అంతకంటే ఎక్కువ. భారతదేశ పర్వతాలు, నదులు, అడవులు, విశాల క్షేత్రాలు... అవన్నీ కూడా మనకు ప్రియమైనవే, కానీ అంతిమంగా పరిగణనలోకి తీసుకునేది భారతదేశ ప్రజలను. వారిలాంటి ప్రజలను, నన్ను, విశాల నేలపై విస్తరించిన వారందరినీ. భారతమాత, మాతృభారతి, అంటే ఇలాంటి ప్రజలే. మీరంతా భారతమాతలో భాగాలే. ఒక విధంగా భారతమాత అంటే మీరే. ఈ ఆలోచన నెమ్మదిగా వారి మెదళ్లలోకి ప్రవేశిస్తుంటే, ఒక గొప్ప ఆవిష్కరణను సాధించామనే భావనతో వారి కళ్లు వెలిగిపోతాయి”.

పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అవసరమే!

మల్లాది శ్రీనగేష్

నూతన విద్యా విధానం మాతృ భాషలో విద్యతో పాటు విద్యార్థులు ఇతర భాషల్లో ప్రావీణ్యం సాధించడానికి కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించడం అందరికీ తెలిసిన విషయమే. అయితే 5వ లేదా 8వ తరగతివరకు మాతృభాషలోనే పిల్లలు చదువుకోవడం ఆమోదయోగ్యమని, దానికి తోడు కనీసం మూడు ఇతర భాషల్లో ప్రవేశం ఉండడం విద్యార్థి ప్రగతికి మరింత తోడ్పడుతుంది. ఈ విషయాల్లో చర్చలు -సందిగ్ధాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. అయితే ఇప్పటికే ప్రైవేట్ పాఠశాల పోటీ, తల్లిదండ్రుల -పిల్లల ఆకాంక్షల, ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల మాధ్యమానికి మరింత ఆదరణ, ప్రాచుర్యం పెరిగింది. మారుతున్న కాలంతో మనం కూడా మారాలి అనే చందాన కాకుండా బాలల భవిష్యత్తు -ఉద్యోగ -ఉపాధి రంగాల్లో చోటుచేసుకుంటున్న తీవ్ర మార్పుల దృష్ట్యా విద్యార్థులను తప్పనిసరిగా 21వ శతాబ్దపు నైపుణ్యాలకు చేరువ చెయ్యాలని అందుకు పాఠశాల యాజమాన్యాలు ఉపాధ్యాయులు అవిరళ కృషి చేయాలని ప్రభుత్వాలు విద్యా సంస్కరణలను చేపట్టడం ఓ చక్కని పరిణామం. అయితే సమ్మిళిత విద్యా వాతావరణాన్ని బలోపేతం చేయడానికి, మాతృ భాషతో బాటు ఆంగ్ల మాధ్యమంలో చదువు చెప్పడానికి పాఠశాల యాజమాన్యాల సంసిద్ధత అత్యవసరం. బహుభాషా పరిజ్ఞానం విద్యార్థుల్లో మేధో సంపత్తికి ఆయువుపట్టు అని తద్వారా విద్యా సామర్థ్యాల సాధన సులభమని -బాలల హక్కుల సాధనలో విద్యా హక్కుకు భాష కూడా ఓ ప్రధాన భూమిక వహిస్తుందని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి.

ఇప్పటివరకూ మాతృభాషలో చదువుకొని -ఉపాధ్యాయులుగా నియమితులై -మాతృ భాషలో బోధించి ఒకేసారి ఆంగ్ల మాధ్యమంలో బోధించడం ఎవరికైనా పెద్ద సవాలు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి హుటాహుటీన చేపట్టే ఆంగ్ల బోధనలో స్వల్పకాలిక శిక్షణ -సర్టిఫికెట్ కోర్సుల ప్రోత్సాహం వంటివి సబబే కానీ విద్యార్థులకు తరగతి వారీ, సబ్జెక్టు వారీ సామర్థ్యాలు సాధించడానికి విద్యార్థులను ఆ దిశగా తీర్చిదిద్దడానికి క్లిష్టమైన కాన్సెప్ట్‌లను నేర్పించడానికి కూలంకషంగా చర్చించడానికి మాతృభాషను ద్విభాషా పాఠ్య పుస్తక వెసులుబాటు నేపథ్యంలో ఉపయోగించడం సబబే కానీ విద్యార్థులు ఆంగ్లమాధ్యమంలో పరీక్షల సంసిద్ధత క్లిష్టతరమే. ప్రతి తరగతిలో అభ్యసనాల లేమితో సతమౌతున్న విద్యార్థులను చదవడం, రాయడం, చదివింది అర్థం చేసుకొనేలా సంసిద్ధపరచడం అనివార్యమని పాఠశాల యాజమాన్యాలు గుర్తించాలి. తగిన వ్యూహాలు రచించి ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడం తద్వారా తరగతి నిర్వహణను ఆశతో ఎదురు చూస్తున్న ఆంగ్ల మాధ్యమాన్ని కూడా జోడించి సరళ రీతిలో బోధనా రంగాన్ని మెరుగుపరచడమే పిల్లలకు చక్కటి ఓ పరిష్కారం అని చెప్పవచ్చు.

మానవాభివృద్ధి మంత్రిత్వ శాఖ నివేదిక 2020-21 ప్రకారం ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలిస్తే, సుమారు 25-30 శాతం మంది విద్యార్థులు అభ్యసనా లేమితో సతమతమౌతున్నారని, పాఠశాలకు వెళ్లడానికి విముఖత చూపుతున్నారని, నేర్చుకోవడం వారి భయానికి మూలమని తెలుస్తోంది. ఈ శాతం దళిత -గిరిజన జాతికి చెందిన విద్యార్థుల్లో మరింత అధికమని, బహుళ భాష, వివిధ స్థాయిలో వున్న వారి అభ్యసనా సమస్య ప్రధాన కారణంగా చెప్పవచ్చు. నిజానికి ప్రపంచ బ్యాంకు లెర్నింగ్ ఇండెక్స్ సూచిక ప్రకారం 55 శాతం మంది పిల్లలు భారత దేశంలో ప్రాథమిక పాఠశాల చదువు గడచిన తర్వాత కూడా క్షుణ్ణంగా రాయడం, చదవడం రాక బడిమానేస్తున్న పరిస్థితులున్నాయని అవగతమౌతోంది. జాతీయ సాధన(నేషనల్ అచీవ్‌మెంటు) సర్వే 2021 ప్రకారం 3, 5, 8 వ తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు 59%, 49%, 42% శాతం, దీనికి ప్రధాన కారణాలు విద్యార్థులు క్షుణ్ణంగా చదవడం, రాయడం రాకపోవడమే ఆయా సబ్జెక్టులలో లేదా తరగతి వారీ విద్యా సామర్థ్యాలు సాధించలేని స్థితిలో వున్నారని తెలుస్తోంది -ఇది విద్యార్థులు నేర్చుకునే సరళినే ప్రభావితం చేస్తుందని, ఈ సమస్యకు భాషా సామర్థ్యాల్లో కనీస ప్రతిభను కనబరచలేని అభ్యసనా లేమితో సతమతమౌతున్న 25-30 శాతం మంది విద్యార్థులపై ఆంగ్ల మాధ్యమ ప్రభావం మరింత అధికమౌతుంది, తద్వారా బడికి దూరమయ్యే ప్రమాదం మరింత అధికం. కనుక తక్షణ చర్యలు తప్పనిసరని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ విషయంలో పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో పాఠశాల విద్యా శాఖలు, బాల రక్షా భారత్ (సేవ్ ది చిల్డ్రన్), ఆస్కి వారి సిప్స్ వారి సాంకేతిక సహకారంతో ప్రవేశపెట్టి అమలు చేసిన ఎల్‌ఐపీ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాము), తెలంగాణ ఉన్నతి కార్యక్రమ వ్యూహాలతో అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను బలోపేతం చేయవచ్చు. సిలబస్, అకడమిక్ క్యాలెండర్ ప్రణాళికను కూడా ఎంతమాత్రం జవదాటకుండా అందరి విద్యార్థులతోబాటు అభ్యసనలో వెనుకబడిన బాలలను సకాలంలో తీర్చిదిద్దవచ్చు. సబ్జెక్టుతో నిమిత్తం లేకుండా “పాఠ్యాంశాలను భాషకు అనుగుణంగా రూపొందించడం” అన్న వ్యూహంతో పాఠశాల ఉపాధ్యాయులందరూ తమ సబ్జెక్టుకు అతీతంగా పిల్లలకు భాష పట్ల మరింత ప్రావీణ్యం సంపాదించేలా కృషిచేయాలి. తమ తమ సబ్జెక్టులతో బాటు పిల్లలకు భాషలో కూడా పట్టు సాధించేలా శ్రద్ధ వహించాలి. ఈ వ్యూహం ఎల్‌ఐపీ కార్యక్రమంలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు సాధించేందుకు ఎంతగానో ఉపకరించినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. అయితే కొత్త భాషను త్వరితంగా నేర్చుకోవడమనేది పిల్లలకు వెన్నతో పెట్టిన విద్య. బహుళ భాషల్లో ప్రావీణ్యం సాధించడం తద్వారా బహుళ ప్రయోజనాలున్నాయనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. ఎందుకనగా ప్రపంచంలో ఆంగ్ల భాష ఎక్కువమంది మాట్లాడే భాష కానప్పటికీ 53 దేశాల్లో ఆంగ్ల భాష అధికార భాషగా అమలులో వుంది. సుమారు 400 మిలియన్ల మందికి ఇది మొదటి భాష కాగా ప్రపంచంలో ఈ భాష ద్వితీయ భాషగా కూడా ప్రాచుర్యంలో వుంది. ఆంగ్ల భాష సాధారణంగా సులభంగా నేర్చుకొనే భాష అని నానుడి. ఈ భాష ఇతర భాషలను నేర్చుకొనే వెసులుబాటు కలిగి ఉంటుందని చాలామంది వ్యక్తపరిచారు. తెలుగురాష్ట్రాల మాదిరి చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతులకు ఇంగ్లీష్ మీడియంను ప్రారంభించడం ఒక మంచి పరిణామం. అంతేకాక మాతృభాష విద్యనుకూడా ప్రాధాన్యతా క్రమంలో ఉంచడం కూడా హర్షదాయకం . ఇటు స్వభాషకు - అత్యంత అవసరమైన ఆంగ్ల భాషకు ప్రాధాన్యం ఇవ్వడం ఒక మంచి పరిణామమని చెప్పాలి. భవిష్యత్తులో ప్రపంచీకరణలో ఆధునికీకరణకు నాందిగా ఆంగ్ల భాష ప్రాధాన్యత, పిల్లలు వినూత్న ఉద్యోగ మార్కెట్లో పయనించే వెసులుబాటు కూడా మెండు అని చెప్పవచ్చు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఇప్పటికీ సుమారు 60 శాతం మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం ఆంగ్ల మాధ్యమంలో చదువు, పూర్వ ప్రాథమిక విద్య ఒక పునాదిగా ఉండడం వలన తలిదండ్రులు కష్టమైనా ప్రైవేట్ విద్యా సంస్థల వైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఈ వివక్షను రూపు మాపేందుకు విద్యా హక్కు చట్టం 2009 నిబంధనల ప్రకారం అందరికీ నాణ్యమైన, సమాన విద్య అనే నినాదంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియంకు నాంది పలికాయి. అంతేకాక ప్రభుత్వ పాఠశాలలు ఇంగ్లీష్ మీడియం విద్యను తెలుగు మాధ్యమంతో పాటు సంయుక్తంగా నిర్వహించ తలపెట్టడం అందర్నీ ఆనందపరిచే విషయం. తలిదండ్రులు, పిల్లలు వారి అభీష్టం మేరకు చదువుకొనే మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. అంతేకాక పాఠ్య పుస్తకాలు బై-లింగువల్ అనగా రెండు భాషల్లోనూ పిల్లలకు అందుబాటులో ఉండడం హర్షదాయకం.

- విద్యా విషయ విశ్లేషకులు

జీవితకాల అధ్యక్షుడిని నేనే: రాందాస్

చెన్నై: వచ్చే యేడాది శాసనసభ ఎన్నికల తర్వాత అన్బుమణిని పార్టీ అధ్యక్షుడిగా చేద్దామని నిర్ణయించానని, అయితే పార్టీలో 99 శాతం మంది దానిని వ్యతిరేకిస్తుండటంతో ఊపిరున్నంతవరకూ తానే పార్టీ అధ్యక్షుడిగా ఉండాలని నిర్ణయం తీసుకున్నానని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ప్రకటించారు. దిండివనం తైలాపురం గార్డెన్ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ మహానాడు తర్వాత అన్బుమణి ప్రవర్తనలో ఊహించని మార్పులు జరిగాయని, తనను వెన్నుపోటు పొడిచాడని, పార్టీపై ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. కాగా, పీఎంకే జిల్లా కార్యదర్శులతో సమావేశమైన అన్బుమణి... డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీని అభివృద్ధి పరిచే దిశగా జులై 25 నుండి వంద రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర జరపాలని నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో జిల్లా కార్యదర్శులే కాకుండా సాధారణ కార్యకర్తలు కూడా తనవైపే ఉన్నారని పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్‌కు పరోక్షంగా తెలియజేసేందుకే అన్బుమణి ఈ పాదయాత్ర చేపడుతున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

డ్రీమ్‌లైనర్ విమానాల్లో తనిఖీలు: ఎయిరిండియా

న్యూఢిల్లీ: ఎయిరిండియా వద్దనున్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాలని పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ ఆదేశించింది. దీంతో సంస్థకు చెందిన 'బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్' విమానాల్లో తొమ్మిదింటిలో భద్రతా తనిఖీలు పూర్తి చేసినట్లు ఎయిరిండియా వెల్లడించింది. మిగిలిన 24 డ్రీమ్‌లైనర్‌ల తనిఖీలు త్వరలోనే పూర్తిచేయనున్నట్లు తెలిపింది. 'డీజీసీఏ ఆదేశాల ప్రకారం వన్-టైమ్ భద్రతా తనిఖీలు పూర్తి చేసే ప్రక్రియను ఎయిరిండియా కొనసాగిస్తోంది. బోయింగ్ 787 విమానాలు భారత్‌కు తిరిగి రాగానే తనిఖీలు చేస్తున్నాం. ఇప్పటికే తొమ్మిది విమానాలకు పూర్తిచేయగా... మరో 24 విమానాలకు గడువులోగా పూర్తిచేస్తాం. ఈ తనిఖీల్లో కొన్నింటికి అధిక సమయం పట్టే అవకాశం ఉంది. దాంతో సుదీర్ఘ ప్రయాణ మార్గాల్లో నడిచే విమానాలకు ఆలస్యం కావచ్చు. వీటికి సంబంధించిన సమాచారాన్ని ప్రయాణికులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తాం. విమానాశ్రయానికి వెళ్లేముందు విమానాల స్టేటస్‌ను ముందుగానే చెక్ చేసుకోవాలని ప్రయాణికులకు సూచిస్తున్నాం' అని తాజా ప్రకటనలో ఎయిరిండియా పేర్కొంది. టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా దగ్గరున్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలకు సంబంధించి వివిధ వ్యవస్థల పనితీరును తనిఖీ చేయడంతోపాటు గాల్లోకి ఎగిరే అంశానికి (టేకాఫ్) సంబంధించిన పరిమితులను పరిశీలించాలని డీజీసీఏ తాజా ఆదేశాల్లో స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎయిరిండియా దగ్గర బోయింగ్ 787-8 విమానాలు 26, బోయింగ్ 787-9 విమానాలు ఏడు ఉన్నాయి.

భయమేస్తోంది... కాపాడండి

ఇరాన్‌లోని భారతీయ విద్యార్థుల వినతి

న్యూఢిల్లీ: 'భూమి కంపిస్తున్నది. చాలా భయంగా ఉంది. మమ్మల్ని కాపాడండి' అంటూ ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులు దేశ ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్ భీకర దాడులతో వారు రక్షణ కోరుతున్నారు. 'ప్రస్తుతానికి అంతా ప్రశాంతంగా ఉంది. మేము క్షేమంగా ఉన్నాం. కానీ ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయంగా ఉంది. తెల్లవారుజాము 3.30 గంటలకు దాడులు మొదలు కాగా భూమి కంపించింది. అది మరువలేని అనుభవం' అని పీటీఐతో మాట్లాడిన తెహ్రాన్ మెడికల్ వర్సిటీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కశ్మీర్ విద్యార్థిని తబియా జెహ్రా చెప్పారు. వర్సిటీ అధికారులకు తమకు అభయమిచ్చినట్లు తెలిపారు. అయితే సురక్షిత ప్రాంతాల గురించి తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడి వెళ్లాలో తెలియకపోవడంతో చాలా భయంగా ఉందని జెహ్రా అన్నారు. భద్రతా పరిస్థితిపై అనిశ్చితి, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం వల్ల పరిమితంగానే కమ్యూనికేషన్ ఉందన్నారు. అక్కడే ఎంబీబీఎస్ చదువుతున్న ఉత్తరప్రదేశ్, ఆజంఘర్‌కు చెందిన అలీషా రిజ్వీ మాట్లాడుతూ 'మా చిరునామా, ఫోన్ నంబరు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన నంబర్లను ఈ-మెయిల్ చేయాలని దౌత్య కార్యాలయం సూచించింది. తరలింపు పరిస్థితి రావచ్చన్న దృష్ట్యా వారు సమాచారాన్ని సేకరిస్తున్నారు' అని అన్నారు. తెహ్రాన్ గగనతలాన్ని మూసివేశారని, ఇమామ్ ఖమేనీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు నిలిచిపోయాయని విద్యార్థులు ధ్రువీకరించారు. కాగా, వైమానిక దాడులకు సంబంధించిన సరస్లు, భూ ప్రకంపనలతో విద్యార్థులు భయపడుతున్నారని, వారికి రక్షణ కల్పించాలని కోరుతూ విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌కు జమ్మూకశ్మీర్ విద్యార్థి సమాఖ్య ఒక లేఖ పంపింది. 'విద్యార్థులు, వారి కుటుంబాల నుంచి సహాయం కోసం ఫోన్లు వస్తున్నాయి. తరలింపు అనివార్యమైనప్పుడు ఎలాంటి జాప్యం లేకుండా విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధం కావాలని కోరుతున్నాం' అని సమాఖ్య జాతీయ కన్వీనర్ నసీర్ ఖుహామీ వెల్లడించారు.

విమానం తోక భాగంలో మరో మృతదేహం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన ప్రాంతంలో శిథిలాలను తొలగిస్తుండగా శనివారం మరో మృతదేహం లభ్యమైంది. విమానం తోక భాగంలో ఈ మృతదేహాన్ని గుర్తించారు. ఇది ఎయిర్ హోస్టెస్ మృతదేహంగా అధికారులు చెబుతున్నారు. అలహాబాద్ నుంచి లండన్‌కు గత గురువారం బయలుదేరిన ఏఐ-171 (బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్) విమానం టేకాఫ్ అయిన 33 సెకన్లలోనే కుప్పకూలింది. విమానాశ్రయం సమీపంలోని మెఘాని నగర్ ఏరియాలో మెడికల్ కాలేజీ సమీపంలోని డాక్టర్స్ హాస్టల్ రూఫ్‌టాప్‌పై విమానం కుప్పకూలింది. దీంతో విమానంలో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. విమానంలో సిబ్బంది సహా 242 మంది ప్రయాణిస్తుండగా 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్కరు మాత్రమే బతికి బయటపడ్డారు. విమానం తోక భాగం భవనంపైనే చిక్కుకుపోయింది. మృతులలో 169 మంది భారతీయులు, 52 మంది బ్రిటిన్ పౌరులు, ఏడుగురు పోర్చుగీస్ ప్రజలు, ఒక కెనడియన్ ఉన్నారు.

భగ్గుమంటున్న భానుడు...

30 వరకు స్కూళ్లకు సెలవుల పొడిగింపు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. జూన్ రెండో వారం ముగుస్తున్నా ఎండలు దంచికొడుతున్నాయి. దాంతో యూపీ ప్రాథమిక విద్యా మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థుల సెలవులను ఈ నెల 30 వరకు పొడిగించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16 నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో సెలవులను మరో 15 రోజులు పొడిగించారు. అయితే పాఠశాలల టీచర్లు, ఇతర సిబ్బంది మాత్రం విధులకు హాజరుకావాల్సి ఉంటుందని యూపీ ప్రాథమిక విద్యామండలి ఒక ప్రకటనలో పేర్కొంది. జూలై ఒకటో తేదీన తరగతులు ప్రారంభమవుతాయని ప్రాథమిక విద్యామండలి తెలిపింది.

మన విదేశీ విధానం మారిందా?

- మోదీ సర్కార్ సమాధానమివ్వాలి
- గాజా కాల్పుల విరమణ తీర్మానంపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: గాజాలో కాల్పుల విరమణ కోసం ఐక్యరాజ్యసమితిలో తీర్మానం సందర్భంగా ఓటింగ్‌కు గైర్హాజరు కావడంపై కాంగ్రెస్ శనివారం కేంద్రంలోని మోదీ సర్కార్‌పై విమర్శల దాడి చేసింది. భారతదేశ విదేశాంగ విధానం సిగ్గుచేటుగా ఉందని పేర్కొంది. యుద్ధానికి, జాతి నిర్మూలనకు వ్యతిరేకంగా, న్యాయం కోసం భారతదేశం తన సూత్రప్రాయమైన వైఖరిని విడిచిపెట్టిందా అనే దానిపై ప్రభుత్వం నుంచి సమాధానాలు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. 'మన విదేశాంగ విధానం ఇప్పుడు గందరగోళంలో ఉందని స్పష్టంగా కనిపిస్తోంది. బహుశా, ప్రధాని మోదీ ఇప్పుడు తన విదేశాంగ వ్యవహారాల శాఖ తరచూ చేసే తప్పులపై నిర్ణయం తీసుకుని కొంత జవాబుదారీతనం చూపించాలి' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 149 దేశాలు గాజాలో కాల్పుల విరమణ కోసం యుఎన్‌జీఏలో తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశాయని, భారతదేశం గైర్హాజరయిన 19 దేశాలలో ఒకటి మాత్రమే అని ఆయన అన్నారు. 'ఈ దశ ద్వారా మేము వాస్తవంగా ఒంటరిగా ఉన్నాము' అని పేర్కొన్నారు.

గాజాలో కాల్పుల విరమణ తీర్మానంపై కేంద్రంలోని మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ మండిపడ్డారు. 'భారతదేశం ఎల్లప్పుడూ శాంతి, న్యాయం, మానవ గౌరవం కోసం నిలబడుతుందని, కానీ ఇప్పుడు పెరుగుతున్న మానవతా సంక్షోభం ఉన్నప్పటికీ దక్షిణాసియా, బ్రిక్స్, ఐక్యరాజ్య సమితిలో ఈ అంశంపై ఒంటరిగా నిలుస్తుంది' అని అన్నారు. 'గత ఆరు నెలల్లో భారతదేశం కాల్పుల విరమణకు మద్దతు ఇవ్వకుండా దూరంగా ఉండటానికి దారితీసిన మార్పు ఏమిటి? ఈ ప్రభుత్వానికి నెహ్రూ జీ వారసత్వం పట్ల పెద్దగా గౌరవం లేదని మనకు తెలుసు. కానీ పాలస్తీనాపై వాజ్‌పేయి జీ సూత్రప్రాయమైన వైఖరిని కూడా ఎందుకు వదులుకోవాలి?' అని 'ఎక్స్' పోస్ట్‌లో ప్రశ్నించారు. గాజాలో కొనసాగుతున్న సంక్షోభ సమయంలో భారతదేశం మౌనంగా ఉండకూడదని, ప్రపంచ సంఘర్షణలలో శాంతి, న్యాయం, సంభాషణలకు ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని దేశానికి గుర్తు చేస్తూ వేణుగోపాల్ అన్నారు.

గాజా తీర్మానంపై ఓటింగ్‌కు భారతదేశం దూరంగా ఉండటం 'దిగ్భ్రాంతికరమైన నైతిక పిరికితనం' చర్య అని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా అన్నారు. 'ఇది మన వలస వ్యతిరేక వారసత్వానికి, మన స్వంత స్వాతంత్ర్య పోరాట విలువలకు ద్రోహం' అని 'ఎక్స్' లో పేర్కొన్నారు. 'భారతదేశం ఒకప్పుడు పాలస్తీనాకు అండగా నిలిచింది. 1974లో పాలస్తీనా విముక్తి సంస్థ (పీఎల్‌వో) ను గుర్తించిన మొదటి అరబ్ యేతర దేశంగా నిలిచింది' అని అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన 7వ అలీన ఉద్యమ (నామ్) శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావడానికి 1983లో పీఎల్‌వో చీఫ్ యాసర్ అరాఫత్ భారతదేశాన్ని సందర్శించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. 'మనం న్యాయం కోసం ఒక వ్యూహంగా కాదు. ఒక సూత్రంగా నిలబడ్డాము. కానీ నేడు, ఆ గర్వించదగ్గ వారసత్వం శిథిలావస్థలో ఉంది' అని తెలిపారు.

భారత్ దూరంగా ఉండటం సిగ్గుచేటు: ప్రియాంక

మలప్పురం(కేరళ): గాజాలో పౌరులను రక్షించడానికి, మానవతా బాధ్యతలను నిలబెట్టడానికి ఐక్యరాజ్యసమితి తీర్మానానికి దూరంగా ఉండాలనే భారత ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా శనివారం 'సిగ్గుచేటు' అని, 'నిరాశపరిచేది' అని పేర్కొన్నారు. 60 వేల మంది ప్రజలు... ఎక్కువగా మహిళలు, పిల్లలు చంపబడినప్పుడు, గాజాలోని మొత్తం జనాభా 'నిర్బంధించి ఆకలితో చంపేస్తున్నప్పుడు' భారత ప్రభుత్వం ఎటువంటి వైఖరి తీసుకోవడానికి నిరాకరిస్తోందని వాద్రా పేర్కొన్నారు. గాజా సమస్యపై భారతదేశం మౌనంగా ఉండటమే కాకుండా ఇజ్రాయిల్ ప్రభుత్వం ఇరాన్‌పై దాడి చేసి దాని నాయకత్వాన్ని హత్య చేస్తున్నప్పుడు దానిని 'ప్రియం' గా చూస్తోందని వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. 'ఇది మన వలసవాద వ్యతిరేక వారసత్వాన్ని విషాదకరమైన తిరోగమనం.

వాస్తవానికి నెతన్యాహు మొత్తం దేశాన్ని నిర్మూలించినప్పుడు మనం మౌనంగా నిలబడటమే కాకుండా ఆయన ప్రభుత్వం ఇరాన్‌పై దాడి చేసి దాని నాయకత్వాన్ని హత్య చేయడం ద్వారా దాని సార్వభౌమత్వాన్ని, అన్ని అంతర్జాతీయ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించినప్పుడు మనం ఉత్సాహంగా ఉన్నాము' అని ఆమె 'ఎక్స్' లో పేర్కొన్నారు. శాంతి, మానవత్వం ఆధారంగా అంతర్జాతీయ వేదికకు దారితీసిన రాజ్యాంగ సూత్రాలను, స్వాతంత్ర్య పోరాట విలువలను దేశం ఎలా 'వదిలివేయగలదు' అని ఆమె ప్రశ్నించారు.

మణిపూర్‌లో భారీగా ఆయుధాల స్వాధీనం

ఇంఫాల్ : మణిపూర్ పోలీసులు, భద్రతా దళాలు 300 తుపాకులతో పాటు భారీ మొత్తంలో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. జూన్ 13, 14 తేదీల మధ్య రాత్రి ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో ఏకకాలంలో నిర్వహించి మొత్తం 328 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఎస్ఎల్ఆర్ 151, ఇన్సాస్ 65, ఇతర రకాల రైఫిల్స్ 73, కార్బైన్లు 5, ఎంపీ 5 2, ఎల్ఎంజీ 12, ఏకే సిరీస్ రైఫిల్స్ 6, అమోగ్ రైఫిల్స్ 2, మోర్టార్ 1, పిస్టల్స్ 6, బారెల్స్ 2, ఏఆర్ 15 గన్ 1, ఫ్లేర్ గన్లు 2 ఉన్నాయి. అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ లారి డోర్జీ లాటూ ప్రకారం, ఇంఫాల్ లోయ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో ఆయుధాలు, మందుగుండ సామగ్రి దాచి ఉంచినట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. మణిపూర్ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, సైన్యం, అసోం రైఫిల్స్ సంయుక్త బృందాలు వివిధ ప్రదేశాలలో ఏకకాలంలో సోదాలు ప్రారంభించాయి. దీని ఫలితంగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. 'సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి, ప్రజా క్రమాన్ని నిర్వహించడానికి, పౌరులు, వారి ఆస్తుల భద్రత కోసం మణిపూర్ పోలీసులు, భద్రతా దళాలు నిరంతరం చేస్తున్న ప్రయత్నాలలో ఈ నిఘా ఆధారిత కార్యకలాపాలు ఒక ప్రధాన విజయాన్ని సూచిస్తాయి' అని మణిపూర్ పోలీసులు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు అన్ని భద్రతా భాగస్వాములతో సన్నిహిత సమన్వయంతో ఉన్నారని పోలీసులు తెలిపారు. రాష్ట్రంలో జాతి సంఘర్షణ సమయంలో దుండగులు పోలీసు ఆయుధ శాలలు, పోలీసుల ఇతర సంస్థల నుంచి 4,000 కంటే ఎక్కువ తుపాకులను దోచుకున్నారు. స్వాధీనం చేసుకున్న తుపాకులు దోచుకున్న ఆయుధాలలో ఉన్నాయా అనేది స్పష్టంగా తెలియదు.

క్రిప్టో కరెన్సీతో పెరిగిన లావాదేవీలు

పన్ను ఎగవేతదారులపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ: అమెరికాలో ట్రంప్ వచ్చిన తర్వాత క్రిప్టో కరెన్సీ విలువ భారీగా పెరిగింది. దీంతో వీటిపై పెట్టుబడులు చేసిన వారు పెద్దమొత్తంలో లాభాలు ఆర్జించారు. భారత్‌లోనూ చాలామంది క్రిప్టోపై పెట్టుబడులు పెట్టారు. వీరు క్రిప్టో లావాదేవీలపై పన్నులు ఎగవేస్తున్నట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) గుర్తించింది. దీంతో ఎగవేతను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని సీబీడీటీ నిర్ణయించింది. క్రిప్టో ఎక్స్ఛేంజ్‌ల ద్వారా పొందిన డేటా ఆధారంగా 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి వేలాది మంది పన్ను చెల్లింపుదారులపై దృష్టి సారించింది. ఆయా వ్యక్తులు తమ వర్చువల్ డిజిటల్ ఆస్తుల ఆదాయాన్ని ఆదాయ పన్ను రిటర్న్‌లలో సరిగ్గా ప్రకటించడం లేదు. డిజిటల్ ఆస్తుల వృద్ధిని దృష్టిలో ఉంచుకుని... వాటిపై సరైన పన్నుల విధానం అవసరమని కేంద్రం స్పష్టం చేసింది. దీని ద్వారా నల్లధనానికి అడ్డుకట్ట వేయడంతోపాటు పన్ను చెల్లింపుదారులకు న్యాయమైన వ్యవస్థను అందించడంపైనా దృష్టి సారించింది. క్రిప్టో మార్కెట్ నియంత్రణలోకి రావడంతోపాటు దీని ఆధారిత పెట్టుబడులపై విశ్వసనీయత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2025 బడ్జెట్‌లో క్రిప్టో లావాదేవీలపై పన్ను ఎగవేతను అరికట్టడానికి కీలక మార్పులు ప్రతిపాదించబడ్డాయి. సెక్షన్ 158%దీ% ప్రకారం అధికారులు క్రిప్టో ఆదాయాన్ని పునద్ధరించనిదిగా పరిగణించి, 60% పన్ను జరిమానా విధిస్తారు. సెక్షన్ 285 బి ప్రకారం క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లు, ఇతర సంస్థలు తమ లావాదేవీల వివరాలను పన్ను అధికారులకు సమర్పించాలి. భారత ప్రభుత్వం క్రిప్టో సంస్థలపై పన్ను ఎగవేతపై కఠిన చర్యలు తీసుకుంటోంది. బైనాన్స్‌కు చెందిన నెస్ట్ సర్వీసెస్ లిమిటెడ్ రూ. 722.43 కోట్ల జీఎస్టీ ఎగవేతకు గురైంది. అలాగే, మరికొన్ని సంస్థలూ పన్ను ఎగవేతలో ముందువరుసలో ఉన్నట్లు గుర్తించారు.

రెండుసార్లు రూపానీ టికెట్ రద్దు

మూడోసారి మృత్యు ఒడిలోకి...

అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ప్రయాణానికి సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. లండన్‌లో ఉన్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళుతున్న రూపానీ... అంతకుముందు రెండుసార్లు వెళ్లేందుకు సిద్ధమై టికెట్ రద్దు చేసుకున్నట్లు తెలిసింది. చివరకు మూడోసారి బయలుదేరినప్పటికీ గమ్యాన్ని చేరకముందే విమాన ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అంతేకాకుండా ఆయన లక్కీ నంబర్‌గా భావించే '1206' సంఖ్య కలిగిన తేదీనే ఆయనకు చివరి రోజయింది. రూపానీ వ్యక్తిగత వాహనాలన్నీ అదే నంబరుతో ఉన్నాయి. విజయ్ రూపానీ ఆయన భార్యతో కలిసి మే నెలలోనే లండన్ వెళ్లేందుకు ఎయిరిండియా 171 విమానంలో టికెట్ బుక్ చేసుకున్నారు. కొన్ని కారణాల వల్ల తన పర్యటనను రద్దు చేసుకున్నాడు. తన భార్యను మాత్రం అక్కడికి పంపించారు. జూన్ 5న వెళ్లేందుకు మళ్లీ బుక్ చేసుకున్నప్పటికీ... అనివార్య కారణాల వల్ల ఆ టికెట్‌ను కూడా రద్దు చేసుకున్నారు. బీజేపీ పంజాబ్ ఇంఛార్జీగా ఉన్న రూపానీ... లుధియానా ఉపఎన్నిక నేపథ్యంలోనే తన ప్రయాణాన్ని రెండుసార్లు విరమించుకున్నట్లు తెలుస్తోంది. చివరకు జూన్ 12న లండన్‌కు ప్రయాణమైన రూపానీ... విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. అలాగే, అహ్మదాబాద్‌కు సమీపంలోని ఆనంద్ ప్రాంతానికి చెందిన మోనాలి, సన్నీ దంపతులు కూడా విమాన ప్రమాదంలో మృతిచెందారు. లండన్‌కు వెళ్లేందుకు వీరు జూన్ 6నే టికెట్ బుక్ చేసుకున్నప్పటికీ వ్యక్తిగత కారణాల వల్ల దాన్ని రద్దు చేసుకున్నారు. చివరకు 12వ తేదీన ఎయిరిండియా విమానంలో బయలుదేరిన వారిద్దరు మృత్యువాత పడటంతో జీర్ణించుకోలేకపోతున్నామని బంధువులు వాపోయారు.

పహల్గాం ధీరుడి భార్యకు ఉద్యోగం

శ్రీనగర్: పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో చిక్కుకున్న పర్యాటకులను రక్షించే ప్రయత్నంలో అధువులు బాసిన స్థానికుడు సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షాకు కేంద్ర ప్రభుత్వం గొప్ప గౌరవం కల్పించింది. హుస్సేన్ షా కుటుంబ సభ్యులను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శనివారం కలుసుకున్నారు. హుస్సేన్ షా భార్య గుల్నాజ్ అక్తర్‌కు ప్రభుత్వ ఉద్యోగమిస్తూ... దానికి సంబంధించిన అపాయింట్‌మెంట్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు కేంద్ర సర్కారుకు ధన్యవాదాలు తెలిపారు. కశ్మీర్‌లోని పేద కుటుంబంలో జన్మించి... ఇంటర్ చదివిన ఆదిల్... అమర్‌నాథ్ యాత్ర సమయంలో పహల్గాంకు వచ్చే పర్యాటకుల కోసం పోనీ గైడ్‌గా పనిచేసేవాడు. యాత్రికులను గుర్రంపై తీసుకెళ్లి వాళ్లకి అక్కడి ప్రదేశాలు చూపిస్తూ... వాటి గురించి వివరించేవాడు. ప్రతీ రోజులానే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఉగ్రమూక పర్యాటకులపై కాల్పులు జరుపుతోంది. దీంతో ఆదిల్ ఎంతో ధైర్య సాహసాలతో ఉగ్రవాదుల నుండి తుపాకీ లాక్కొని పర్యాటకులను రక్షించడానికి తన వంతు ప్రయత్నం చేశాడు. దీంతో ఉగ్రమూక ఆదిల్‌ని గన్‌తో కాల్చి పొట్టన బెట్టుకున్నది.

భారత్‌లో 7,400కి పెరిగిన కరోనా కేసులు

87కు చేరిన మరణాలు

న్యూఢిల్లీ: భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. నిత్యం వందలాది కేసులు వెలుగు చూస్తున్నాయి. గత 24 గంటల్లో 200కి పైగా కొత్త కేసులు నమోదయ్యాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం... శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకూ దేశంలో 269 కొత్త కేసులు బయటపడ్డాయి. అత్యధికంగా కర్నాటకలో 132 కేసులు వెలుగు చూశాయి. దీంతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 7,400కి పెరిగింది. అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 2,109 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గుజరాత్‌లో 1,437, పశ్చిమ బెంగాల్‌లో 747, ఢిల్లీలో 672, మహారాష్ట్రలో 613, కర్నాటకలో 527 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. శుక్రవారం ఒక్కరోజే తొమ్మిది మంది మరణించారు. మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ముగ్గురు, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున తొమ్మిది మంది మృతి చెందారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ కరోనాతో మరణించిన వారి సంఖ్య 87కు చేరింది. ఇక కరోనా వైరస్ నుంచి కోలుకున్న వారి సంఖ్య 11 వేలు దాటింది. ఇప్పటి వరకూ 11,967 మంది వైరస్ నుంచి కోలుకున్నారు.

నీట్‌లో అధిక మార్కుల ఆశ చూపి

రూ.87.5 లక్షల మోసం

సీబీఐ కస్టడీలో ఇద్దరు నిందితులు

న్యూఢిల్లీ: నీట్ పీజీ-2025 అభ్యర్థులు, వారి కుటుంబాలకు అధిక మార్కుల ఆశ చూపి రూ.87.5 లక్షల మేర మోసం చేసిన ఇద్దరిని సీబీఐ అరెస్టు చేసింది. ఈ మేరకు శనివారం దర్యాప్తు సంస్థ ప్రకటన విడుదల చేసింది. నీట్ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో తమకు పలుకబడి ఉందని నమ్మించి తమను మోసం చేశారంటూ మహారాష్ట్రలోని నవీ ముంబై, సోలాపూర్‌కు చెందిన బాధితుల ఫిర్యాదు మేరకు ఈనెల 9న సీబీఐ కేసు నమోదు చేసింది. అదే రోజు ఒకరిని ముంబైలో, ఆ మరుసటి రోజు మరొకడిని సంగ్లీ జిల్లాలో అరెస్టు చేశారు. ఇద్దరినీ ముంబైలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టగా వారికి ఈనెల 13వ తేదీ వరకు కస్టడీ విధించారు. అనంతరం కస్టడీ సమయాన్ని 16వ తేదీ వరకు పొడిగించారు. ముంబైలోని ఐటీసీ గ్రాండ్ సెంట్రల్ హోటల్‌లో అభ్యర్థుల తల్లిదండ్రులతో నిందితులు కలిసి, ఒక్కొక్క విద్యార్థికి రూ.90 లక్షలు డిమాండ్ చేయగా, రూ.87.5 లక్షలకు ఒప్పందం జరిగింది. అధికారికంగా ఫలితాలను ప్రకటించడానికి ఆరు గంటలు ముందుగానే తమ పిల్లలకు పెంచిన మార్కుల జాబితాను పొందవచ్చని తల్లిదండ్రులకు వారు భరోసానిచ్చారు. ఇద్దరు నిందితులు అడ్మిషన్ కన్సల్‌టెన్సీ సంస్థ నడుపుతుంటారు. ఒకరికి నవీ ముంబైలో, మరొకరికి పూనే వ్యాపారం ఉంది. వారి మొబైల్ ఫోన్లలో సాగిన చాట్‌లను ఫోరెన్సిక్ నిపుణులు విశ్లేషించారు. నీట్ రోల్ నంబర్లు, అడ్మిట్ కార్డులు, ఓఎంఆర్ షీట్ల వివరాలు, ఆర్థిక వ్యవహారాలు, హవాలా నెట్‌వర్కుల గురించి సంభాషణ ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ కుంభకోణంలో ఎన్‌టీఏ లేక ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించలేదు. కేసు విచారణ కొనసాగుతోంది.

ఆర్‌జేడీ బీహార్ అధ్యక్షుడిగా ఈబీసీ నాయకుడు?

పాట్నా : రాష్ట్రీయ జనతా దళ్ శనివారం తన బీహార్ విభాగం అధ్యక్షుడిగా ఈబీసీ నాయకుడిని నియమించడానికి సిద్ధమయింది. ప్రముఖ రాజకీయ నాయకుడు మంగని లాల్ మండల్ పార్టీ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు లాలూ ప్రసాద్ సమక్షంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మండల్... రాష్ట్ర మాజీ మంత్రి, పార్లమెంటు ఉభయ సభలలో మాజీ ఎంపీ. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) తో సంబంధాలను తెంచుకున్న తర్వాత ఈ సంవత్సరం జనవరిలో ఆర్‌జేడీకి తిరిగి వచ్చారు. పార్టీ సంస్థాగత ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి అయిన ఆర్‌జేడీ ప్రతినిధి చిత్తరంజన్ గగన్ ప్రకారం, మధ్యాహ్నం ప్రక్రియ ముగిసే వరకు ఈ పదవికి నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన ఏకైక అభ్యర్థి మండల్ మాత్రమే. 'రేపు నామినేషన్ పత్రాల పరిశీలన తేదీ, ఇవి సక్రమంగా ఉన్నాయని తేలితే, మండల్ ఎన్నికల నుంచి వైదొలగకపోతే, జూన్ 19న ఆయన రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నికయినట్లు ప్రకటిస్తారు' అని గగన్ వివరించారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు మండల్ జేడీ(యూ) లో చేరారు. ఆర్‌జేడీలో అత్యంత వెనుకబడిన తరగతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ నిరాకరించడంతో ఆయనకు జేడీ(యూ) కు దూరమయ్యారు.

ఇదిలాఉండగా, వరుసగా రెండుసార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అగ్ర కుల నాయకుడు జగదానంద్ సింగ్ స్థానంలో బీహార్ ఆర్‌జేడీ అధ్యక్షుడిగా ఎన్నికవుతారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సంఖ్యాపరంగా శక్తివంతమైన వెనుకబడిన తరగతులను తనకు అనుకూలంగా ప్రోత్సహించే పార్టీ వ్యూహంలో భాగంగా మండల్ నియమించనుండటం ప్రాధాన్యాంశంగా భావిస్తున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐఏఎస్ శిక్షణా శిబిరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖచే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు - 2026 కొరకు తెలంగాణ రాష్ట్ర ఎస్.టి., ఎస్.సి., బి.సి. అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన తెలంగాణా రాష్ట్ర ఎస్.టి., ఎస్.సి., బి.సి. అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుచున్నవి. అభ్యర్థులు ఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడుతారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించరాదు. అభ్యర్థులు http://studycircle.cgg.gov.in లో లాగిన్ అయ్యి తేది: జూన్ 14 నుండి జూలై 04 వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్‌లైన్ అప్లికేషన్, సూచనలు http://studycircle.cgg.gov.in, http://twd.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో కలవు. మరిన్ని వివరాలకు ఫోన్ 6281766534 నంబరును అన్ని పని దినాలలో ఉదయం గం. 10:30 నుండి సాయంత్రం గం. 5 లోపు సంప్రదించగలరని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.

గంగపుత్ర సంఘానికి మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్లికార్జున నగర్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా మల్లికార్జున నగర్ లోని గంగపుత్ర సంఘానికి పవర్ బోరుతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యేలు కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే నిధులతో గంగపుత్ర సంఘానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు బాలయ్య, ఐలయ్య, జి.బాలయ్య, ధర్మపురి, విశ్వనాథ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపట్టానికి గాంధీ భవన్‌లో ఎంపీ.చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ వికలాంగులకు స్వర్ణయుగం ప్రారంభమైందని అన్నారు. దేశ చరిత్రలోనే వికలాంగులకు 40 శాతం వైకల్యంకే ఉచిత పరికాలు అందించేలా జీఓ 89 తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. అదేవిధంగా వికలాంగులు అయిన వారు వికలాంగులను పెళ్ళి చేసుకుంటే వారికి ప్రోత్సాహం కింద రూ.లక్షను ఇవ్వడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగులకి ఉన్నత విద్యలో 5 శాతం రిజర్వేషన్, కోర్టు ఉద్యోగాలలో 5శాతం రిజర్వేషన్, నిరుద్యోగులుకి ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా వికలాంగుల సహకార సంస్థలో వికలాంగ ఉద్యోగులకు 15 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 2010, 2015, 2020 పీఆర్సీలను విడుదల చేయడంతో పాటు హైదరాబాద్ జిల్లాలో 7 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 18 మంది వికలాంగులకి బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తి చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో 5శాతం రిజర్వేషన్, రాజీవ్ యువ వికాసంలో 5శాతం రిజర్వేషన్, అన్ని పోలీస్ స్టేషన్లలో పకడ్బందీగా వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం రక్షణ కల్పించేలా ఉత్తర్వులతో పాటు ఇప్పటికే అనేక అంశాల్లో వికలాంగుల సంక్షేమం కోసం జీఓలు ఇచ్చి అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ చారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దేశగాని సతీశ్ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సిరిగిరి రజినీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మధ్యపాగ సురేష్, మేకల సమ్మయ్యతో పాటు వికలాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చేగువేరా చిత్ర పటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ నెల్లికంటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాటం నిర్వహించిన విప్లవకారుడు చేగువేరా అని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చేగువేరా 97వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దం భవన్‌లో చేగువేరా చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ విప్లవకారులకు చేగువేరా మార్గదర్శకమని, స్ఫూర్తిదాయకమైన వారున్నారు. ప్రపంచంలోనే అనేక దేశాలలో ముఖ్యంగా అమెరికాలోని సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా క్యూబా దేశంలో ఫెడరల్ క్యాస్ట్రో నాయకత్వంలో ప్రముఖ పాత్ర పోషించి ఆ దేశంలో విప్లవం సాధించారని, లాటిన్ అమెరికా దేశాలలో జరుగుతున్న సామ్రాజ్యవాదం పై పోరాటం నిర్వహించారన్నారు. ప్రపంచ యువతరానికి, విప్లవకారులకు, కమ్యూనిస్టులకు ఆయన స్ఫూర్తిదాయకమని వారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి ఎ.గోవిందరావు, బిల్డింగ్ ఇన్చార్జి బోయ శ్రీరాములు, ఓయు విద్యార్థి నాయకులు రహమాన్, విద్యార్థి నాయకులు ఆంజనేయులు, దశరథ, విజయ్ కుమార్, సందీప్, శివకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం అనేది మానవాళికి పవిత్ర సేవ

రక్త సేకరణలో రెడ్ క్రాస్ సేవలు చిరస్మరణీయం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రక్తదానం అనేది సేవ అనేదానికంటే మానవాళికి పవిత్ర సేవ అని అనడం సరైదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2025 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్‌లోని సంకృతిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాతలందరికీ వారి ప్రాణాలను కాపాడే సేవకు ధన్యవాదాలు తెలిపారు. దీనిని "సేవ" - మానవాళికి పవిత్ర సేవ అని పిలిచారు. వారి నిస్వార్థ సహకారం ప్రాణాలను కాపాడటమే కాకుండా, కష్టాల్లో ఉన్న లెక్కలేనన్ని కుటుంబాలకు ఆశను తెస్తుందని ఆయన అన్నారు. స్వచ్ఛంద రక్తదానానికి నిరంతరం మద్దతు ఇచ్చే ప్రేరేప కులు, నిర్వాహకులు సిఎస్ఆర్ భాగస్వాముల కృషిని ఆయన ప్రశంసించారు. సురక్షితమైన, సమర్థవంతమైన రక్త సేకరణను నిర్ధారించడంలో వైద్యులు, రెడ్ క్రాస్ వాలంటీర్ల పాత్రను కూడా ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ పరివార్ సభ్యులు, భద్రతా సిబ్బంది శిబిరంలో చురుకుగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం గవర్నర్ రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. సామాజిక సేవ సీఎస్ఆర్ మద్దతు ద్వారా అత్యుత్తమ కృషి చేసిన ఎన్‌జీఓలు, సంస్థాగత ప్రతినిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఆర్‌సిఎస్ తెలంగాణ చైర్మన్ దాన కిషోర్, గవర్నర్ జాయింట్ సెక్రటరీ జె. భవాని, శంకర్ సీనియర్ రాజ్ భవన్ అధికారులు ఐఆర్‌సిఎస్ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు స్వచ్ఛంద సేవకులు ఇతర అతిథులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ "ప్రతీ అడుగు పచ్చదనం" నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతుందని, దీనిలో అధికారులు, ఉద్యోగులు, స్థానికులు అందరూ పాల్గొనేలా ప్రత్యేక చొరవ చూపాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. శనివారం ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల్లోని జనరల్ మేనేజర్లతో వివిధ అంశాలపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనిని విజయవంతం చేయడం కోసం ప్రతీ ఒక్కరూ తమకు సాధ్యమైనన్ని మొక్కలు నాటే విధంగా చొరవ చూపాలని కోరారు. నీటి బిందువు జలసింధువు" కార్యక్రమంలో భాగంగా మొత్తం 62 మినీ చెరువుల నిర్మాణంలో ఇప్పటికే 60 చెరువులు పూర్తవడం సంతోషకరమని, మిగిలిన చెరువులు కూడా మరో వారంలోపు పూర్తి చేయాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా సమీప గ్రామాల్లో 43 చెరువుల్లో మట్టి పూడికలు తీయాలని నిర్ణయించామని, వీటిలో ఇప్పటికి కేవలం నాలుగు మాత్రమే పూర్తయ్యాయి. కనుక మిగిలినవి త్వరగా పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం కోసం ఇకపై సింగరేణి సంస్థ నుండి జి 14, జి 15 గ్రేడు గల బొగ్గు రవాణాను పూర్తిగా నిలిపివేయాలని, దానికి బదులు జి 13 గ్రేడ్ బొగ్గును సరఫరా చేయటానికి తగు ఏర్పాటు చేయాలని జనరల్ మేనేజర్లను ఆదేశించారు. చిన్న తరహా పరిశ్రమల వారు తమకు కావలసిన తక్కువ మోతాదు బొగ్గును సింగరేణి ఏరియాలకు వచ్చి తీసుకువెళ్లడం అంత వెసులుబాటు కావడం లేదని గమనించబడిందని, వీరి సౌకర్యం కోసం హైదరాబాదుకు సమీపంలో ఒక బొగ్గు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులని ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనులలో సాండ్ స్టోయింగ్ కోసం గోదావరి నది నుండి ఇసుక సేకరణకు గాను వెంటనే క్వారీ ఏర్పాటుకు అనుమతులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఈ అండ్ ఎం.డి.సత్యనారాయణరావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని, జనరల్ మేనేజర్ సి.పి.పి ఏ.మనోహర్, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్.వి.రాజశేఖర్ రావు, కార్పోరేట్ నుండి వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, ఏరియాల్లోని జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

టీపిసిసి అధ్యక్షుని కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సామాజికి న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందనే విషయాన్ని ప్రస్తుత మంత్రివర్గ విస్తరణతో పాటు టీపిసిసి కమిటీ ఏర్పాటుతో మరోసారి నిరూపితం అయిందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం అయన గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రివర్గంలో తనకు అవకాశం కల్పించినందుకు అందుకు సహకరించినందుకు అయన మహేష్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. బిసి బిడ్డ శ్రీహరికి మంత్రి పదవి రావడం హర్షణీయమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటుందని, అన్ని పదవులలో బిసిలకు, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత కల్పిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. తనకు మంత్రి పదవి ఇచ్చినందుకు తన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహిస్తానని, నాకు మంత్రిగా అవకాశం ఇచ్చిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు జీవితాంతం రుణపడి ఉంటా అంటూ వ్యాఖ్యానించారు. నేను చచ్చే వరకు ప్రజల్లో ఉండి, ప్రజలకు సేవ చేస్తానని, తనకు ఈ అవకాశం కల్పించిన మక్తల్ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన చేశారన్నారు. రాజకీయల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తి పీసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అని, నేను మంత్రి కావడానికి సహకరించిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విలువలు కలిగిన మహనీయుడు చేగువేరా

విశాలాంధ్ర - హైదరాబాద్ : గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తీభవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నస్టో చేగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. చేగువేరా 97వ జయంతిని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాల యం (సత్య నారాయణ రెడ్డి భవన్)లో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని వారు ఉద్ఘాటించారు. వంద పండ్లను ఒక్కడే దాచుకోవడం క్యాపిటలిజం- ఉన్నదాంట్లో అందరూ పంచుకోవడం కమ్యూనిజం అని చెప్పిన చేగువేరా మాటలు ప్రజా ఆకాంక్షలకు అద్దం పడుతుందన్నారు. చేగువేరా అమెరికన్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అనేక పోరా టాలు నిర్వహించాడని వారు అన్నారు. విప్లవం అనేది పక్వానికొచ్చినప్పుడు కిందపడే ఆపిల్ పండు కాదని- మనమే దాన్ని పోరాడి సాధించుకోవాలన్న చేగువేరా మాటలు నేటి ప్రపంచానికి పోరాట పటిమను చూపుతుందని వారు ఉద్ఘాటించారు. ముఖ్యంగా స్థానిక ప్రజలను చైతన్యవతుల్ని చేసి వారిని విప్లవోద్యమం వైపు మళ్ళించకుండా విప్లవాన్ని విజయవంతం చేయడం అసాధ్యమని చెప్పారన్నారు. రైతాంగం, కార్మిక వర్గం అనే రెండు పట్టాల మీద విప్లవమనే రైలు ప్రయాణం చేయాల్సి ఉంటుందని, తడిమట్టి ముద్ద, మార్క్సిజం మౌలిక భావనలు రెండూ ఒక్కటే అన్నారు.

కుమ్మరి కళాకారుని చేతుల్లో ఆ చక్రం మీద మనిషి అవసరం కోసం వివిధ ఆకృతుల్ని రూపొందించినట్లుగా ఆయా సమాజాల భౌతిక పరిస్థితుల్ని బట్టి మార్క్సిజాన్ని అన్వయించు కోవచ్చన్నారు. ఎన్ని రాజకీయ అభిప్రాయాలున్నా, సైద్ధాంతిక విభేదాలున్నా అంతిమంగా ప్రజల విముక్తే విప్లవకారుడి ధ్యేయం కావాలన్నారు. విత్తు నాటే ముందు వాన కురవాలి. పిడుగు పడే ముందు ఉరుము గర్జించాలి. ఒక విప్లవానికి ముందు త్యాగాలు జరిగి తీరాలని అనేక సందర్భాల్లో చెప్పారన్నారు. క్యూబా దేశంలో విద్య, వైద్యం ఉచితమని ఈ దేశాన్ని ఆదర్శంగా తీసుకుంటే ప్రపంచదేశాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. చేగువేరా తాను జీవితాంతం ఏ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాడో అదే అతన్ని ఫ్యాషన్ ఐకాన్‌గా మార్చేసి, ఆయన పేరు మీద నేటికీ వందల కోట్ల వ్యాపారం చేయడం విషాదకరమన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివ కుమార్, రాజేష్, మహమూద్, మాజీద్, మహేష్, మధు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ సేవలు అపారమైనవనీ కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత రత్న ప్రకటించాలని తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి సురేందర్ కోరారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, దళిత బాంధవుడు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఇటీవల బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాల్సిందేనని అనటం సరైనదేనని అన్నారు. ఐదు దశాబ్దాలుగా పార్లమెంటేరియన్‌గా వివిధ మంత్రి పదవులను విజయవంతంగా దేశానికి ఎన్నో సేవలు అందించారు. అన్ని వర్గాల ప్రజలకు తన అపారమైన అనుభవంతో అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బాబు జగ్జీవన్‌రామ్ సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించాలని సురేందర్ డిమాండ్ చేశారు.

జాతీయ జట్టుకు ఎంపికైన బాలికలకు అభినందనలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ నుండి ఆసియా కప్ భారత మహిళా సాఫ్ట్ బాల్ జట్టుకి ఎంపికైన చెపుర్వ ప్రవలికకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు. భారత జట్టు 2025 జూల్కై 14-20 వరకు చ్కైనాలోని జియాన్‌లో జరిగే ఆసియా కప్ ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ కోసం హైదరాబాద్‌కి చెందిన చెపుర్వ ప్రవలిక భారత్ జట్టుకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో అమెను మంత్రి పొన్నం చెపుర్వ ప్రవలికను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ నుండి భారత మహిళా జట్టు క్రీడాకారిణిగా చేపురువ ప్రవల్లిక ఎంపికవడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. చెపుర్వ ప్రవలికకు ప్రత్యేక కోచింగ్ క్యాంప్ జూన్ 20 నుండి జూన్ 25, 2025 వరకు శ్రీనగర్‌లో జరుగుతుంది. చైనాలోని జియాన్‌లో జరగనున్న ఆసియా కప్ సాఫ్ట్ చెపుర్వ ప్రవలిక ఆసియా కప్ బాల్ పోటీల్లో ప్రవలిక బాగా రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

కేటీఆర్‌కు ఇంగ్లీష్ ఫుల్.. సబ్జెక్ట్ నిల్

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ట్విటర్ టిల్లు కేటిఆర్‌కు ఇంగ్లీష్ ఫుల్, సబ్జెక్ట్ నిల్ అంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. పార్ములా ఈ కార్ రేసులో నోటీసులు ఇవ్వడంతో ఫ్రస్టేషన్‌తో లై డిటెక్టర్ చేయించుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఛాలెంజ్ చేస్తున్నాడు కాని డ్రగ్స్ కేసులో డ్రగ్ టెస్ట్ చేసుకోమని రేవంత్ రెడ్డి ఛాలెంజ్ విసిరితే కేటిఆర్ ఎందుకు వెనక్కి పోయిండని నిలదీశారు. మీరు లై డిటెక్టర్ పెట్టుకుంటే కోర్టులు ఎందుకు ఉన్నట్టు అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ఓవర్ యాక్షన్‌తోనే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు. ఈ కార్ రేసులో పాలనా అనుమతులు లేకుండా 44 కోట్లు ఎట్లా తరలించారు అని ఏసీబీ కేటిఆర్‌ను అడుగుతుందని, ఏజెన్సీలు విచారణ చేయడం తప్పా అంటూ నిలదీశారు. కాంగ్రెస్ ది వెండెట్టా పాలిటిక్స్ అని కేటిఆర్ అంటుండు, కాంగ్రెస్ ది వెండెట్టా పాలిటిక్స్ కాదు, ప్రజా పాలన అంటూ వ్యాఖ్యానించారు. మొన్న మా నాన్న చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్న కవిత మళ్ళీ ఈరోజు మా వర్కింగ్ ప్రెసిడెంట్‌కు నోటీసులు ఎట్ల ఇస్తారు అంటుందని దుయ్యబట్టారు. ఇదంతా డ్రామా కంపెనీ అని అర్థం అయిందని, రెండు మూడు నెలల నుండి మంత్రులు యంత్రాంగం ప్రజల్లో ఉండి సన్న బియ్యం అందుతున్నాయని క్షేత్ర స్థాయిలో తెలుసుకుంటున్నారన్నారు. దేవాలయం లాంటి అసెంబ్లీకి ప్రతిపక్ష నాయకుడుగా రావాలనే ఆలోచన లేదని, ఇది కాదు ప్రతి పక్షం నేత చేయాల్సిందన్నారు.

హిమాలయ బేబీకేర్ 'జెంటిల్ యాజ్ డాడ్' క్యాంపెయిన్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశంలో నెంబర్ వన్ డాక్టర్ ప్రిస్క్రైబ్ చేసే బేబీకేర్ బ్రాండ్ హిమాలయ బేబీకేర్ ఫాదర్స్ డే సందర్భంగా హృదయాన్ని హత్తుకునే వీడియో ఫిల్మ్‌ను విడుదల చేసింది. ప్రసిద్ధ కన్నడ పాట 'ఐ లవ్ యూ అప్పా' స్ఫూర్తిగా తీసుకుని రూపొందించిన ఈ 'జెంటిల్ యాజ్ డాడ్' క్యాంపెయిన్ తండ్రి, కూతురి మధ్య అనుబంధాన్ని ఎంతో భావోద్వేగంతో చెబుతుంది. పుట్టుక నుంచి పెళ్లి వరకు గల బంధం ఇందులో ఉంది. ప్రాంతీయ ప్రేక్షకులతో అనుబంధం ఏర్పడేలా ఈ పాటను హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, మరాఠీ, బెంగాలీ భాషలలోకి అనువదించారు. తండ్రిని కేవలం సంరక్షకుడిగా మాత్రమే కాకుండా, ఒక బలమైన ఆధారంగా కూడా ఇందులో చూపిస్తారు. పిల్లల జీవితంలో తండ్రి పాత్ర ఈ ప్రచారంలో హృదయాన్ని తాకుతుంది. శాస్త్రీయతతో హెర్బల్ కేర్‌ను అందించే ఈ ఉత్పత్తులు తండ్రి పాత్రను మరింత అర్థవంతంగా చూపిస్తూ, ప్రేమ, పెంపకం, మార్గదర్శనం వంటి ప్రతి అంకంలో ఓ మౌన భాగస్వామిగా ఎంతో హృద్యంగా ఉంటుంది. ఈ సందర్భంగా హిమాలయ వెల్‌నెస్ కంపెనీ బేబీకేర్ డైరెక్టర్ చక్రవర్తి ఎన్వీ మాట్లాడుతూ తండ్రి ఎప్పుడూ పిల్లల జీవితంలో మౌనమైన ఆధార స్తంభాలుగా ఉంటారన్నారు. ఎప్పుడూ పిల్లల వెనుక నిలబడి ప్రేమతో వారి ప్రపంచాన్ని నిర్మించే వారుగా ఉంటారని తెలిపారు. ఈ క్యాంపెయిన్తో తండ్రుల శక్తిని గౌరవించాలనుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషియల్ పంగా సహస్థాపకుడు హిమాన్షు అరోరా మాట్లాడుతూ ఈ ఫాదర్స్ డే సందర్భంగా మా ప్రచారం తండ్రులు, కూతుళ్ల మధ్య ఉన్న శాశ్వత బంధాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఓ తండ్రిగా ఈ అనుబంధం నాకు వ్యక్తిగతంగా ఎంతో విలువైనదన్నారు. కూతురు ఎంత వయసు వచ్చినా తన తండ్రికి ఎప్పటికీ చిన్నపాపే అన్నారు.

మీసేవ ప్రతినిధుల కోసం

ఈ-కామర్స్‌పై ఫ్లిప్‌కార్ట్ వర్క్‌షాప్

విశాలాంధ్ర - కరీంనగర్ : భారతదేశంలోని స్వదేశీ ఈ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి, మీసేవ ప్రతినిధులకు ఈ-కామర్స్ ద్వారా స్థానిక వ్యాపారాలకు మార్కెట్ అవకాశాలను సులభతరం చేయడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను సమకూర్చడం లక్ష్యంగా వర్క్‌షాప్‌ను నిర్వహించింది. తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ (ఐటీఈసీ) విభాగం, పరిశ్రమలు, వాణిజ్య విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఐఏఎస్, తెలంగాణ ప్రభుత్వ కమిషనర్, మీసేవ (ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ) రవికిరణ్ తిరుమల, ఐఎఫ్ఎస్, ఫ్లిప్‌కార్ట్ సీనియర్ మేనేజర్ డాక్టర్ దీపు థామస్ జాయ్ సమక్షంలో ఈ వర్క్‌షాప్ జరిగింది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ సిటిజన్ సర్వీసెస్ పోర్టల్ అయిన మీసేవ, ప్రభుత్వం నుండి పౌరులకు (జి 2సి), వ్యాపారం నుండి పౌరులకు (బి2సి) విస్తృత శ్రేణి సేవలను అందిస్తుంది. డిజిటల్ అవకాశాలు పెంపొందించడానికి కొనసాగుతున్న ప్రయత్నాలలో భాగంగా, తెలంగాణ ప్రభుత్వం మీసేవ ఆఫర్లలో ఈ-కామర్స్ సౌకర్యాన్ని చేర్చాలని భావిస్తోంది. ప్రతిపాదిత వర్క్‌షాప్ ఫ్లిప్‌కార్ట్ ప్లాట్‌ఫామ్‌లోకి వ్యాపారాలను ఆన్‌బోర్డింగ్ చేయడంలో వివిధ అంశాలను ప్రతినిధులకు పరిచయం చేస్తుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో సజావుగా ఏకీకరణను నిర్ధారిస్తుంది. ఈ వర్క్‌షాప్‌లో 800 మందికి పైగా మీసేవ ప్రతినిధులు, ఎంఎస్ఎంఈలు పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో రెసోనెన్స్ హైదరాబాద్‌కు దేశవ్యాప్త గుర్తింపు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : నీట్ 2025లో రెసోనెన్స్ హైదరాబాద్ మరోసారి తన విద్యా ప్రతిభను రుజువు చేసుకుంది. మా విద్యార్థులు దేశవ్యాప్తంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించి, భారత వైద్య రంగ భవిష్యత్తులో తమ స్థానం గుర్తింపజేశారు. హరిణి శ్రీరామ్ నీట్ 2025లో ఆల్ ఇండియా ర్యాంకు 72 సాధించింది. రెసోనెన్స్ హైదరాబాద్ క్యాంపసుల నుంచి ప్రతి ముగ్గురిలో ఒక విద్యార్థి మెడికల్ సీటు సాధించడం మాకు గర్వకారణం. రెసోనెన్స్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ 'మా విద్యార్థుల కష్టానికి, పట్టుదలకి మా హృదయపూర్వక శుభాకాంక్షలు. వారు చూపిన అంకితభావం, నిరంతర శ్రమే ఈ ఫలితాల వెనక ఉన్న నిజమైన శక్తి. ఈ నీట్ 2025 ఫలితాలు కేవలం ర్యాంకుల గణాంకాలు మాత్రమే కావు, రెండు సంవత్సరాలుగా విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు చేసిన కృషికి ఇది ఒక గౌరవ సూచకం. ఈ విజయం వారి తల్లిదండ్రులు, మెంటర్లు, ఫ్యాకల్టీ, రెసోనెన్స్ హైదరాబాద్ సమగ్ర సహకారానికి ప్రతిఫలం' అన్నారు. మేము ఎప్పుడూ విశ్వసించే విషయం ఏమిటంటే సరైన దిశలో, సరైన విధంగా శ్రమిస్తే విజయం తప్పక సాధ్యమే అన్నారు. ఈ ఫలితాలు మాకు మరింత ఉత్సాహాన్ని, కొత్త శక్తిని ఇస్తోందని, మేము మరింత మంది విద్యార్థుల కలలను నెరవేర్చేందుకు, వాళ్ల భవిష్యత్తును నిర్మించేందుకు ముందుకు సాగుతాం' అని అన్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదర్శనగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తం శరీరానికి ఇంధనం వంటిది అని అన్నారు. "ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జూన్ 14వ తేదీన ప్రపంచ రక్తదాతల కార్యక్రమాన్ని ఒక నినాదంతో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం నినాదం 'రక్తదానం చేయండి - ఆశను ఇవ్వండి - కలసి మనం ప్రాణాలను కాపాడుకుందాం'. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం స్వచ్ఛంద రక్తదానం పట్ల ప్రజలలో ఉన్న అపోహలను తొలగించి, రక్తదానం చేసేందుకు వారిని చైతన్య పరచడంతో పాటు రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేయడం" అని అన్నారు. సైన్స్ ఎంత అభివృద్ధి చెందినా రక్తం మానవ శరీరంలో మాత్రమే తయారవుతుంది. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్ధన్, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, రావు, ప్రేమ్ సింగ్, బసవరాజు, కుర్రా మహేష్, సుధాకర్, బోయిన మహేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రామారావు, బాలరాజు పాల్గొన్నారు.

చేగువేరా స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: సామ్రాజ్యవాదుల గుండెల్లో దడ పుట్టించిన విప్లవ ధృవతార చేగువేరా అని, ఆయన ఉద్యమ పోరాట స్ఫూర్తితో నేటి విద్య, ఉపాధి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులపై ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విద్యార్థి లోకానికి పిలుపు నిచ్చారు. శనివారం ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో చేగువేరా 97వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చేగువేరా చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు. అనంతరం పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ 1928 జూన్ 14న అర్జెంటీనాలో జన్మించిన చేగువేరా వైద్య, ఇంజనీరింగ్ విద్యలను అభ్యసించి ఆనాటి కాలంలో లాటిన్ అమెరికా సామ్రాజ్యవాదం ప్రజలపై చేస్తున్న దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన వీరుడన్నారు. చేగువేరా ఉద్యమ పోరాట పటిమకు భయపడిన అమెరికా సామ్రాజ్యవాదులు దొంగ దెబ్బతో 1967 అక్టోబర్ 9న చంపడం జరిగిందని, చనిపోయిన చేగువేరా మృతదేహం దగ్గరకు వెళ్లి చూడడానికి అమెరికా సైన్యానికి చెమటలు పట్టాయని, చనిపోయి కూడా అమెరికాను ఒకరోజు పాటు భయపెట్టాడని, అంతటి పోరాట చరిత్ర కలిగిన మహోన్నత వ్యక్తి చేగువేరా అని అన్నారు. ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, చిన్నబాబు, ఎండీ అన్వర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు హరీష్, అరవింద్, శశికుమార్, మహేష్, శ్రీహరి, సందీప్, తేజ, సాయి, వినోద్, వెంకట్, రాము పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థులు నడుం బిగించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలని, ఈ లక్ష్య సాధనకు విద్యార్థిలోకం కదలిరావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని, తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేసిన ఎమ్మెల్సీ కవిత... అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని అన్నారు. బీజేవైఎం నాయకుడు సాయినాథ్‌తో పాటు వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన నాయకులు, విద్యార్థులు శనివారం నాడు పెద్ద ఎత్తున తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి ఎమ్మెల్సీ కవిత తన నివాసంలో కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. తెలంగాణ జాగృతి విద్యార్థి సమాఖ్య నాయకులు పర్షిత్ పెద్దరాజుల, సందీప్ దాసోజు, రాధశ్రీ, వైష్ణవి, శంకర్ గౌడ్ నాయకత్వంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండిరగ్ లో ఉండగానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదని సూచించారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని తేల్చిచెప్పారు. రిజర్వేషన్లు కల్పించకుండా మోసం చేయాలని ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు.

బీసీలు ఏకం కావాల్సిన సమయం అసన్నమైంది

ఓబీసీ పోరుబాట పుస్తకావిష్కరణ సభలో టీపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేటి అధునిక పోటీ సమాజంలో బీసీల్లో ఐక్యత లోపించిందని టీపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. వివిధ రంగాల్లో బీసీలు ఎదగాలంటే బీసీలు ఏకం కావాల్సిన సమయం అసన్నమైందని అయన సూచించారు. పార్టీలకు అతీతంగా బీసీలు ఏకం కావాల్సన ఆవశ్యత ఎంతైన ఉందన్నారు. శనివారం ఓబీసీ పోరుబాట పుస్తకావిష్కరణలో టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ తదితరులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహేష్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రం కుల గణన పై తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంగా పేర్కొన్నారు. కుల గణనతో దేశానికి తెలంగాణ దిక్సూచిగా మారిందని అన్నారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ దేశంలోని వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోగలిగారని, అందుకే రాహుల్ గాంధీ ఆలోచనల్లో నుంచి పుట్టిందే కుల సర్వే అంటూ వ్యాఖ్యానించారు. చాలా వరకు బీసీలను ఓటు సాధనాలుగానే చూశారని కాని నేడు మా వాటా మాకు కావాలి అనే స్థాయికి బీసీలు ఎదిగారని అన్నారు. సమాజంలో ఎవరి వాట వారికే సిద్ధాంతానికి కట్టుబడి పారదర్శకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల సర్వే నిర్వహించిందన్నారు. కుల సర్వేను వ్యతిరేకించిన కేంద్రంలోని బీజేపీ సైతం జనగణనతో పాటు కుల గణన చేపడతామని ప్రకటించిందని గుర్తు చేశారు. ఖర్గే, రాహుల్ గాంధీ సమక్షంలో కుల సర్వేపై దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి 450 పైగా కాంగ్రెస్ ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడం జరిగిందని వివరించారు. కామారెడ్డి డిక్లరేషన్ అనుగునంగా బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లకు చట్ట బద్దత కల్పించామని అన్నారు. ఓసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ఆశయం మేరకు కుల సర్వేను శాస్త్రీయ బద్ధంగా నిర్వహించారని, గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేబినెట్ విస్తరణ.. 68 శాతం మేర పిసిసి కార్యవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టి,మైనారిటీలకు చోటు కల్పించామని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లుతో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని కల్పించగలదని నిరూపించుకుందన్నారు. బీసీ బిల్లుకు చట్ట రూపం కల్పించి రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు బీసీలందరు ఏకం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. కులాలకు అతీతంగా బీసీ బిల్లు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

టీడీపీ పాలనలో సంతోషంగా ఉన్న ప్రజలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : టిడిపి పాలనలో ప్రజలందరు పండగ వాతావరణంలో సంతోషంగా ఉన్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ తెలిపారు. శనివారం ఎన్‌టిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యకర్తలలో పండుగ వాతావరణం కనిపిస్తున్న దన్నారు. పథకాల అమలు జరుగుతుండటం కంటికి కనిపిస్తున్నా, సూపర్‌సిక్స్ ఏమీ అమలు కాలేదని, ఈ సంవత్సరంలో ఏ పనీ చేయలేదని వైసీపీ నాయకులు మాట్లాడ్డం విడ్డూరంగా ఉంద న్నారు. గురువారం నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని, రైతుల ఖాతాలలో కేంద్రం డబ్బులు వేసిన రోజే రాష్ట్ర ప్రభుత్వం కూడా వేయనుందని, ప్రతి నెలా జాబ్ మేళాను నిర్వహిస్తున్నా మన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ముఖ్యంగా నారా లోకేష్‌కి తల్లికి వందనం పథకం అమలు చేసినందుకు ప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. నారా లోకేష్ రాష్ట్రంలో ఉన్న పిల్లలు ఎవరూ పనికి పోకూడదని చదువుకుని వృద్ధిలోకి రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.10 వేల కోట్లు తల్లికివందనం పథకం కింద ఖర్చు చేస్తున్నామన్నారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా రూ.15 వేలలో రూ.2 వేలను తగ్గించి ఇచ్చారన్నారు. కానీ వారు ఎటువంటి స్కూల్ మెయింటనెన్స్‌కు ఈ నిధులను ఖర్చు చేయలేదని, కలెక్టర్‌లకు ఇస్తున్న ఈ రూ. 2 వేల నిధులపై వైసీపీ వారు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి రూ.2 వేలను తను తీసుకున్నారా? లోకేష్ వైసీపీ వారికి 24 గంటల సమయం ఇచ్చారని, ఈ సమయంలోపు వారు చేసిన ఆరోపణలను నిరూపించాలని, లేదా వారు పెట్టిన పోస్ట్‌ను తొలగించాలని, లేదంటే వారిపై కఠిన నిర్ణయం తీసుకుంటామని లోకేష్ చెప్పడం జరిగిందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక అటు సంక్షేమ పథకాల అమలులో, ఇటు అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. పరిశ్రమలు వస్తున్నాయని, గత ప్రభుత్వంలో ఆగిపోయిన ప్రాజెక్టులు ప్రారంభించబడ్డాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు తీసుకొస్తూ ముందుకెళ్తున్నామని, ఈ అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలు ఊరుకోరని, తల్లికివందనం పథకాన్ని అమలు చేసినందుకు చంద్రబాబుకి, పవన్ కళ్యాణ్‌కి, నారా లోకేష్‌కి మరొకసారి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఈమె తెలిపారు.

కేటీఆర్‌కు ధైర్యం ఉంటే కుటుంబానికి నార్కో టెస్ట్‌లు చేయించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిజంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ధైర్యం ఉంటే ముందుగా అయన కుటుంబ సభ్యులకు నార్కో టెస్ట్‌లు చేయించాలని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. సీఎం.రేవంత్‌రెడ్డి నార్కో టెస్టులకు సిద్ధం కావాలంటూ కేటీఆర్ విసిరిన సవాళ్లపై ఆది శ్రీనివాస్ స్పందిస్తూ ముందుగా కేటీఆర్ అయన తండ్రి కేసీఆర్, చెల్లి కవిత, బావ హరీష్‌తో నార్కో టెస్ట్‌లు చేయించాలని సూచించారు. అప్పుడు కాళేశ్వరంలో మీ కక్కుర్తి భయటపడుతుందన్నారు. లిక్కర్ స్కాంలో మీ చెల్లి కవితకు, ఫోన్ ట్యాపింగ్ కేసులో నీకు నార్కో టెస్ట్‌లు చేస్తే అసలు నిజాలు భయటపడతాయని మండిపడ్డారు. ఛాలెంజ్‌లు విసరడం పారిపోవడం కేటీఆర్‌కు అలవాటే అని, గతంలో డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో వైట్ ఛాలెంజ్‌కు రావాలని ప్రస్తుత సీఎం.రేవంత్‌రెడ్డి పిలిస్తే రాకుండా పారిపోయిన చరిత్ర కేటీఆర్‌కు ఉందని గుర్తు చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ నోటీసు ఇవ్వగానే కేటీఆర్ హడలిపోతున్నాడని, విచారణకు వెళ్తానని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తునే బడాయి కబుర్లు చెబుతున్నాడని విమర్శించారు. నిజంగా ఏసీబీ విచారణకు హజరై వాళ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తే సరిపోతుందని అన్నారు.

ఈ విషయంలో మా ముఖ్యమంత్రికి నార్కో ఎనాలసిస్ టెస్ట్ చేయాలంటు సంబంధం లేకుండా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. నార్కో ఎనాలసిస్ టెస్ట్ చేయాలా..? పాలిగ్రాఫ్ చేయాలా అన్నది కోర్టులు, విచారణ సంస్థలు నిర్ణయిస్తాయన్నారు. ఎవరి మీద కేసు ఉంటే వాళ్లు విచారణకు హాజరవుతారు తప్ప ఇంకొకరు వచ్చి నార్కో ఎనాలసిస్ టెస్ట్‌లు చేసుకోరని సూచించారు. సంక్షేమం, అభివృద్ధితో మా ప్రభుత్వం ముందుకు పోతుంటే కేటీఆర్ పిచ్చి ప్రేలాపనలు, రోత మాటలు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. కేటీఆర్ మాటలు ఆపకపోతే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సహించరని, నీ అతి తెలివి ప్రదర్శన ఆపి ఏసీబీ అధికారుల ముందుకు వచ్చి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు అంటూ హితువు పలికారు. చట్టం ముందు అందరూ సమానమే అని.. కేటీఆర్ నీ బడాయి మాటలు ఆపి దర్యాప్తు సంస్థలకు సహకరించాలన్నారు.

లోక్ అదాలత్‌లో 152 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - అమనగల్లు : కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజ మార్గాన్ని అనుసరించాలని జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప సూచించారు. శనివారం అమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇద్దరు కొట్టుకుంటే ఒక్కరే గెలుస్తారు. రాజీ పడితే ఇద్దరు గెలుస్తారు అనే నినాదంతో నిర్వహించిన మెగా లోక్‌అదాలత్ విజయవంతమైంది. పోలీస్ స్టేషన్లలో నమోదై, రాజీకి వీలున్న కేసులను, జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా ఆమనగల్లు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో 152 కేసులు పరిష్కారం అయ్యాయి. అందులో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన కేసులు పరిష్కారం, గవర్నమెంట్ జరిమానా రూపంలో 4,00,400 ముట్టయాన్నారు. ఈ సందర్భంగా జడ్జి స్వరూప మాట్లాడుతూ, చిన్న పొరపాటు, క్షణికావేశం కారణంగా గొడవలు, మనస్పర్ధలు పెట్టుకొని కేసులు దాకా వెళ్ళి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా , ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నార న్నారు. చిన్న చిన్న నేరాలు, దొంగతనాలు, చేసినవారు తమ తప్పు తెలుసుకునేలోగా ఏళ్ల తరబడి కాలయాపన జరిగిపోతుందన్నారు. భార్య భర్తలు, కుటుంబ సభ్యులు, బంధువులు తమ చుట్టూ తిరుగుతున్నారని వీటిని పెద్దల సమక్షంలో రాజీ చేసుకోవాలని కోరారు. రాజీ మార్గమే రాజ మార్గమని చిన్న చిన్న తగాదాలకు కోర్టులను ఆశ్రయించిన వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని రాజీ పడి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రోడ్ పనులను వెంటనే ప్రారంభించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : చందా నగర్ డివిజన్, శ్రీదేవి థియేటర్ నుండి అమీన్పూర్ బంధంకొమ్ము వరకు కలిపే కనెక్టివిటీ రోడ్ 2018లో శంకు స్థాపన చేసి దాదాపు 7 సంవత్సరాలు కావొస్తున్న పనులు ప్రారంభించక పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చుట్టుప్రక్కల కాలనీ వాసులు తెలియజేసిన నేపథ్యంలో రోడ్ పనులు తక్షణమే ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి అధ్యక్షతన, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు, బీజేపీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీదేవి థియేటర్ నుండి అమీన్‌పూర్ వరకు రోడ్ 15 జులై 2018లో 4 కోట్ల మంజూరు అయ్యి శంకుస్థాపన చేశారనీ, దాదాపు 7 సంవత్సరాలు కావొస్తున్న పనులు ప్రారంభించడం చేతగాని ఎమ్మెల్యే అని ఎద్దేవా చేశారు. గతంలో పంచాయతీ ఉన్న సమయంలోనే ముంబై - నాగపూర్ హైవే కొరకు 150 ఫీట్ రేడియల్ రోడ్ ప్రపోజల్ ఉన్న రహదారి అని తెలియజేశారు. తక్షణమే రోడ్ పనులు ప్రారంభించి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, లేని పక్షంలో రాస్తారోకోలు, ధర్నాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మన ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్‌రావుతో మాట్లాడి వారితో కలసి పర్యటించి వీలైనంత త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రవీందర్రావు, రాఘవేంద్రరావు, నాగులు గౌడ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, రాధాకృష్ణ యాదవ్, డాక్టర్ వంశీ, సింధూ రెడ్డి, చారి ,జితేందర్, రాజు శెట్టి, పద్మ, వినయ, ప్రవంతి, మొదలగు వారు పాల్గొన్నారు.

మహిళా దక్షత సమితి విద్యాసంస్థల్లో బీబీఏ కోర్సు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : కెరీర్ ఆధారిత విద్యతో యువతులను సాధికార పరచడంలో గణనీయమైన ముందడుగులో, సుమన్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, విడి బజాజ్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, మహిళా దక్షత సమితి, బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లతో కూడిన మహిళా దక్షత సమితి విద్యా సంస్థలు శనివారం హైదరాబాద్‌లోని చందానగర్‌లోని గంగారంలో తమ బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) కోర్సును ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో మహిళా విద్యను అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి కట్టుబడి ఉన్న ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు, సమాజ నాయకులు ఉత్సాహంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా డాక్టర్ వి.ఎస్. అళగు వర్షిణి, మనీషా సబూ, పల్లవి కటియార్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ మహిళా దక్షత సమితి బ్యానర్ కింద ఉన్న జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాల, వృత్తి శిక్షణా కేంద్రం వంటి వివిధ కళాశాలల గురించి అంతర్దృష్టితో కూడిన పరిచయం చేశారు. "ఈ కోర్సు మా విద్యార్థులకు కొత్త మార్గాలను తెరుస్తుంది, జ్ఞానం, నైపుణ్యాలు, సమగ్రతతో కార్పొరేట్ ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి వారిని సిద్ధం చేస్తుంది" అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ప్రథమ మహిళ శ్రీమతి సుధా దేవ్ జీ వర్మ హృదయపూర్వకమైన, స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేస్తూ, తన మాటలతో విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యావేత్తలను ఆకర్షించారు. విభిన్న నేపథ్యాల నుండి వచ్చిన బాలికలను పెంపొందించడం సురక్షితమైన అభ్యాస వాతావరణం ద్వారా సాధికారపరచడంలో మహిళా దక్షత సమితి అచంచలమైన అంకితభావాన్ని ప్రశంసిస్తూ ఆమె ప్రారంభించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

విశాలాంధ్ర - తుర్కయాంజల్ : బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారి వివరాలను, స్వచ్ఛ ఆటోలకి చెత్తను ఇవ్వని వారి వివరాలను సేకరించి వారికి పలుమార్లు సిబ్బంది ద్వారా హెచ్చరించి, జరిమానా విధించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి అన్నారు. పురపాలక సంఘాన్ని స్వచ్ఛ తుర్కయాంజల్‌గా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపైన ఉందని పుర ప్రజలందరూ తడి పొడి హానికర చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకి మాత్రమే ఇవ్వాలని స్వచ్ఛ ఆటోలు రానిచో మా దృష్టికి తీసుకురావలెను ఎవరు కూడా బహిరంగంగా చెత్తను వేయరాదని, పలు కాలనీలో తడి పొడి హానికర చెత్తను గురుంచి వివరించి వేరు చేయాల్సిన ఆవశ్యకతను గురుంచి ప్రజలకు వివరించారు. పలు దుకాణ సముదాయాలను తనిఖీలు చేసి ట్రేడ్ లైసెన్స్ వివరాలను తీసుకోవడం జరుగుతుందని, పురపాలక పరిధిలో ఇప్పటివరకు అన్ని వార్డుల్లో ప్రతి రోజు 100 రోజుల కార్యక్రమానికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో శానిటరీ జవాన్‌లు అందరూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుద్ధ్య పనులను చేపడుతూ ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే నోడల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి...

విశాలాంధ్ర - మొయినాబాద్ : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల్లో పోటీ చేసి సమాజాభివృద్ధికి పాటుపడాలని మొయినాబాద్ మండల బీజేవైఎం నాయకుడు విజయగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ నేడు రాజకీయాలు భ్రష్టుపట్టాయని అభివృద్ధి పట్ల ఎవరూ కూడా ఆలోచన చేయడం లేదని ఆరోపించారు. మొత్తం కల్తీ రాజకీయాలు తయారయ్యాయని పుటకో పార్టీలు మారుతూ ప్రజల విశ్వాసాలను నిలబెట్టుకోవడం లేదని అన్నారు. అందుకే యువత రాజకీయాల్లోకి వచ్చి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మున్సిపాల్ ఎన్నికల్లో పోటీ చేసి అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అలాగే బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కూడా పనిచేయాలని చెప్పారు. దేశాభివృద్ధికి యువతే కీలకమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాజకీయాల్లోకి రావాలని మరోసారి విజయగౌడ్ పిలుపునిచ్చారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ నూతన ఈఓగా మహేందర్ గౌడ్

విశాలాంధ్ర - జుబిలీహిల్స్ : బల్కంపేట్ శ్రీ రేణుక ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం నూతనంగా ఈవోగా బాధ్యతలు చేపట్టిన మహేందర్ గౌడ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన అమీర్‌పేట్ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ పాలక మండలి సభ్యులు ఎం.హనుమంతరావు ఇంకా వనం శ్రీనివాస్, పోతరాజు కుమార్, రణధీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

విశాలాంధ్ర-దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ కాకతీయ నగర్‌లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గండిమైసమ్మ - బాచుపల్లి ప్రధాన రహదారిలో డాక్టర్ రెడ్డీస్ వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా కాలనీలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్డు పనులు, పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోజు రోజుకు వెలుస్తున్న కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పరుస్తున్నామని, రానున్న రోజుల్లో కాకతీయనగర్ కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తానని తెలిపారు. ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, మేనేజర్ పవన్, డీఈ వసంత, మేనేజర్ జై రాజ్, శానిటేషన్ ఇంచార్జ్ సుకృత రెడ్డి, విద్యుత్ ఏఈ శశిదర్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పైడి మాధవి, బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాత, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబ శివరెడ్డి, స్వామి, అనిల్, సతీష్ రెడ్డి, ప్రదీప్, బొబ్బ శ్రీనూ, బిక్షపతి, మేకల మధుసూదన్, దుసకంటి వెంకటేష్, విద్య సాగర్, జలగం చంద్రయ్య, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, కాకతీయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షుకు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి వినోద్, కోశాధికారి దశరథ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళులు



విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసఫ్‌గూడ డివిజన్‌లోని లక్ష్మి నర్సింహానగర్‌లో శనివారం జూబ్లీహిల్స్ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ చిత్రపటానికి పూలమాల వేసి యూసుఫ్ గూడా కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ నివాళిలు అర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ యాదవ్ ఇంకా టిఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించారు.

మీకు మేమున్నాం...

- 'నరేలా' నిర్వాసితులకు సీపీఐ భరోసా
- బాధితుల్ని కలిసిన రాజా

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని మద్రాసీ క్యాంపు (జంగ్‌పుర) నిర్వాసితులకు సీపీఐ ఎల్లప్పుడు తోడు-నీడగా నిలుస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా భరోసానిచ్చారు. 'మీకు మేమున్నాం. మీ సమస్యల పరిష్కారానికి మీ పక్షాన పోరాడతాం. సీపీఐ ఎప్పుడు అండగా నిలుస్తుంది' అని బాధితులకు ఆయన హామీనిచ్చారు. సీపీఐ ఢిల్లీ కార్యదర్శి దినేశ్ వర్షిణి, కార్యదర్శివర్గ సభ్యులు శంకర్ లాల్, సంజీవ్ కుమార్, సమితి సభ్యులు బబ్బన్ కుమార్ సింగ్‌తో కలిసి రాజా శనివారం నరేలా నుంచి పాకెట్ జీ7కు తరలించబడ్డ వారిని కలిశారు. వారి పరిస్థితులపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య తారునీరు లేదని, ఉప్పు నీరు సరఫరా అవుతున్నదని, బకెట్ నీళ్ల కోసం రూ.10 చొప్పున చెల్లించాల్సిన పరిస్థితి ఉందని నిర్వాసితులు మొరపెట్టుకున్నారు. చాలా ఇళ్లకు విద్యుత్ సరఫరా లేదని, రవాణా సౌకర్యం కూడా లేదని చెప్పారు. ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు రోజువారీ ప్రయాణాలు కష్టసాధ్యంగా మారాయన్నారు. పిల్లల చదువులకు విఘాతం కలిగిందని, కనీసం ఆరోగ్య కేంద్రాలు లేవని, రేషన్ లేక నిత్యావసరాల దుకాణాలు వంటివి లేవంటూ వారు తమ కష్టాలను సీపీఐ నేతలతో పంచుకున్నారు. రాజా స్పందిస్తూ ప్రతి స్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై మీ పక్షాన పోరాడేందుకు సీపీఐ సిద్ధమన్నారు. అన్ని సమస్యల పరిష్కారంలో సీపీఐ అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. సీఎం రేఖా గుప్తా దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి, సత్వరమే పరిష్కరించాలని కోరుతామన్నారు. ఇక్కడ పునరావసం ఒక్కటే కాదు ఆత్మగౌరవం, న్యాయం కూడా సమస్యలేనని రాజా ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి మానవుడి ప్రాథమిక హక్కుల్లో జీవిక హక్కు ఉందని, దానిని హరించే ప్రయత్నం ఆక్షేపణీయమని, బాధితులకు సీపీఐ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని రాజా అన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ నేత కృష్ణ మోదీకి అరుణాంజలి

సీపీఐ మధ్యప్రదేశ్ సీనియర్ నేత కృష్ణ మోహన్ మృతికి పార్టీ సంతాపం ప్రకటించింది. తన జీవితాన్ని కమ్యూనిస్టు ఉద్యమానికి, శ్రామికుల పక్షాన పోరాటాలకు అంకితమిచ్చిన నాయకుడిని కోల్పోయామని ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 12 ఏళ్ల చిరు ప్రాయంలో స్వాతంత్ర్య సమరంలో భాగస్వాములైన కృష్ణ మోదీ ఆదర్శనీయుడని శ్లాఘించింది. బాలాఘాట్, బరాసివ్నీలో 1930లో కృష్ణ మోదీ జన్మించారు. బొగ్గు గని కార్మికుల ఉద్యమాలకు ప్రతీకగా నిలిచారు. ఐక్య గని కార్మికుల సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఏఐటీయూసీ సీనియర్ జాతీయ ఉపాధ్యక్షుడిగానూ పనిచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా దీర్ఘకాలం ఉన్నారు. కృష్ణ మోదీ మరణంతో ఒక శకం ముగిసిందంటూ సీపీఐ మధ్యప్రదేశ్ సంతాపం తెలిపింది. ఆయనకు గౌరవ సూచికంగా రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండాను అవనతం చేసి... అరుణాంజలి ఘటించారు.

పలస్తీనాపై ఐరాసలో ఓటింగ్‌కు భారత్ దూరం: సీపీఐ ఖండన

న్యూఢిల్లీ: గాజాలో ఇజ్రాయిల్ మారణ హోమానికి వ్యతిరేకంగా ఐక్య రాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో జరిపిన ఓటింగ్‌లో భారత్ పాల్గొనలేదు. దీనిని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఇది కేంద్రప్రభుత్వ దౌత్యపరమైన యుక్తికే కాదు నైతిక వైఫల్యానికి కూడా నిదర్శనమని వ్యాఖ్యానించింది. ఆర్ఎస్ఎస్-బీజేపీ అనుసరించే హిందూత్వ, జాతీయవాద ఉద్యమం (జియోనిజం) మధ్య సైద్ధాంతిక అనుబంధానికి ఈ చర్య అద్దం పట్టిందని దుయ్యబట్టింది. న్యాయం, అతీనోద్యమం విలువలు... అణగారిన వర్గాలకు సంఘీభావం తెలిపే భారత చారిత్రక విదేశీ విధానానికి మోసమని వ్యాఖ్యానించింది. మహిళలు, పిల్లలు సహా పలస్తీనియన్లను ఇజ్రాయిల్ ఊచకోత కోస్తుండటానికి యావత్ ప్రపంచం సాక్షిగా నిలుస్తున్న వేళ... సంబంధిత తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉండటం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఈ ప్రవర్తన అంతర్జాతీయ చట్టాలకు, మానవాళికి విరుద్ధమని తెలిపింది. పలస్తీనా ప్రజలకు తమ సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. భారత ప్రభుత్వం తక్షణమే ఇజ్రాయిల్ అనుకూల వైఖరిని విడనాడాలని సూచించింది. గాజాలో శాంతి, న్యాయం కోసం అంతర్జాతీయ పిలుపుకు కట్టుబడాలని సీపీఐ డిమాండ్ చేసింది.

19న శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర



న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు సంబంధించిన కొత్త తేదీ ఖరారైంది. సాంకేతిక సమస్యలతో రోదసియాత్ర పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కొత్త తేదీని ప్రకటించింది. యాక్సియం-4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు జూన్ 19న రోదసియాత్రకు బయలుదేరనున్నట్లు ఇస్రో తెలిపింది. ఈనెల 11న ప్రయోగానికి ముందు రాకెట్‌లో లిక్విడ్ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ సమస్యను విజయవంతంగా పరిష్కరించామని ఇస్రో వెల్లడించింది. దీంతో కొత్త ప్రయోగ తేదీని ప్రకటించింది. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్‌ను నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ) ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్-9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సి ఉంది. అయితే, వాతావరణం అనుకూలించకపోవడం, సాంకేతిక సమస్య తలెత్తడం వంటి కారణాలతో రెండుసార్లు వాయిదా పడుతూ వచ్చింది. భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత ఈ వ్యోమనౌక... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)తో అనుసంధానమవుతుంది. శుభాంశు బృందం అక్కడే 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో ముచ్చటిస్తారు.

ఎన్ఏసీ ఏపీకి జాతీయ అవార్డు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ ఏపీ) ఆంధ్రప్రదేశ్‌కి జాతీయస్థాయి అవార్డు లభించింది. ఇన్‌ఫ్రాకాన్ జాతీయ అవార్డ్స్ (ఐఐఎన్ఏ) 2025లో భాగంగా నిర్మాణ రంగంలో ఉత్తమ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం విభాగంలో గోల్డ్ అవార్డు సాధించింది. ఈ అవార్డును ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ (ఐఎస్‌డీఏ) అధ్వర్యంలో నిర్వహించారు. ఈ పురస్కార ప్రదానోత్సవం న్యూఢిల్లీలో శనివారం జరిగింది. కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా చేతుల మీదుగా ఎన్ఏసీ ఏపీ అదనపు డైరెక్టర్ జనరల్ కె.దినేశ్ కుమార్ ఈ పురస్కారం అందుకున్నారు. నిర్మాణ రంగంలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఎన్ఏసీ ఏపీ అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

చత్తీస్‌గఢ్ బీజేపీ ఆఫీసు, కవాసి లక్ష్మా, హరీశ్ ఆస్తుల అటాచ్

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ కార్యాలయం, మాజీ మంత్రి కవాసి లక్ష్మా, ఆయన కుమారుడి హరీశ్ లక్ష్మా ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. గత ప్రభుత్వంలో జరిగిన రూ.2,100 కోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించి ఈ మేరకు చర్యలు తీసుకుంది. చత్తీస్‌గఢ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పేరు మీద ఉన్న సుక్మా జిల్లాలోని కాంగ్రెస్ భవన్ సహా కవాసి లక్ష్మా, హరీశ్ లక్ష్మా పేరిట రాయ్‌పూర్, సుక్మాలోని రెండు ఇళ్లు కలిపి రూ.6.15 కోట్లు విలువ చేసే ఆస్తులను అటాచ్ చేసేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఉత్తర్వులు జారీ అయ్యాయి. మనీలాండరింగ్ చట్టం కింద రాజకీయ పార్టీకి సంబంధించిన ఆస్తులను దర్యాప్తు సంస్థ అటాచ్ చేయడం ఇదే మొదటిసారి. తాజా పరిణామాన్ని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఖండించారు. ఇది బీజేపీ రాజకీయ కుట్రలో భాగమన్నారు. సుక్మా కార్యాలయాన్ని కట్టేందుకు వాడిన ప్రతి పైసా లెక్క చూపిస్తామని చెప్పారు. కవాసి లక్ష్మా (72) కాంతా అసెంబ్లీ స్థానం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్సైజ్ మంత్రిగా పనిచేశారు. ఆయన తనయుడు సుక్మా పంచాయత్ అధ్యక్షుడు. కాగా, 2024, డిసెంబరులో రాయ్‌పూర్, సుక్మా, ధాంతరి జిల్లాలోని లక్ష్మా కుటుంబ ఆస్తులను ఈడీ సోదా చేసింది. జనవరిలో కవాసి లక్ష్మాను అరెస్టు చేయగా, ఆయన ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. కవాసి లక్ష్మా నెలకు రూ.2 కోట్లు లెక్కన 36 నెలల్లో రూ.72 కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పని గంటల పెంపునకు వ్యతిరేకంగా 20న జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు

ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల, కార్మికుల పని గంటల పెంపును రాష్ట్ర స్థాయి ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్య వేదిక తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల సమావేశం విజయవాడలోని ఎంబీ భవన్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఈనెల 20న జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని ఉద్యోగ, కార్మికులకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు ఇక నుంచి 10 గంటల పని చేయాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసి జీవో జారీ చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్ర స్థాయి కార్మిక సంఘాలతో ఆ అంశాలపై చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు చేయడం సరైనది కాదని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల పోరాటాల ఫలితంగానే 8 గంటల పని విధానం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. 8 గంటల పని విధానం అనేది శాస్త్రీయ ఆలోచన విధానమని, ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బడా కార్పొరేట్ సేవల్లో తలమునకలైన రాష్ట్ర ప్రభుత్వం... కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దోచి పెట్టేందుకు, వారికి లాభాలు అర్జించి పెట్టేందుకే 10 గంటల పని విధాన నిర్ణయమని విమర్శించారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అదనపు గంటలు కూడా పని చేయవచ్చని, మహిళలు కూడా రాత్రుళ్లు డ్యూటీ చేయవచ్చని నిర్ణయాలు చేయడమంటే కార్మికులను వెట్టి చాకిరి చేయించుకునే విధానానికి నెట్టివేయటమేనన్నారు. మళ్లీ బానిస వ్యవస్థకు కార్మికులను తీసుకుపోతారా అని ప్రశ్నించారు. పగలే మహిళలకు రక్షణ లేకుండా పోతుంటే, అర్ధరాత్రి చీకటిలో ఇక రక్షణ ఉంటుందా అని నిలదీశారు. ఏడాది గడిచిన తర్వాత సూపర్ సిక్స్‌లో ఒకటైన తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతోందని విమర్శించారు. వాస్తవానికి అర్హులందరికీ అందలేదన్నారు. రూ.12 వేల ఆదాయం పరిమితి పెట్టి, దిగువ ఆదాయం కలిగిన వారికి ఇచ్చామంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ సర్వే లోపభోయిష్టంగా ఉందని, రూ.12 వేల ఆదాయం ఏపాటిదని, మరలా సర్వే చేసి అర్హులందరికీ తల్లికి వందనం పథకం అందజేయాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీవో వలన ఉద్యోగులు, కార్మికులకు అభద్రతా భావం పెరిగిపోతోందని అన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం స్వాగతించవలసిన పథకమే అయినప్పటికీ ఆటో కార్మికులకు జీవనోపాధి సమస్య ఏర్పడుతుందన్నారు. వారిని కూడా అన్ని విధాలా ఆదుకోవాలని సూచించారు. శ్రామిక మహిళా నాయకురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశ, అంగన్‌వాడీ పథకం వర్కర్లకు శ్రమకు తగ్గ వేతనం లభించటం లేదన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, వైఎస్ఆర్ టీయూ జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్ రవి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, నగర నాయకులు నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రినాథ్, ఇఫ్టూ నాయకులు ఖాజవలి తదితరులు పాల్గొన్నారు.

అభిమానిపై కమల్ హాసన్ ఆగ్రహం

చెన్నై: బహుభాషా నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్ హాసన్ పార్టీ అభిమానిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము బహూకరించిన కత్తిని పైకెత్తాలంటూ ఒత్తిడి చేయడంతో ఆయన సహనం కోల్పోయారు. దీనికి సంబంధించి వీడియో వైరల్‌గా మారింది. డీఎంకే కూటమి తరపున కమల్‌హాసన్ తమిళనాడు నుంచి రాజ్యసభకు ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చెన్నైలో కమల్ తన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొందరు అభిమానులు ఆయనకు ఖడ్గాన్ని బహూకరించారు.

అవినీతిని ఉపేక్షించం

- ఆరోపణలపై సత్వర విచారణ
- నేరం రుజువైతే తక్షణమే చర్యలు
- ఐవీఆర్ఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అవినీతిని ఏ స్థాయిలోనూ సహించేది లేదని, అవినీతి రహిత పాలనా వ్యవస్థ నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అవినీతి రుజువైతే తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై వచ్చిన అభిప్రాయాలను శనివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైనట్టు ఐవీఆర్ఎస్, సీఎస్‌డీఎస్ ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైందని అధికారులు ఆయనకు చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణపై టెక్నికల్ ఆడిటింగ్ జరపాలని, సమస్యలు ఉన్న చోట దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. సంక్షేమం, ఉద్యోగాల కల్పన, రహదారులు వంటి 10 ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతివ్వాలన్నారు. ఇంటి నుంచి పని విధానం, పెట్టుబడుల రాక, నైపుణ్య శిక్షణతో ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయో తెలపాలని అన్నారు. 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు, ఆగస్ట్ 15 కల్లా అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర కింద అందించాలని స్పష్టం చేశారు. వికలాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి ఇవ్వడంలో మెరుగుదల ఉండాలన్నారు. చౌకధరల దుకాణాలు పెంచడం, నగదు/కూపన్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలపై ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఉచిత ఇసుక విధానం అమలుపై ఆరా తీశారు. ఇసుక లేని చోట్ల సంతృప్తి, ఇసుక ఉన్న చోట అసంతృప్తి ఉండటంపై ప్రాంతాల వారీ అధ్యయనం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రజాభిప్రాయం ఇలా...

- **పింఛన్ల పింపిణీ:** అవినీతి లేదని 85 శాతం మంది, ఇంటి దగ్గరే అందుతున్నాయని 87.8 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బాగున్నదని 83.9 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎస్‌డీఎస్ ఫీల్డ్ సర్వేలో లబ్దిదారులను నేరుగా కలిసి ప్రశ్నించగా...పింఛన్ల పింపిణీలో అవినీతి లేదని 93.9 శాతం మంది, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 93.3 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బాగున్నదని 73.3 శాతం మంది, పర్వాలేదని 23.1 శాతం మంది చెప్పారు.
- **అన్న క్యాంటీన్లు:** పరిశుభ్రంగా ఉన్నాయని 80.5 శాతం, ఆహారం నాణ్యత బాగుందని 79.3 శాతం, సమయపాలన పాటిస్తున్నారని 80.8 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా వెల్లడించారు.
- **ఆస్పత్రి సేవలు:** క్వాలిటీ చెకప్‌పై 68.4 శాతం, రక్త పరీక్షలపై 55 శాతం, ఉచిత మందుల పంపిణీపై 65.5 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 71.3 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.
- **మున్సిపల్ సేవలు:** రోజూ చెత్త సేకరణపై 68.1 శాతం, 24 గంటల్లో చెత్త డంప్ తరలింపుపై 57 శాతం సంతృప్తి చెందారు.
- **ఆలయాలు:** 68 శాతం మంది దర్శనం బాగుందని, 63.6 శాతం సౌకర్యాలు బాగున్నాయని, 77.7 శాతం మంది ప్రసాదం నాణ్యత బాగున్నట్లు చెప్పారు.
- **ఏపీఎస్ఆర్టీసీ:** శుభ్రత, సీటింగ్ విషయంలో 53.4 శాతం మంది, నీటి సౌకర్యం 45.2 శాతం మంది, టాయిలెట్స్‌పై 56 శాతం మంది, బస్సు సమయం-రూట్ వివరాలపై 61.5 శాతం మంది, బస్సులు సమయానికి బయల్దేరుతున్నాయని 69 శాతం మంది, సమయానికి గమ్యస్థానాలకు చేరుతున్నట్లు 69.7 శాతం మంది, సిబ్బంది ప్రవర్తన బాగుందని 72.4 శాతం మంది, రక్షణ ఉంటోందని 69.7 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- **దీపం-2:** అదనంగా వసూళ్లు లేవని 62.8 శాతం చెప్పారు.
- **రేషన్:** రేషన్ సరుకులు తీసుకుంటున్నామని 75.1 శాతం, నాణ్యత బాగుందని 73.8 శాతం మంది తెలిపారు.
- **ఎరువులు:** లభ్యతపై 60.9 శాతం మంది రైతులు సంతృప్తి వ్యక్తంచేశారు.
- **విత్తనాలు:** సమయానికి విత్తనాల సరఫరా జరిగిందని 63 శాతం మంది చెప్పారు.
- **డ్రగ్స్:** డ్రగ్స్ సమస్య ఉందని 27.4 శాతం, పోలీసులు స్పందిస్తున్నారని 54.5 శాతం మంది చెప్పారు.
- **మహిళలపై హింస:** బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు ఉన్నాయని 27.8 శాతం మంది, పోలీసుల స్పందన బాగుందని 59.5 శాతం మంది, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని 56.3 శాతం మంది వెల్లడించారు.
- **రిజిస్ట్రేషన్ సేవలు:** స్లాట్ బుకింగ్ ప్రక్రియపై 63.4 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, అవినీతి లేదని 62.3 శాతం మంది చెప్పారు.
- **ఇసుక:** రిజిస్ట్రేషన్ విధానంపై 70.6 శాతం, లభ్యతపై 67.5 శాతం, ధర పైన 61.1 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.
- **రెవెన్యూ సేవలు:** ఎఫ్ లైన్‌పై ఎక్కువ వసూళ్లు చేయలేదని 77.4 శాతం, పాస్‌బుక్ సర్వేలో ఎక్కువ తీసుకోలేదని 75.1 శాతం చెప్పారు.
- **విద్యుత్:** నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉందని 61.6 శాతం మంది తెలిపారు.
- **పంచాయతీ సేవలు:** ఇంటింటి చెత్త సేకరణపై 56.7 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేశారు.
- **ఎన్టీఆర్ వైద్య సేవ:** అడ్మిషన్లపై 86.2 శాతం, సేవలపై 81.3 శాతం, ఆరోగ్య మిత్ర సాయంపై 82.4 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా, అవినీతి లేదని 78.5 శాతం మంది చెప్పారు.

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా

- సెంచరీతో చెలరేగిన మార్‌క్రమ్
- 27 ఏళ్ల తర్వాత సఫారీ చేతికి ట్రోఫీ

లార్డ్స్: దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బవుమా సేన విజేతగా నిలిచింది. 213/2 స్కోరుతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన సఫారీ జట్టు మరో మూడు వికెట్లు కోల్పోయి 83.4 ఓవర్లలో 285 పరుగులు చేసింది. ఐడెన్ మార్‌క్రమ్ (136) అద్భుత శతకం సాధించాడు. విజయానికి 6 పరుగుల దూరంలో ఉండగా హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ చక్కటి డైవింగ్ క్యాచ్ అందుకోవడంతో అయిదో వికెట్‌గా వెనుదిరిగాడు. అప్పటికే విజయం ఖాయం కావడంతో తర్వాత వచ్చిన బ్యాటర్ పని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు 212 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టు 138 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ జట్టు 207 పరుగులు చేసింది. 282 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ జట్టు అనూహ్యంగా పుంజుకుంది. బౌలర్లకు సహకరించిన పిచ్‌పై ఐడెన్ మార్‌క్రమ్, తెంబా బవుమా (66) పోరాట పటిమ ప్రదర్శించారు. బవుమా ఔటైనా... మార్‌క్రమ్ దాదాపు చివరి వరకు క్రీజులో ఉండి దక్షిణాఫ్రికా జట్టుకు చిరస్మరణీయమైన విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. 5 వికెట్ల తేడాతో లంచ్ బ్రేక్‌కు ముందే మ్యాచ్‌ను గెలిచి... వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌ను దక్షిణాఫ్రికా జట్టు కైవసం చేసుకుంది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన ఐడెన్ మార్‌క్రమ్ 'ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్'గా నిలిచాడు. చివరిసారిగా 1998లో ఛాంపియన్స్ ట్రోఫీని సఫారీ జట్టు గెలుచుకుంది. 27 ఏళ్ల తర్వాత మరోసారి ఐసీసీ టైటిల్ నెగ్గింది. ఫైనల్స్‌లో ఒత్తిడికి గురై ఓడిపోతుందని తన మీద ఉన్న అపవాదును దక్షిణాఫ్రికా జట్టు ఈ విజయంతో తొలగించుకుంది.

ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధంతో పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు

న్యూఢిల్లీ: ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల మధ్య భీకర యుద్ధం నడుస్తోంది. రెండు దేశాలు క్షిపణలు, డ్రోన్లతో దాడులు చేసుకుంటున్నాయి. నిన్న ఇరాన్‌పై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. ఇందుకు ప్రతిగా ఇరాన్ సైతం ఇజ్రాయిల్‌పై దాడులకు దిగింది. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. సాధారణం కంటే 10 శాతం ఎక్కువయ్యాయి. ముడి చమురు ధరలు ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి పెరగటం జనవరి నుంచి ఇదే మొదటిసారి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 74.23 డాలర్ల దగ్గర ట్రేడ్ అయింది. రానున్న రోజుల్లో ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదే కొనసాగితే బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 80 నుంచి 100 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉంది. ముడిచమురు ధరలు పెరిగితే... ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి దేశీయ ఇంధన విక్రయ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ముడిచమురు ధర ఒక డాలర్ పెరిగితే... మన ఇంధన కంపెనీల లాభానికి 200-300 కోట్ల రూపాయల వరకు గండి పడుతుందని అంచనా. ముడిచమురు ధర 80 డాలర్లు దాటి మరింత ఎగబాకితే దేశీయంగా ఇంధన కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే అవకాశం కనిపిస్తోంది. దాంతో వాహనదారులపై భారం పెరగడంతో పాటు సరుకు రవాణా వ్యయం పెరుగుతుంది. మార్కెట్లో నిత్యావసరాల ధరలు ఎగబాకే ప్రమాదం ఉంది. ద్రవ్యోల్బణం పెరిగితే ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు ప్రక్రియకూ అడ్డుకట్ట పడుతుంది.

కామాంధుడికి 20 ఏళ్ల జైలు

థానే: ఆరేళ్ల పాపపై 2022లో అత్యాచారానికి పాల్పడిన కామాంధుడికి మహారాష్ట్ర, థానే జిల్లా కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అతనికి రూ.10వేల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పోక్సో చట్టం కింద అన్వర్ బాబును దోషిగా తేల్చి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి డీఎస్ దేశ్‌ముఖ్ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఇరుగు-పొరుగులో ఆడుకుంటున్న పాపను పిలిచి, తన ఇంటికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారానికి దోషి పాల్పడినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంధ్యా హెచ్ మాత్రే తెలిపారు. బాధితురాలి వైద్య నివేదికలు, ప్రాసిక్యూషన్ సాక్షులు, ఇరుగు-పొరుగు వారి వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం అతనిని దోషిగా తేల్చి, శిక్ష విధించిందన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐఏఎస్ శిక్షణా శిబిరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖచే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు - 2026 కొరకు తెలంగాణ రాష్ట్ర ఎస్.టి., ఎస్.సి., బి.సి. అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన తెలంగాణా రాష్ట్ర ఎస్.టి., ఎస్.సి., బి.సి. అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుచున్నవి. అభ్యర్థులు ఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడుతారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించరాదు. అభ్యర్థులు http://studycircle.cgg.gov.in లో లాగిన్ అయ్యి తేది: జూన్ 14 నుండి జూలై 04 వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్‌లైన్ అప్లికేషన్, సూచనలు http://studycircle.cgg.gov.in, http://twd.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో కలవు. మరిన్ని వివరాలకు ఫోన్ 6281766534 నంబరును అన్ని పని దినాలలో ఉదయం గం. 10:30 నుండి సాయంత్రం గం. 5 లోపు సంప్రదించగలరని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.

గంగపుత్ర సంఘానికి మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్లికార్జున నగర్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా మల్లికార్జున నగర్ లోని గంగపుత్ర సంఘానికి పవర్ బోరుతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యేలు కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే నిధులతో గంగపుత్ర సంఘానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు బాలయ్య, ఐలయ్య, జి.బాలయ్య, ధర్మపురి, విశ్వనాథ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గాంధీ భవన్‌లో ఎంపీ.చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వికలాంగుల కార్పోరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ వికలాంగులకు స్వర్ణయుగం ప్రారంభమైందని అన్నారు. దేశ చరిత్రలోనే వికలాంగులకు 40 శాతం వైకల్యంకే ఉచిత పరికాలు అందించేలా జీఓ 89 తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. అదేవిధంగా వికలాంగులు అయిన వారు వికలాంగులను పెళ్ళి చేసుకుంటే వారికి ప్రోత్సాహం కింద రూ.లక్షను ఇవ్వడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగులకి ఉన్నత విద్యలో 5 శాతం రిజర్వేషన్, కోర్టు ఉద్యోగాలలో 5శాతం రిజర్వేషన్, నిరుద్యోగులకి ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా వికలాంగుల సహకార సంస్థలో వికలాంగ ఉద్యోగులకు 15 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 2010, 2015, 2020 పీఆర్సీలను విడుదల చేయడంతో పాటు హైదరాబాద్ జిల్లాలో 7 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 18 మంది వికలాంగులకి బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో 5శాతం రిజర్వేషన్, రాజీవ్ యువ వికాసంలో 5శాతం రిజర్వేషన్, అన్ని పోలీస్ స్టేషన్లలో పకడ్బందీగా వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం రక్షణ కల్పించేలా ఉత్తర్వులతో పాటు ఇప్పటికే అనేక అంశాల్లో వికలాంగుల సంక్షేమం కోసం జీఓలు ఇచ్చి అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ చారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దేశగాని సతీశ్ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సిరిగిరి రజినీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మధ్యపాగ సురేష్, మేకల సమ్మయ్యతో పాటు వికలాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చేగువేరా చిత్ర పటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ నెల్లికంటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాటం నిర్వహించిన విప్లవకారుడు చేగువేరా అని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చేగువేరా 97వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దం భవన్‌లో చేగువేరా చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ విప్లవకారులకు చేగువేరా మార్గదర్శకమని, స్ఫూర్తిదాయకమైన వారన్నారు. ప్రపంచంలోనే అనేక దేశాలలో ముఖ్యంగా అమెరికాలోని సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా క్యూబా దేశంలో ఫెడరల్ క్యాస్ట్రో నాయకత్వంలో ప్రముఖ పాత్ర పోషించి ఆ దేశంలో విప్లవం సాధించారని, లాటిన్ అమెరికా దేశాలలో జరుగుతున్న సామ్రాజ్యవాదం పై పోరాటం నిర్వహించారన్నారు. ప్రపంచ యువతరానికి, విప్లవకారులకు, కమ్యూనిస్టులకు ఆయన స్ఫూర్తిదాయకమని వారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి ఎ.గోవిందరావు, బిల్డింగ్ ఇన్చార్జి బోయ శ్రీరాములు, ఓయు విద్యార్థి నాయకులు రహమాన్, విద్యార్థి నాయకులు ఆంజనేయులు, దశరథ, విజయ్ కుమార్, సందీప్, శివకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా-యుకె వాణిజ్యానికి కొత్త గేట్లు : ఎఫ్‌టీఏ చర్చలో ప్రకటన

ముంబై: పీఎల్ క్యాపిటల్- ప్రభుదాస్ లిల్లాదర్, భారతదేశంలోని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థల్లో ఒకటి. ఇటీవలి ఇండియా-యుకె ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఎఫ్‌టీఏ)కి సంబంధించిన వ్యూహాత్మక, ఆర్థిక అంశాలపై లోతైన విశ్లేషణను అందించేందుకు ప్రత్యేకమైన ఉన్నత స్థాయి ప్యానెల్ చర్చను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఆతిథ్యమిచ్చిన పీఎల్ క్యాపిటల్ చైర్‌పర్సన్, ఎండీ అమిషా వోరా, యుకె ట్రేడ్ కమిషనర్ హర్జిందర్ కాంగ్‌ను ఫోరమ్‌లో ఆహ్వానించి ప్రారంభించగా, కో-ప్యానలిస్టులు మనీష్ సింగ్ (సీఐఓ, క్రాస్ బ్రిడ్జ్ క్యాపిటల్), అనుజ్ అగర్వాల్ (గ్రూప్ చీఫ్ ఎకనామిస్ట్, వెల్‌స్పన్ గ్రూప్) కూడా పాల్గొన్నారు. ఎఫ్‌టీఏ భారతదేశం వాణిజ్య వ్యూహాన్ని 'టారిఫ్-ఫస్ట్' నుండి 'ట్రస్ట్-ఫస్ట్' మోడల్ వైపు మళ్లిస్తోందని, ఇది సేవలు, తయారీ, మూలధన ప్రవాహాల్లో 120 బిలియన్ డాలర్ల వరకు అవకాశాలను అన్లాక్ చేయగలదని" అమిషా వోరా, చైర్‌పర్సన్, ఎండి, పీఎల్ క్యాపిటల్ తన ప్రారంభ వ్యాఖ్యల్లో పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న రంగాల పరంగా, యూకేకు భారతదేశం ఎగుమతుల్లో 72% వరకూ వాణిజ్య మిగులు ఉన్నట్లు ఆమె వివరించారు.

రక్తదానం అనేది మానవాళికి పవిత్ర సేవ

రక్త సేకరణలో రెడ్ క్రాస్ సేవలు చిరస్మరణీయం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రక్తదానం అనేది సేవ అనేదానికంటే మానవాళికి పవిత్ర సేవ అని అనడం సరైదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2025 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్‌లోని సంకృతిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాతలందరికీ వారి ప్రాణాలను కాపాడే సేవకు ధన్యవాదాలు తెలిపారు. దీనిని "సేవ" - మానవాళికి పవిత్ర సేవ అని పిలిచారు. వారి నిస్వార్థ సహకారం ప్రాణాలను కాపాడటమే కాకుండా, కష్టాల్లో ఉన్న లెక్కలేనన్ని కుటుంబాలకు ఆశను తెస్తుందని ఆయన అన్నారు. స్వచ్ఛంద రక్తదానానికి నిరంతరం మద్దతు ఇచ్చే ప్రేరేప కులు, నిర్వాహకులు సిఎస్ఆర్ భాగస్వాముల కృషిని ఆయన ప్రశంసించారు. సురక్షితమైన, సమర్థవంతమైన రక్త సేకరణను నిర్ధారించడంలో వైద్యులు, రెడ్ క్రాస్ వాలంటీర్ల పాత్రను కూడా ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ పరివార్ సభ్యులు, భద్రతా సిబ్బంది శిబిరంలో చురుకుగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం గవర్నర్ రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. సామాజిక సేవ సీఎస్ఆర్ మద్దతు ద్వారా అత్యుత్తమ కృషి చేసిన ఎన్‌జీఓలు, సంస్థాగత ప్రతినిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఆర్‌సిఎస్ తెలంగాణ చైర్మన్ దాన కిషోర్, గవర్నర్ జాయింట్ సెక్రటరీ జె. భవాని, శంకర్ సీనియర్ రాజ్ భవన్ అధికారులు ఐఆర్‌సిఎస్ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు స్వచ్ఛంద సేవకులు ఇతర అతిథులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ "ప్రతీ అడుగు పచ్చదనం" నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతుందని, దీనిలో అధికారులు, ఉద్యోగులు, స్థానికులు అందరూ పాల్గొనేలా ప్రత్యేక చొరవ చూపాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. శనివారం ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల్లోని జనరల్ మేనేజర్లతో వివిధ అంశాలపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనిని విజయవంతం చేయడం కోసం ప్రతీ ఒక్కరూ తమకు సాధ్యమైనన్ని మొక్కలు నాటే విధంగా చొరవ చూపాలని కోరారు. నీటి బిందువు జలసింధువు" కార్యక్రమంలో భాగంగా మొత్తం 62 మినీ చెరువుల నిర్మాణంలో ఇప్పటికే 60 చెరువులు పూర్తవడం సంతోషకరమని, మిగిలిన చెరువులు కూడా మరో వారంలోపు పూర్తి చేయాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా సమీప గ్రామాల్లో 43 చెరువుల్లో మట్టి పూడికలు తీయాలని నిర్ణయించామని, వీటిలో ఇప్పటికి కేవలం నాలుగు మాత్రమే పూర్తయ్యాయి. కనుక మిగిలినవి త్వరగా పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం కోసం ఇకపై సింగరేణి సంస్థ నుండి జి 14, జి 15 గ్రేడు గల బొగ్గు రవాణాను పూర్తిగా నిలిపివేయాలని, దానికి బదులు జి 13 గ్రేడ్ బొగ్గును సరఫరా చేయటానికి తగు ఏర్పాటు చేయాలని జనరల్ మేనేజర్లను ఆదేశించారు. చిన్న తరహా పరిశ్రమల వారు తమకు కావలసిన తక్కువ మోతాదు బొగ్గును సింగరేణి ఏరియాలకు వచ్చి తీసుకువెళ్లడం అంత వెసులుబాటు కావడం లేదని గమనించబడిందని, వీరి సౌకర్యం కోసం హైదరాబాదుకు సమీపంలో ఒక బొగ్గు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులని ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనులలో సాండ్ స్టోయింగ్ కోసం గోదావరి నది నుండి ఇసుక సేకరణకు గాను వెంటనే క్వారీ ఏర్పాటుకు అనుమతులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఈ అండ్ ఎం.డి.సత్యనారాయణరావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని, జనరల్ మేనేజర్ సి.పి.పి ఏ.మనోహర్, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్.వి.రాజశేఖర్ రావు, కార్పోరేట్ నుండి వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, ఏరియాల్లోని జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

టీపిసిసి అధ్యక్షుని కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందనే విషయాన్ని ప్రస్తుత మంత్రివర్గ విస్తరణతో పాటు టీపిసిసి కమిటీ ఏర్పాటుతో మరోసారి నిరూపితం అయిందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం అయన గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రివర్గంలో తనకు అవకాశం కల్పించినందుకు అందుకు సహకరించినందుకు అయన మహేష్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. బిసి బిడ్డ శ్రీహరికి మంత్రి పదవి రావడం హర్షణీయమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటుందని, అన్ని పదవులలో బిసిలకు, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత కల్పిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. తనకు మంత్రి పదవి ఇచ్చినందుకు తన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహిస్తానని, నాకు మంత్రిగా అవకాశం ఇచ్చిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు జీవితాంతం రుణపడి ఉంటా అంటూ వ్యాఖ్యానించారు. నేను చచ్చే వరకు ప్రజల్లో ఉండి, ప్రజలకు సేవ చేస్తానని, తనకు ఈ అవకాశం కల్పించిన మక్తల్ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన చేశారన్నారు. రాజకీయల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తి పీసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అని, నేను మంత్రి కావడానికి సహకరించిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విలువలు కలిగిన మహనీయుడు చేగువేరా

విశాలాంధ్ర - హైదరాబాద్ : గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తీభవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నస్టో చేగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. చేగువేరా 97వ జయంతిని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాల యం (సత్య నారాయణ రెడ్డి భవన్)లో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని వారు ఉద్ఘాటించారు. వంద పండ్లను ఒక్కడే దాచుకోవడం క్యాపిటలిజం- ఉన్నదాంట్లో అందరూ పంచుకోవడం కమ్యూనిజం అని చెప్పిన చేగువేరా మాటలు ప్రజా ఆకాంక్షలకు అద్దం పడుతుందన్నారు. చేగువేరా అమెరికన్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అనేక పోరా టాలు నిర్వహించాడని వారు అన్నారు. విప్లవం అనేది పక్వానికొచ్చినప్పుడు కిందపడే ఆపిల్ పండు కాదని- మనమే దాన్ని పోరాడి సాధించుకోవాలన్న చేగువేరా మాటలు నేటి ప్రపంచానికి పోరాట పటిమను చూపుతుందని వారు ఉద్ఘాటించారు. ముఖ్యంగా స్థానిక ప్రజలను చైతన్యవతుల్ని చేసి వారిని విప్లవోద్యమం వైపు మళ్ళించకుండా విప్లవాన్ని విజయవంతం చేయడం అసాధ్యమని చెప్పారన్నారు. రైతాంగం, కార్మిక వర్గం అనే రెండు పట్టాల మీద విప్లవమనే రైలు ప్రయాణం చేయాల్సి ఉంటుందని, తడిమట్టి ముద్ద, మార్క్సిజం మౌళిక భావనలు రెండూ ఒక్కటే అన్నారు.

కుమ్మరి కళాకారుని చేతుల్లో ఆ చక్రం మీద మనిషి అవసరం కోసం వివిధ ఆకృతుల్ని రూపొందించినట్లుగా ఆయా సమాజాల భౌతిక పరిస్థితుల్ని బట్టి మార్క్సిజాన్ని అన్వయించు కోవచ్చన్నారు. ఎన్ని రాజకీయ అభిప్రాయాలున్నా, సైద్ధాంతిక విభేదాలున్నా అంతిమంగా ప్రజల విముక్తే విప్లవకారుడి ధ్యేయం కావాలన్నారు. విత్తు నాటే ముందు వాన కురవాలి. పిడుగు పడే ముందు ఉరుము గర్జించాలి. ఒక విప్లవానికి ముందు త్యాగాలు జరిగి తీరాలని అనేక సందర్భాల్లో చెప్పారన్నారు. క్యూబా దేశంలో విద్య, వైద్యం ఉచితమని ఈ దేశాన్ని ఆదర్శంగా తీసుకుంటే ప్రపంచదేశాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. చేగువేరా తాను జీవితాంతం ఏ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాడో అదే అతన్ని ఫ్యాషన్ ఐకాన్‌గా మార్చేసి, ఆయన పేరు మీద నేటికీ వందల కోట్ల వ్యాపారం చేయడం విషాదకరమన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివ కుమార్, రాజేష్, మహమూద్, మాజీద్, మహేష్, మధు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలి



విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ సేవలు అపారమైనవనీ కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత రత్న ప్రకటించాలని తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి సురేందర్ కోరారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, దళిత బాంధవుడు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఇటీవల బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాల్సిందేనని అనటం సరైనదేనని అన్నారు. ఐదు దశాబ్దాలుగా పార్లమెంటేరియన్‌గా వివిధ మంత్రి పదవులను విజయవంతంగా దేశానికి ఎన్నో సేవలు అందించారు. అన్ని వర్గాల ప్రజలకు తన అపారమైన అనుభవంతో అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బాబు జగ్జీవన్‌రామ్ సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించాలని సురేందర్ డిమాండ్ చేశారు.

జాతీయ జట్టుకు ఎంపికైన బాలికలకు అభినందనలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ నుండి ఆసియా కప్ భారత మహిళా సాఫ్ట్ బాల్ జట్టుకి ఎంపికైన చెపుర్వ ప్రవళికకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు. భారత జట్టు 2025 జూల్కె 14-20 వరకు చైనాలోని జియాన్‌లో జరిగే ఆసియా కప్ ఉమెన్ సాఫ్టబాల్ ఛాంపియన్‌షిప్ కోసం హైదరాబాద్‌కి చెందిన చెపుర్వ ప్రవళిక భారత్ జట్టుకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో అమెను మంత్రి పొన్నం చెపుర్వ ప్రవళికను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ నుండి భారత మహిళా జట్టు క్రీడాకారిణిగా చేపురువ ప్రవల్లిక ఎంపికవడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. చెపుర్వ ప్రవళికకు ప్రత్యేక కోచింగ్ క్యాంప్ జూన్ 20 నుండి జూన్ 25, 2025 వరకు శ్రీనగర్‌లో జరుగుతుంది. చైనాలోని జియాన్‌లో జరగనున్న ఆసియా కప్ సాఫ్ట్ చెపుర్వ ప్రవళిక ఆసియా కప్ బాల్ పోటీల్లో ప్రవళిక బాగా రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

కేటీఆర్‌కు ఇంగ్లీష్ ఫుల్.. సబ్జెక్ట్ నిల్

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ట్విటర్ టిల్లు కేటిఆర్‌కు ఇంగ్లీష్ ఫుల్, సబ్జెక్ట్ నిల్ అంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. పార్ములా ఈ కార్ రేసులో నోటీసులు ఇవ్వడంతో ఫ్రస్టేషన్‌తో లై డిటెక్టర్ చేయించుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఛాలెంజ్ చేస్తున్నాడు కాని డ్రగ్స్ కేసులో డ్రగ్ టెస్ట్ చేసుకోమని రేవంత్ రెడ్డి ఛాలెంజ్ విసిరితే కేటిఆర్ ఎందుకు వెనక్కి పోయిండని నిలదీశారు. మీరు లై డిటెక్టర్ పెట్టుకుంటే కోర్టులు ఎందుకు ఉన్నట్టు అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ఓవర్ యాక్షన్‌తోనే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు. ఈ కార్ రేసులో పాలనా అనుమతులు లేకుండా 44 కోట్లు ఎట్లా తరలించారు అని ఏసీబీ కేటిఆర్‌ను అడుగుతుందని, ఏజెన్సీలు విచారణ చేయడం తప్పా అంటూ నిలదీశారు. కాంగ్రెస్ ది వెండెట్టా పాలిటిక్స్ అని కేటిఆర్ అంటుండు, కాంగ్రెస్ ది వెండెట్టా పాలిటిక్స్ కాదు, ప్రజా పాలన అంటూ వ్యాఖ్యానించారు. మొన్న మా నాన్న చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్న కవిత మళ్ళీ ఈరోజు మా వర్కింగ్ ప్రెసిడెంట్‌కు నోటీసులు ఎట్ల ఇస్తారు అంటుందని దుయ్యబట్టారు. ఇదంతా డ్రామా కంపెనీ అని అర్థం అయిందని, రెండు మూడు నెలల నుండి మంత్రులు యంత్రాంగం ప్రజల్లో ఉండి సన్న బియ్యం అందుతున్నాయని క్షేత్ర స్థాయిలో తెలుసుకుంటున్నారన్నారు. దేవాలయం లాంటి అసెంబ్లీకి ప్రతిపక్ష నాయకుడుగా రావాలనే ఆలోచన లేదని, ఇది కాదు ప్రతి పక్షం నేత చేయాల్సిందన్నారు.

హిమాలయ బేబీకేర్ 'జెంటిల్ యాజ్ డాడ్' క్యాంపెయిన్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశంలో నెంబర్ వన్ డాక్టర్ ప్రిస్క్రైబ్ చేసే బేబీకేర్ బ్రాండ్ హిమాలయ బేబీకేర్ ఫాదర్స్ డే సందర్భంగా హృదయాన్ని హత్తుకునే వీడియో ఫిల్మ్‌ను విడుదల చేసింది. ప్రసిద్ధ కన్నడ పాట 'ఐ లవ్ యూ అప్పా' స్ఫూర్తిగా తీసుకుని రూపొందించిన ఈ 'జెంటిల్ యాజ్ డాడ్' క్యాంపెయిన్ తండ్రి, కూతురి మధ్య అనుబంధాన్ని ఎంతో భావోద్వేగంతో చెబుతుంది. పుట్టుక నుంచి పెళ్లి వరకు గల బంధం ఇందులో ఉంది. ప్రాంతీయ ప్రేక్షకులతో అనుబంధం ఏర్పడేలా ఈ పాటను హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, మరాఠీ, బెంగాలీ భాషలలోకి అనువదించారు. తండ్రిని కేవలం సంరక్షకుడిగా మాత్రమే కాకుండా, ఒక బలమైన ఆధారంగా కూడా ఇందులో చూపిస్తారు. పిల్లల జీవితంలో తండ్రి పాత్ర ఈ ప్రచారంలో హృదయాన్ని తాకుతుంది. శాస్త్రీయతతో హెర్బల్ కేర్‌ను అందించే ఈ ఉత్పత్తులు తండ్రి పాత్రను మరింత అర్థవంతంగా చూపిస్తూ, ప్రేమ, పెంపకం, మార్గదర్శనం వంటి ప్రతి అంకంలో ఓ మౌన భాగస్వామిగా ఎంతో హృద్యంగా ఉంటుంది. ఈ సందర్భంగా హిమాలయ వెల్‌నెస్ కంపెనీ బేబీకేర్ డైరెక్టర్ చక్రవర్తి ఎన్వీ మాట్లాడుతూ తండ్రి ఎప్పుడూ పిల్లల జీవితంలో మౌనమైన ఆధార స్తంభాలుగా ఉంటారన్నారు. ఎప్పుడూ పిల్లల వెనుక నిలబడి ప్రేమతో వారి ప్రపంచాన్ని నిర్మించే వారుగా ఉంటారని తెలిపారు. ఈ క్యాంపెయిన్తో తండ్రుల శక్తిని గౌరవించాలనుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషియల్ పంగా సహస్థాపకుడు హిమాన్షు అరోరా మాట్లాడుతూ ఈ ఫాదర్స్ డే సందర్భంగా మా ప్రచారం తండ్రులు, కూతుళ్ల మధ్య ఉన్న శాశ్వత బంధాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఓ తండ్రిగా ఈ అనుబంధం నాకు వ్యక్తిగతంగా ఎంతో విలువైనదన్నారు. కూతురు ఎంత వయసు వచ్చినా తన తండ్రికి ఎప్పటికీ చిన్నపాపే అన్నారు.

మీసేవ ప్రతినిధుల కోసం

ఈ-కామర్స్‌పై ఫ్లిప్‌కార్ట్ వర్క్‌షాప్

విశాలాంధ్ర - కరీంనగర్ : భారతదేశంలోని స్వదేశీ ఈ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి, మీసేవ ప్రతినిధులకు ఈ-కామర్స్ ద్వారా స్థానిక వ్యాపారాలకు మార్కెట్ అవకాశాలను సులభతరం చేయడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను సమకూర్చడం లక్ష్యంగా వర్క్‌షాప్‌ను నిర్వహించింది. తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ (ఐటీఈసీ) విభాగం, పరిశ్రమలు, వాణిజ్య విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఐఏఎస్, తెలంగాణ ప్రభుత్వ కమిషనర్, మీసేవ (ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ) రవికిరణ్ తిరుమల, ఐఎఫ్ఎస్, ఫ్లిప్‌కార్ట్ సీనియర్ మేనేజర్ డాక్టర్ దీపు థామస్ జాయ్ సమక్షంలో ఈ వర్క్‌షాప్ జరిగింది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ సిటిజన్ సర్వీసెస్ పోర్టల్ అయిన మీసేవ, ప్రభుత్వం నుండి పౌరులకు (జి 2సి), వ్యాపారం నుండి పౌరులకు (బి2సి) విస్తృత శ్రేణి సేవలను అందిస్తుంది. డిజిటల్ అవకాశాలు పెంపొందించడానికి కొనసాగుతున్న ప్రయత్నాలలో భాగంగా, తెలంగాణ ప్రభుత్వం మీసేవ ఆఫర్లలో ఈ-కామర్స్ సౌకర్యాన్ని చేర్చాలని భావిస్తోంది. ప్రతిపాదిత వర్క్‌షాప్ ఫ్లిప్‌కార్ట్ ప్లాట్‌ఫామ్‌లోకి వ్యాపారాలను ఆన్‌బోర్డింగ్ చేయడంలో వివిధ అంశాలను ప్రతినిధులకు పరిచయం చేస్తుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో సజావుగా ఏకీకరణను నిర్ధారిస్తుంది. ఈ వర్క్‌షాప్‌లో 800 మందికి పైగా మీసేవ ప్రతినిధులు, ఎంఎస్ఎంఈలు పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.